

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక


స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 325 • పేజీలు : 12 • శనివారం 17 ఆగస్టు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole|Nellore Tirupati


- ప్రణాళికలు అందించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్..
- పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు, సలహాలు
- స్టేట్ ఆఫ్ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ సంస్థ ఏర్పాటు
- పారిశ్రామిక వేత్తలు, ఆయా రంగాల నిపుణులతో టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు
- పారిశ్రామికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై పనిచేయనున్న టాస్క్‌ఫోర్స్
- 2047 నాటికి ఏపీని నంబర్ వన్ ప్లేస్‌లో నిలపడమే మా లక్ష్యం
- 2047 ఆర్థికాభివృద్ధి కోసం టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం..
- వివిధ రంగాలలో అనేక ఇతర కంపెనీల భాగస్వామ్యం కల్పించాలి..



## ఎపికి పెట్టుబడులు రావాలి

◆ ఎపి సిఎం చంద్రబాబునాయుడుతో టాటా గ్రూప్ చైర్మన్ భేటీ

**అమరావతి,ఆగస్టు16 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం అయ్యారు టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్..పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రణాళికలు అందించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం.. దేశంలో పేరున్న పారిశ్రామిక వేత్తలు, ఆయా రంగాల నిపుణులతో టాస్క్ ఫోర్స్ మిగతా 7లో

## వాజ్‌పేయికి ఘన నివాళులు

నివాళులర్పించిన ప్రధాని నరేంద్ర మోదీ,ప్రముఖులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 16 :** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని 2018 ఆగస్ట్ 16న దేశం కోల్పోయింది. అటల్ జీ ఆరవ వర్ధంతి. ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని సాద్వ్ అటల్ వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి నివాళులర్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, లోక్‌సభ మిగతా 7లో

## ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం





**శ్రీహరికోట,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):**భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో మరో ఘనత సాధించింది. శ్రీహరికోట షార్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇవాళ ఉదయం సరిగ్గా 9 గంటల 17 నిమిషాల కునిప్పులు చిమ్ముతూ అంతరిక్షంలోకి వెళ్లింది. 17 నిమిషాల పాటు సాగిన ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో మిగతా 7లో

## బంధాలు,బిజినెస్ ఒకటి కాదు..

- అజిత్ పవార్‌కు సుప్రియా సూలే కౌంటర్



**న్యూఢిల్లీ,ఆగస్టు 16 :** ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్) ఎంపీ సుప్రియా సూలే.. తన సోదరుడు, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో రాష్ట్రప్రభుత్వానికి తమ ప్రియమైన సోదరీమణులను గుర్తుకు రాలేదు కానీ..అసెంబ్లీ ఎన్నికల వేళ వారి ప్రేమ మిగతా 7లో

## నేడు వైద్య సేవలు బంద్

- జూనియర్ డాక్టర్ హత్యపై దేశవ్యాప్తంగా నిరసనలు
- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కీలక ప్రకటన



**న్యూఢిల్లీ,ఆగస్టు 16 :** కోల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో 31 ఏళ్ల జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యపై దేశవ్యాప్తంగా మిగతా 7లో

## మంకీఫాక్స్ అంటువ్యాధి

- మంకీఫాక్స్‌ను గ్లోబల్ ఎమర్జెన్సీగా ఆరోగ్య సంస్థ ప్రకటన
- ఆఫ్రికా దేశంలో 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదు




**న్యూఢిల్లీ, ఆగస్టు 16 :** కరోనా కంటే మంకీఫాక్స్ డేంజర్,ఇది అంటువ్యాధి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ ఎమర్జెన్సీగా ప్రకటన జారీ మిగతా 7లో

## ఎపికి వాతావరణశాఖ హెచ్చరిక



- బంగాళాఖాతంలో మరో అల్పపీడనం - ఎపికి పొంచి ఉన్న భారీ వర్షముప్పు - వచ్చే రెండు రోజులపాటు కురువనున్న వర్షాలు

**అమరావతి,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** వాయువ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతాల మీద అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుసంధానంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 కిమీ ఎత్తు వరకు మిగతా 7లో

## మరిన్ని విజయాలు సాధించాలి



- రాకెట్ ప్రయోగం విజయవంతం దేశానికి గర్వకారణం
- డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్వి-డీ3 విజయం దేశానికి గర్వకారణం అని డిప్యూటీ మిగతా 7లో

## ఆ ఉద్యోగులకు ఏడాదిపాటు ఉచిత వసతి..

- మరో ఏడాదిపాటు ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- ఉత్తర్వుల్లో పేర్కొన్న సాధారణ పరిపాలన శాఖ




**అమరావతి,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చి పనిచేస్తోన్న ఉద్యోగులకు ఉచిత వసతి సదుపాయాన్ని ప్రభుత్వం పొడిగించింది. సచివాలయం, అసెంబ్లీ, హెచోడీ, రాజ్‌భవన్ ఉద్యోగులకు ఈ సదుపాయాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ మిగతా 7లో



## ఎపిలో ఐపిఎస్‌ల బదిలీ

- ఎపిలో 10 మంది ఐపీఎస్‌ల బదిలీలు
- శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన ఎపి ప్రభుత్వం

**అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** పది మంది ఐపీఎస్ అధికారుల్ని బదిలీ చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ఈ మిగతా 7లో

## ఇసుక దందాలపై చర్యలు

- ప్రజలను,కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదు..
- రెడ్ బుక్ విషయంలో ఊరూరూ వెళ్లి మాట్లాడను
- ఎపిలో మరో 99 అన్న క్యాంటీన్లు ప్రారంభం
- మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు



**అమరావతి,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నులకపేట ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను మిగతా 7లో

## త్వరలోనే పోలవరం పనులు..!



- డిజైన్,నిర్మాణ అంశాలపై వర్క్ షాప్ ఏర్పాటు
- నీటిమట్టం 8 మీటర్ల దిగువన ఉండేలా పంపింగ్
- విదేశీ నిపుణుల బృందం కీలక సూచనలు
- ప్రాజెక్టును పర్యవేక్షించిన ఇంజినీర్ల బృందం

**అమరావతి,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టుల్లో కీలకమైనది పోలవరం ప్రాజెక్టు.. అయితే, పోలవరం ప్రాజెక్టు సవాళ్లపై అధ్యయనం చేసిన విదేశీ నిపుణుల బృందం కీలక సూచనలు చేసింది. వర్షాకాలం మిగతా 7లో

## వెయిటింగ్‌లో ఉన్న ఐపిఎస్‌లు..




- వెయిటింగ్‌లో ఉన్న 16 మంది ఐపిఎస్‌లు
- వరుసగా సెలవులకు దరఖాస్తు చేసుకున్న ఐపిఎస్‌లు
- కార్యాలయంలోనే ఉండి సంతకం చేశాకే మళ్లీ బయటకు రావాలని డిజిపి ఆదేశాలు

**అమరావతి,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** ప్రభుత్వం మారిన తర్వాత బదిలీ అయ్యి, పోస్టింగు లేకుండా వెయిటింగ్లో ఉన్న పలువురు మిగతా 7లో

## జమ్ము-కశ్మీర్,హర్యానా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

- సెప్టెంబర్ 18న తొలిదశ,25న రెండో దశ ఎన్నికలు..
- అక్టోబర్ 1న మూడో దశ ఎన్నికలు..4న ఫలితాలు
- మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు
- మొత్తం మూడు దశల్లో జరగనున్న ఎన్నికలు
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ





**న్యూఢిల్లీ,ఆగస్టు 16 :** జమ్ము-కశ్మీర్‌తో పాటు హర్యానా రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. పలు దశల్లో సమీక్షల అనంతరం కశ్మీర్‌లో ఎన్నికలకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని పార్టీల అభిప్రాయాలు కూడా తీసుకున్నామని.. ఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. మొత్తం మూడు దశల్లో మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# దేశ సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ !

దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రధానికి అవగాహన లేనట్లుగా ఉంది. లేదా..కావాలనే వాటిని పట్టించుకోవడం లేదా.. అన్నది అర్థం కావడం లేదు. ప్రధాని మోడీ ఎర్రకోట వేదికగా చేసిన ప్రకటనలపై విమర్శలు ఎలా ఉన్నా.....దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలపై ప్రధాని మోడీ ఎక్కడా తన ప్రసంగంలో ప్రకటించలేదు. ఇంట్లో ఈగల మోత ..బయట పల్లకి మోత అన్న చందంగా మోడీ తీరు ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించరు. ప్రస్తావించరు. చెబితే వినరు అన్న చందంగా మోడీ పదేళ్ళ పాలన సాగింది. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై ప్రస్తావనా లేదు. 2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని తెలిపారు. ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత దేశం ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమని, అలాగే న్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరమని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, 'వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది ప్రజల కలల తీర్మానమని అన్నారు. ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నాయి. లక్ష్యం ఉండాల్సిందే. కానీ గత పదేళ్ల కాలంలో ప్రజల జీవన ప్రమాణాలు ఏ మాత్రం పెరిగింది..కొనుగోలు శక్తి పెరిగిందా లేదా అన్న చర్చ చేయడం లేదు. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని, వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని, వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పు తెచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉత్తరాదిలో అతలాకుతలం చేసిన వరదలు, కొండచరియలు విరిగి పోవడం, మణిపూర్‌లో ఊచకోతలు, ధరల పెరుగుదల,నిరుద్యోగం, ఆర్థికమాంద్యం కోసం తీసుకునే చర్యల గురించి ప్రస్తావించ లేదు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ఏటా మాట్లాడుతూ ప్రస్తావించిన అంశాలు ఏవీ అమలు కావడంలేదు. ఇప్పుడు కొత్తగా మరో 25 ఏళ్ల దార్శనికత గురించి చెబితే ప్రజలు నమ్ముతారా అన్నది ఆలోచించడం లేదు. ధరల పెరుగుదల, రూపాయి పతనం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం ఇప్పుడు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటోందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక కావాలి. ప్రధాని మోడీ ఈ విషయాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. ఎర్రకోట ప్రసంగంలోనూ వీటి గురించి ప్రస్తావించలేదు. వీటిని ఎలా అధిగమించ బోతున్నారో కూడా చెప్పడంలేదు. గతంలో చెప్పిన వాగ్దానాలేవీ అమలుకాలేదు. తన ప్రభుత్వం సాధించిన విజయాలను,చేపట్టిన సంక్షేమ పథకాలను, సంస్కరణలను ఎంతగొప్పగా చెప్పినా పొయ్యిలో పిల్లి లేవని కుటుంబాలు కోకొల్లలు. ఇన్ని చెప్పిన ప్రధాని మోడీ మన రూపాయికి శస్త్రచికిత్స చేసే విషయాన్ని మరచి పోయారు. రూపాయి రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నా ప్రస్తావించడంలేదు. రూపాయి విలువ పెరగ లేదు సరికదా మరింత దిగజారుతున్నా పట్టుకుని నిలపాలన్న తపన కానరావడం లేదు. కనీసం దానిని తాను అధికారం చేపట్టిన నాటి స్థాయికి తీసుకుని వద్దామన్న ప్రయత్నం కూడా చేయడం లేదు. ఈ మాంద్యాన్ని గమనించి అడుగులు వేద్దామన్న చిత్తశుద్ధి కానరావడం లేదు.అందుకే మోడీ ఎర్రకోట ప్రసంగం పై ఎక్కడా ఆసక్తి గానీ, ఆయన పిలుపుపై స్పందన గానీ కానరావడం లేదు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి తొలినాళ్ల హామీలను ఇప్పుడు ఎక్కడా ప్రస్తావించడం లేదు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగంపైనా ప్రధాని పెదవి విప్పడంలేదు. ఇలా సమస్యలు వెన్నాడుతున్నా.. ప్రజలను పట్టించుకోకుండా మరోమారు ఓటేశారు. ఓ రకంగా సుతిమెత్తగా హెచ్చరించారు. సీట్ల సంఖ్య తగ్గించి తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. అయినా ఆయన ఆలోచన ధోరణి మారడం లేదు. వంచనలతో పాలన చేయలేమని మోడీతో పాటు,రాష్ట్రాల సిఎంలు కూడా గుర్తించాలి. నిరుద్యోగం,ద్రవ్యోల్బణం, జీఎస్టీలతో నిలువుదోపిడి చేస్తున్న తీరుపై స్పష్టత లేకుండా ఎంతకాలం మోసం చేస్తారు. అచ్ఛేదిన్ వాగ్దానం చేసి మరచిపోతే ఎలా అన్నది మోడీ గుర్తు చేసుకోవాలి. పాలకులు తాముచేసిన వాగ్దానాలపై కసరత్తు చేయకుండా మరింతగా ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎలా అన్నది మననం చేసుకోవాలి. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్.. అమృత్ కాల్, ఆజాదీకా అమృత్ మహోత్సవం ఇలా నినాదాలతో ప్రజల కడుపులు నిండవని గుర్తించాలి. అందుకేనేమో కొత్తగా వికసిత భారత్ లక్ష్యాన్ని ప్రకటించారు. 2047 నాటికి వికసిత భారత్ కావాలన్న ఆకాంక్షను తెలియ చేశారు. ఇలా ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టడం వల్ల దేశం పురోగమించదని గుర్తించడం లేదు. అవరోధాలను, అవకాశాలను పారదర్శకంగా చర్చించి, భవిష్యత్ మార్గాన్ని సూచించడం విజ్ఞత అవుతుంది. కానీ సమస్యలను ముందు పెట్టుకుని వాటిని లేనట్లుగా చూపడం మోసం అవుతుంది. దేశ ఆర్థిక పరిస్థితి గతంలో ఓమారు దిగజారిన వేళ అప్పట్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పివి నరసింహారావు నడుం బిగించి చక్కదిద్దీ, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పడిపోతున్న రూపాయిని పట్టుకుని లేపారు. విదేశీమారక నిల్వలను నిలబెట్టారు. ఇప్పుడలాంటి చొరవ కానీ, దక్షత కానీ పాలకులుకు లేకుండా పోయింది. అనుత్పాదక రంగాలకు నిధులను వేలం వెర్రిగా ఖర్చు చేస్తూ పోవడం, దిగుమతులు పెంచడం వంటి చర్యలు దేశీయంగా ఆర్థికరంగాన్ని దెబ్బతీస్తూ వస్తోంది. ఉచిత పథకాలకు మంగళం పాడాల్సింది పోయి వాటిని పెంచుతున్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం చేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోని పాలకుల కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. ఇలాగే ఎపి, తెలంగాణలు దారుణంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయాయి. అయినా ఉచిత పథకాలను మానడం లేదు. పన్నులు వేయడం లేదంటూనే పరోక్షంగా పన్నులు వసూళ్లు చేస్తున్నారు. తాజాగా మరోమారు ఇలాంటి భయాలు వస్తున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలు పూనుకోకుండా నినాదాలకే పరిమితం కావడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం కాక మరోటి కాదు. ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను పొదుపు చేసి, ఆ నిధులను పెట్టుబడులుగా ఉపయోగించి, వస్తుసేవల ఉత్పత్తినీ, ఎగుమతులనూ వృద్ధి చేసినప్పుడు మాత్రమే స్థిరమైన ప్రగతిని సాధించగలం. దిగుమతులను తగ్గిస్తూ పోతూ, ఎగుమతులపై దృష్టి పెట్టాలి. అనవసర వస్తువులను అదేపనిగా దిగుమతి చేసుకోవడం తగ్గించాలి. ఇబ్బడిముబ్బడిగా ప్రపంచ మార్కెట్ మనపై పెత్తనం చేయకుండా చూసుకోవాలి. ఇవన్నీ మరచి ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎంతకాలం అయినా భారత్ పురోగతి సాధించదు. నిజానికి చిత్తశుద్ధితో సమస్య పరిష్కారినికి కృషి చేసివుంటే ఈ దశాబ్ద కాలంలో ఎంతో ప్రగతి సాధించేవాళ్లం. ఇప్పటికైనా ప్రజలు కళ్లు తెరవాలి. పాలకుల కళ్లు తెరిపించేలా చేయాలి.

# భారత పాకిస్థాన్ మధ్య చిచ్చు పెట్టిన హద్దుల విభజన

రాడ్ క్లిఫ్ రేఖ అంటే చాలా మందికి తెలియక పోవచ్చు. అది భారత, పాకిస్తాన్ మధ్య విభజన రేఖ. సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ నేతృత్వంలోని సరిహద్దుల కమిషన్ ఈ రేఖను నిర్ధారించింది. రాడ్ క్లిఫ్ రేఖ 1947 ఆగస్టు 17న భారత దేశ విభజన అనంతరం భారత పాకిస్తాన్ ల నడుమ సరిహద్దు రేఖగా ఏర్పరచారు. భారత్‌లో బ్రిటిష్ రాజ్యం మరో నెల రోజుల్లో, అంటే 1947 ఆగస్టు 15న ముగుస్తుందని భారత స్వాతంత్ర్య చట్టం, 1947 ద్వారా బ్రిటిష్ పార్లమెంటు 1947 జూలై 15న పేర్కొంది. భారత దేశాన్ని రెండు భాగాలుగా విభజించాలని కూడా అది వివరించింది. పాకిస్తాన్ ముస్లింల రాజ్యంగా కొనసాగాలని, అదే సమయంలో భారత్ హిందూ మెజారిటీతో కూడిన లౌకిక రాజ్యంగా ఉండాలని ఉద్దేశించారు. ఉత్తరాదిన ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతాలు పాకిస్తాన్ గా రూపుదిద్దు కోవాలని నిర్ణయించారు. బలూచిస్థాన్ (విభజనకు ముందు 91.8 శాతం ముస్లిం జనాభా), సింధ్ (72.7 శాతం ముస్లిం జనాభా) ప్రావిన్సులను పూర్తిగా పాకిస్తాన్ కు కేటాయించారు. అయితే, ఈశాన్య బెంగాల్ (54.4 శాతం ముస్లింలు), వాయవ్యాన పంజాబ్ (55.7 శాతం) ప్రావిన్సుల్లో పూర్తిగా ముస్లిం మెజారిటీ లేకపోయింది. దాంతో పంజాబ్ పశ్చిమ భాగం పశ్చిమ పంజాబ్ మారింది. తూర్పు ప్రాంతం పంజాబ్ రాష్ట్రం పేరుతో భారత్ లో అంతర్భాగమైంది. బెంగాల్ కూడా అదే మాదిరిగా తూర్పు బెంగాల్ పాకిస్తాన్ లో, పశ్చిమ బెంగాల్లో భారత్ లో విలీనమైంది. ఇక పంజాబ్ లో జనాభా విస్తృతి సంక్లిష్టంగా ఉంది. దాంతో దాన్ని హిందూ, ముస్లిం, సిక్కుల ప్రాంతాలుగా స్పష్టంగా విభజించ లేని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా మహ్మదాలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్, జవహర్ లాల్ నెహ్రూ, పటేల్ సారథ్యం లోని భారత జాతీయ కాంగ్రెస్, బ్రిటిష్ వారందరినీ సంతృప్తి పరిచే విభజన ప్రణాళిక కూడా ఏదీ లేకపోయింది. వీలనంత త్వరగా భారత్ ను విడిచి వెళ్లిపోవడమనే బ్రిటిష్ ప్రభుత్వ తక్షణావసరాల కారణంగా ఐక్యరాజ్య సమితి వంటి బయటి సంస్థల నిపుణులకు సరిహద్దు నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం లేకపోయింది. భారత వైస్రాయిగా పనిచేసిన లార్డ్ వేవెల్, అంతకు ముందు 1947 ఫిబ్రవరిలో లార్డ్ లూయిస్ మౌంట్బాటెన్ అప్పటికే ఒక సరిహద్దు రేఖను సిద్ధం చేశారు. రెండు దేశాలకు ఏయే ప్రాంతాలను అప్పగించాలో ఇదమిత్థంగా నిర్ధారించేందుకు 1947 జూన్ లో సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ ను బెంగాల్, పంజాబ్ సరిహద్దు కమిషన్లు రెండింటికీ ఛైర్మన్ గా బ్రిటన్ నియమించింది. పంజాబ్ లో ముస్లిం, ముస్లిమేతర మెజారిటీ ప్రాంతాలను వీలైనంత స్పష్టంగా విడదీస్తూ ఇరు ప్రాంతాల మధ్య సరిహద్దులను నిర్ధారించాల్సిందిగా కమిషన్ కు సూచనలందాయి. 1947 జులై 8న ఢిల్లీలో అడుగు పెట్టిన రాడ్ క్లిఫ్.. ఆగస్టు 12 నాటికి పూర్తి చేశారు. భారత్ గురించి ఏ మాత్రం తెలీకుండా.. చివరకు బెంగాల్.. పంజాబ్ ప్రాంతాలు ఎక్కడ ఉంటాయో కూడా తెలీకుండానే రాడ్ క్లిప్ దేశ విభజనను పూర్తి చేయటం విశేషం. భారత్ గురించి ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి, తనకు చెప్పిన పనిని చెప్పినట్లుగా చేయటం, అందుకు తనకున్న అవగాహనతో గీసిన గీతలు, నిర్ణయించిన హద్దులు, కోట్లాది మంది ప్రజల బతుకుల్ని, భవిష్యత్తును నిర్దేశించాయి. భారీ మారణ హెరీమానికి కారణ మయ్యాయి. జూలై 8న భారత్ వచ్చాక, రాడ్ క్లిఫ్ కు సరిహద్దు నిర్ణయానికి కేవలం 5 వారాలు మాత్రమే ఇచ్చారు. ఆయన వెంటనే తన కాలేజీ సహాధ్యాయి మౌంట్ బాటెన్ ను కలిశాడు. తర్వాత ఇద్దరూ లాహోర్, కలకత్తా వెళ్లి కమిషన్ సభ్యులను కలిశారు. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి నెహ్రూను, ముస్లిం లీగ్ అధ్యక్షుడు జిన్నాను కలుసుకున్నారు. అంత తక్కువ కాలావధి ఇవ్వడాన్ని ఆయన అభ్యంతర పెట్టారు. కానీ ఆగస్టు 15న భారత్ నుంచి బ్రిటిష్ వారు వెళ్లిపోయే లోపే ఈ పని పూర్తవాలని ఇరు వర్గాలూ పట్టుబట్టాయి. దాంతో మరో అవకాశం లేకపోయింది. ఈ తక్కువ డెడ్ లైన్ షరతు మీదే మౌంట్బాటెన్ భారత వైస్రాయి పదవిని అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని బ్రిటిష్ వారు వెళ్లిపోవడానికి కేవలం 2 రోజుల ముందే తీసుకున్నారు. కానీ రాజకీయ కారణాల వల్ల ఆగస్టు 17 దాకా, అంటే భారత్, పాకిస్తాన్లకు స్వాతంత్ర్యం ఇచ్చిన రెండు రోజుల దాకా దాన్ని బయట పెట్టలేదు. రాడ్ క్లిఫ్ తన నియామకానికి ముందు భారత్ ను ఒక్కసారి కూడా సందర్శించ లేదు. ఆయన వ్యక్తిగత కార్యదర్శి క్రిస్టోఫర్ బీమంటకు మాత్రమే పంజాబ్ జీవన విధానం, అక్కడి యంత్రాంగాన్ని గురించిన అవగాహన ఉంది.. తన వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉందని నిరూపించుకోవడానికి గాను కనీసం వైస్రాయ్ మైంట్బాటెన్ కూడా కలవకుండా రాడ్ క్లిఫ్ పూర్తి దూరం పాటించారు. రాడ్ క్లిఫ్ కు కేవలం నెల రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అనుకూలంగా గ్రామాలను విభజించడానికి జాగ్రత్తలు తీసుకునే సావకాశం చిక్కలేదు. ఆయన నిర్ధారించిన సరిహద్దు అస్తవ్యస్తమైంది. కొన్ని ప్రాంతాల మధ్య నుండి కాక నేరుగా వాటి మీదుగా వెళ్లింది. విభజన రేఖ ఒకే ఇంట్లో కొన్ని గదుల్ని భారత్ కు, మరికొన్ని గదుల్ని పాకిస్తాన్ కు కూడా కేటాయిస్తూ సాగిన ఉదంతాలు కోకొల్లలుగా ఉండడం గమనార్హం. రాడ్ క్లిఫ్ తాను భారత్ నుంచి వెళ్లే ముందు ఈ ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలనూ నాశనం చేశాడు. ఆయన స్వాతంత్ర్య దినం రోజునే భారత్ విడిచి వెళ్లిపోయాడు. తాను నిర్ణయించిన సరిహద్దులను సాధికారికంగా ప్రకటించడానికి కూడా ముందే దేశాన్ని వదిలాడు. అన్ని రికార్డులనూ రాడ్ క్లిఫ్ నాశనం చేయగా, మౌంట్బాటెన్ కూడా ఈ విషయాలు తనకేమీ తెలియదని చెప్పారు. విభజన అనంతరం. సరిహద్దు రేఖల నిర్ణయాన్ని అమలు చేసుకోవాల్సిన బాధ్యత భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలపై పడింది. 1947 ఆగస్టు 15న తాము సరిహద్దులకు ఏ వైపుకు చెందామన్నది అక్కడి గిరిజనుల్లో చాలామందికి తెలియక పోవడాన్ని బట్టి ఎంత అవగాహన రాహిత్యంతో విభజించారో అర్థం చేసుకోవచ్చు. చివరికి విభజన అమలు సందర్భంగా... ఉపఖండంలో దాదాపు 1.4 కోట్ల మంది ప్రజలు సొంత ఇళ్లను వదులుకున్నారు. బస్సులు, రైళ్లు, విమానాలు, కార్లు, లారీలు, ఎడ్లబళ్లు, ఇంకా అత్యధికులు కాలి నడకన తమ సొంత వారితో కలిసి ఆవాసాన్ని వెదుక్కునేందుకు బయల్దేరారు. వారిలో చాలామంది అవతలి పక్షం వారి చేతుల్లో హత్యకు గురయ్యారు. మరికొందరు ఆకలికి తాళలేక ప్రాణాలు విడిచారు. ఇంకా కొంతమంది ప్రాణాంతక వ్యాధులకు బలయ్యారు. ఈ మొత్తం ప్రక్రియలో మరణించిన వారి సంఖ్య కనీసం 2 లక్షల (ఇది ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం పేర్కొన్న గణాంకాలు) నుంచి 20 లక్షల దాకా ఉంటుందని అంచనా వేశారు. అంతిమంగా ఈ సరిహద్దు వివాదాలే భారత్, పాకిస్తాన్ మధ్య 1947, 1965, 1971ల్లో యుద్ధాలకు కూడా దారితీశాయి. 1998 మేలో కూడా ఇరు దేశాలూ అణ్వాయుధ పరీక్షలు జరిపేందుకు, 1999లో కార్గిల్ యుద్ధానికి కూడా అవే కారణమయ్యాయి. నాటి తొందరపాటు చర్యలతో అస్తవ్యస్త విభ జన ఫలితంగా నేటికీ భారత పాకిస్థాన్ దేశాల మధ్య వివాదాలు కొన సాగుతూ, పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే స్థితి నెలకొని ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల**



# మహానటి మంచి మనిషి సావిత్రి

30, 32 సంవత్సరాలు వెనక్కి వెళితే, మద్రాసు మహానగరంలోని ఒక సాధారణమైన అద్దె ఇల్లు. ఒకప్పుడు లెక్కపెట్టకుండానే అడిగినవారికి లక్షల్లో దానం చేసిన ఆ ఇంట్లోని బంగారు చేతులు, రోజువారి జీతం కోసం ఎదురుచూస్తున్ననమ్మలేని రోజులు. థడ్...థడ్...అని తలుపు చప్పుడు. తెరిస్తే ఒక వ్యక్తి. 'ఎవరు మీరు?' అంటే, బదులుగా 'మీ అభిమానిని అమ్మా!' అని సమాధానం. లోపలికి తీసుకువచ్చి అన్నం పెట్టి కష్టసుఖాలు అడిగింది ఆ మహానుభావురాలు. తనది కిళ్ళీకొట్టు వ్యాపారం అనీ, ఇప్పుడంతా నష్టపోయానని చెప్పాడు ఆ అభిమాని. తన దగ్గిర సమాయానికి డబ్బులు లేవు. ఒకప్పుడు బాగా బ్రతికి, పది మందిని బ్రతికించిన ఆమెకి ఊరికే పంపడమంటే ఏంటో తెలియదు. ఆలోచించింది. తన బీరువా గుర్తుకువచ్చింది. తనకి ఎంతో ఇష్టమైన రెండో మూడో పట్టుచీరెలని అందులో దాచుకుంది. ఇప్పుడే వస్తాను బాబూ అని వెళ్ళి ఒక చీరె తీసుకొని చేతులు వెనకపెట్టుకుని అతనికి కనపడకుండా బయటకి వచ్చింది. వీధి చివర తనకి తెలిసినవాడికి ఇచ్చి "అన్నయ్యా, దీన్ని అమ్మి ఎంత వస్తే అంత పట్టుకురా" అని చెప్పింది. తిరిగి లోపలికి వెళ్ళి అభిమానికి భోజనం వడ్డించింది. అరగంటకి ఆ 'అన్నయ్య' వచ్చి ఒక 5000 చేతిలో పెట్టాడు. ఆమె నవ్వుతూ అవి తీసుకొని లోపలకి వెళ్ళింది. కానీ ఆ చీరె విలువ ఆ రోజుల్లోనే 30,000. మిగతా పాతికవేలు ఆ అన్నయ జేబులోకి వెళ్ళాయి. ఆ విషయం తనకి తెలీదు. అంతెందుకు? తన జీవితంలో అసలు డబ్బులు ఎప్పుడూ లెక్కపెట్టలేదు అంటే నమ్ముతారా? ఇలా లెక్కలేనన్ని ఆర్థిక అవకాశ రాబందులు తన జీవితంలో. ఇలా ఎన్నున్నా, నటననే ప్రేమించింది కానీ ప్రేమని మాత్రం నటించలేదు. ఆమె కనురెప్పలే కోటి భావాలు పలికేవి. మహానటులుకు సైతం ఆమె పక్కన నటంచడానికి చెమటలు పట్టేవి.తెలుగువారు సగర్వంగా చెప్పుకునే 'ఆడతనం' ఆమెది. 30 సంవత్సరాల తన సుదీర్ఘ ప్రస్థానంలో మామూలు నటులు ఎప్పటికీ మోయలేని కిరీటాలని తను చిటికనవేలుతో ఆడించి చూపించింది. పాత్రలే తనకోసం ఎదురుచూసేవి. 'దేవదాసు' లో విరహాన్ని పొంగించే ఆ కళ్ళు 'మాయాబజార్' లో ఠీవిని పలికించాయి. ఆ కళ్ళే దక్షిణభారతాన్ని అందంగా మోసం చేశాయి. అది నటన కాదు, జీవం అని మనల్ని మరిపించి మురిపించాయి. వారు కూడా ఆమె నటనకి పాదాభివందనం చేసేట్టు చేశాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 'నీలం సంజీవరెడ్డి' మంత్రులతో సహా ఆమె ముందు రోడ్డు మీద నడుస్తూ ఆమెను ఏనుగు మీద రవీంద్ర భారతి వరకు 'గాజారోహణం' చేయించారు. భారతదేశ సినిమా చరిత్రలో 'ఎవరికీ దక్కని' అరుదైన గౌరవం ఇది. 'ఇప్పటికీ' 'ఎప్పటికీ' తెలుగువారి ఖ్యాతిని అఖండజ్యోతిలా వెలిగించేవాళ్ళలో ముందు వరుసలో వుంటుంది ఆమె నటనా జీవితం. ఆమే 'సావిత్రి'. సావిత్రి గారు మనల్ని పొగడమనో, గుర్తుంచుకోమనో ఏ రోజూ అడగలేదు. గాంధీ కూడా ఆయన బొమ్మని నోటు మీద వేయమని అడగలేదు. గొప్పవాళ్ళు ఎవరూ అడగరు. వాళ్ళ సేవని గుర్తుంచుకొని మనమే ఆ రుణాన్ని తీర్చుకునే ప్రయత్నం చేయాలి.

**సేనాధిపత్యం రమేష్**



# మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు

మనిషి జీవితం మద్యం మయమైందిమనిషిని మృగంగా మార్చే మద్యం మానవత్వాన్ని మరిపిస్తుంది మృగత్వాన్ని మొలి పిస్తుంది. మనిషి తనం నశించి రాక్షతత్వం జనించిఆలోచనను తుంచి ఆందోళనను పెంచుఆరోగ్యాన్ని తుంచుప్రజా సంబం ధాలను తెంచు హింసోన్మాధాన్ని పెంచుమానవీయతనుమంట కలుపు కఠినత్వాన్ని కోరుకుంటుంది హింసను పురికొల్పుతుంది మందే మాతరం అనే నవతరం మందు తాగి తూగి ఊగే సంస్కృతి రాజ్యమేలుతోంది పల్లె నుండి పట్నం వరకు గల్లీ నుండి ఢిల్లీ వరకు వీధి వీధినా తెరుచుకున్నపబ్బులు క్లబ్బులు బార్లు బెల్ట్ షాపులుమధ్య ప్రవాహ కేంద్రాలైనాయిఆడ మగ చిన్న పెద్ద గరీభు నవాబు అన్న బేదాలు లేకుండాపేద బిక్కి ధనికా పేద తేడా లేకుండా మద్యం మత్తులో చిత్తైపోతున్నారు. బర్త్ డే డెత్ డేమ్యారేజ్ డే హాలిడే వేడుకల్లో మందు విందు భలే పసందై మూడు పువ్వులుఆరు కాయలుగా వర్ధిల్లుతుందిమద్యం ప్రశాంతతకు గొడ్డలిపెట్టు అనారోగ్యానికి రాచబాటమద్యపాన వ్యసనానికి సంసారాలుకూలిపోతున్నాయి కుటుంబ వ్యవస్థ కుదేలౌతుంది మద్యానికిబానిసైన యువతఆత్మహత్యలకు పాల్పడి తల్లిదండ్రులకు శోకాన్ని గిఫ్టుగా ఇస్తున్నారు.చిత్తుగా తాగి ఇల్లును గుళ్ళ చేసుకుని ఆర్థిక బాధలు తట్టుకోలేక అప్పుల పాలైహత్యలు ఆత్మహత్యలకుదోపిడీ దొంగతనానికి రేప్ లకు పాల్పడే హింసాత్మక ధోరణులు పెరుగుతున్నాయిమద్యం సృష్టించే విధ్వంసం అణువిస్ఫోటనం కన్నా మిన్నరాజ్యాంగం నిర్దేశించిన మద్యపాన రహిత సమాజ స్థాపన ప్రభుత్వధ్యేయం కావాలి ప్రభుత్వాలు రాబడి కొరకు మద్యపానంపై ఆధారపడే పాలనా విధానం మారాలి ప్రజారోగ్యమే ఎజెండాగా బడ్జెట్ కేటాయించాలి. పాలకుల వైఖరిలో మార్పు రావాలి. మద్య రహిత భారత్ ఆవిష్కరణకు పూనుకోవాలి మధ్యాన్ని నిషేధించాలి నిషాముక్త్ భారత్‌కైఉద్యమిద్దాంమందు వదిలి ముందుకు సాగుదాం ఆరోగ్య భారత్ అభివృద్ధికి పాటుపడదాం ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు.ఆనందాన్ని మించినప్రశాంతత లేదు మధ్యం వద్దు ఆరోగ్యమే హద్దు అని ప్రతిజ్ఞ చేద్దాం. **నేదునూరి కనకయ్య**



# కాఫీ విత్ మధు..

వేల వత్సరాలైనా.. వసంత ఋతువు సొగసు..నిత్య నూతనమే. గల గల పారుతున్న జీవ నది గమనం.. ఎక్కడ నుండి చూసినా ఆహ్లాదంగానే ఉంటుంది..కాలం కాని కాలంలో .. కూసినా..కోయిల గొంతు....గుండె గూటిని తట్టి లేపుతూనే ఉంటుంది.పశువులను...శిశువులను కూడా జోకొట్టి..మరో లోకంలో విహరింప చేసే శక్తి... అమృత గానానికి ఉంది.అలాంటి గాన మాధుర్యాన్ని గళసీమలో నింపుకున్న మెలోడీ పాటల మహారాణి....పిల్లాపాలు. గజపతి. కృష్ణవేణి(పి.జి. కృష్ణవేణి).సింపుల్ గా జిక్కి గా పేరొందిన సుమధుర గాయని.సంగీతం లో డిగ్రీలు చేయవచ్చు..పి.హెచ్.డి లు కూడా చేయవచ్చు. ఎందరో ఉన్నారు అలా చేసినవారు.కానీ పాట పాడి మెప్పించాలంటే కమ్మని స్వరం ఉండాలి. భావం చక్కగా పలికించే సామర్థ్యం కూడా ఉండాలి.కొందరికి మంచి స్వరమే ఉంటుంది. కానీ పాటలో భావం ఉండదు. గట్టిగా అరిచి పాడేస్తే.. పాటైపోతుందనుకుని అపోహ పడుతారు మరి కొందరు.ఏ స్థాయి లో పాడినా...గమకాలు చక్కగా పలకాలి. రావు బాలసరస్వతి గారు...టంగుటూరి సూర్య కుమారి గారు....చక్కటి గాయనీ మణులుగా చలామణి అవుతున్న రోజుల్లో...గొంతులో మాధుర్యాన్ని...మార్ధవాన్ని నింపుకుని....ఓ చిన్న 8 ఏళ్ళ పిల్ల వచ్చింది....1945 లో.1949 దాకా బాలనటి గా తన పాటలు తనే పాడుకుంటూ కొన్ని చిత్రాలలో నటించింది.మనదేశం లో(1949).... మొదటిసారిగా...మరువలేనురా నిను నేను మరువ లేనురా... పంచదార వంటి పోలిసెంకట స్వామి....ఘంటసాల సంగీత దర్శకత్వంలో నేపథ్య గీతం పాడింది. ఆ స్వరం...అప్పుడప్పుడే హిందీ చిత్రసీమలో పాడుతున్న లతా మంగేష్కర్ వాయిస్ ను పోలి ఉంది.ఇక అక్కడ నుండి అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి.తనకప్పుడు....పోటీ ఘనాపాటి పి.లీల గారు. అయినా ఎవరికి తగ్గ పాటలు వారు పాడుకున్నారు.మరి ఈ గాయనీమణుల జీవితాలు..వారి పాటలాగా....హాయిగా...తియ్యగా... సాగిపోతాయా అంటే. అది ఎండమావే!ఆ మ్యుజిక్ డైరెక్టర్ కు నాకు పడదు. నువ్వు వాడి దగ్గర పాడటానికి వీల్లేదు!అగ్రిమెంట్ ప్రకారం నేను పాడాలి తప్పదండి. పైగా...రిహార్సల్స్ కూడా అయిపోయి...రెడీగా ఉన్న పాటలు. నిన్న ఏదో మీతో గొడవయ్యిందని... ఇప్పుడు నన్ను పాడొద్దంటే ఎలాగండి?....భార్య అభ్యర్థన.వాడంతగా చెప్తున్నాడుగా... భర్తంటే లక్ష్యం లేదా నీకు! వాడెలా చెప్తే అట్లాగే చెయ్.....అత్తగారి సన్నాయి నొక్కులు.నా గౌరవం నీకు ముఖ్యం కాదనుకుంటే....నీ ఇష్టం. పోయి పాడు......భర్త గారి అలక... బెదిరింపు!అసలు కొంత కాలం ఈ సినిమాల్లో పాడటం మానేయ్.....భర్త గారి ఆర్డర్.పిల్లల తోటే ఖర్చులూ పెరుగుతున్నాయి. ఈ టైం లో పాడటం మానేస్తే ఎలాగండి?......భార్య.అన్నీ నేను చూసుకుంటాను. నువ్వు నేను చెప్పినట్లు ఇంట్లోనే ఉండు.....భర్త తీర్మానం. పి.జి.కృష్ణవేణి ని చిన్నప్పటి నుండి జిక్కమ్మా అని వారి నాన్నగారు పిలిచేవారంట. అది అలా ఫిక్స్ అయిపోయింది. 2వ తరగతి తో చదువు ఆపినా...మద్రాసు లోనే పుట్టి పెరగడంవల్ల తమిళం మాత్రం వ్రాయగల్గి,.... శాస్త్రీయ సంగీతంలో అసలు ఓనమాలు రాకపోయినా... దైవదత్తమైన స్వరమాధురితో జిక్కి గారు...తెలుగులో ఎన్నో మధుర గీతాలు ఆలపించారు. అల్లదే.. అవతల...అదిగో నా ప్రియా కుటీర వాటిక..పులకించని మది పులకించు... రాజశేఖరా...నీపై మోజు తీరలేదురా...హాయి హాయిగా ఆమని...ఏరువాక సాగారో రన్నో చిన్నన్నా...గుత్తొంకాయ్ కూరోయ్ బావ కోరివండినానోయ్ బావ..ఎన్నొ మధురాతి మధురమైన గీతాలు జాలువారాయి ఆ మధుర అమృత గళం నుండి.-బాలనటి గా పంతులమ్మ (1943), వాల్మీకి (1945), ఇది మా కథ (1946)లలో నటించి తన పాటలు తనే పాడుకున్న జిక్కి...మన దేశం (1949) లో లక్ష్మీకాంత కు తొలిసారి నేపథ్య గీతాలు పాడింది. మరువలేనురా.. నిను నేను మరువలేనురా. .ఓ పంచదార వంటి పోలిసెకంట స్వామి.. ఘంటసాల వారి సంగీత దర్శకత్వంలో పాడారు జిక్కి గారు.ఇక ఆ స్వర వాహిని అలా భాషా బేధాలనధిగమించి...ఎన్నో భాషలలో వేలాది మధుర గీతాలను అందించారు.తన పై ఆధారపడ్డ 4గురు సోదరులు,ముగ్గురు సోదరీమణులు, తాగుబోతు తండ్రి....ఆ పరిస్థితిలో శ్రీ.ఎ.ఎం.రాజా తో ప్రేమ వివాహం,...కాలక్రమేణా..6గురు సంతానం... కుటుంబ బాధ్యతల మధ్య కూడా... ఎన్నో ప్రయాసలకోర్చి... సినీ గీతాలు, కచేరీలు..చేసేవారు జిక్కి.1989లో భర్త రాజా అకాల మరణం తో కృంగి పోయినా...తోటి



గాయనీ మణులు...చక్కటి స్నేహితురాళ్ళు అయిన జమునా రాణి, పి.లీల ఎ.పి.కోమల గార్లతో దేశ, విదేశాలలో కచేరీలు చేసేవారు జిక్కి.సీతారామయ్య గారి మనవరాలు (1991), అమ్మ కొడుకు (1993), నిన్నే పెళ్ళడుతా (1996) మురారి (2001) దాకా పాడారు.2001 లోనే బ్రెస్ట్ కేన్సర్ వస్తే... చికిత్స చేయించుకునే స్తోమత కూడా లేని పరిస్థితి! చిరకాల మిత్రురాలు... గాయని జమునారాణి గారు కచేరీలు చేసి...రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అభ్యర్థన లేఖలు వ్రాసి...నిధులు సమకూర్చవలసి వచ్చింది!సర్జరీ తరువాత కూడా సెకండరీస్ తో 16 ఆగస్ట్ 2004 న అనంత విశ్వంలో లీనమైనా వారి పాటలతో చిరస్మరణీయులయ్యారు శ్రీమతి.జిక్కి గారు.

## అన్నా క్యాంటీన్‌కు డాక్టర్ ధన్వంతరి ఆచార్య

# లక్ష రూపాయల విరాళం

**ప్రజల ఆశయాలకు అనుకూలంగా పనిచేయడమే మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరిల లక్ష్యం. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి ధన్వంతరి ఆచార్య....**

**మచిలీపట్నం ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభ నేని బాలసౌరి లు మచిలీపట్నంలో శుక్రవారం ప్రారంభించిన అన్నా క్యాంటీన్ నిర్వహణకు గాను ప్రముఖ వైద్యులు డాక్టర్ బి . ధన్వంతరి ఆచార్య లక్ష రూపాయలు విరాళం ఇచ్చి, ప్రతి సంవత్సరం మచిలీపట్నంలో అన్నా క్యాంటీన్ నిర్వహణకు లక్ష రూపాయలు విరాళం ఇస్తానన్న అన్నారు. రవీంద్ర, ధన్వంతరి ఆచార్యను అభినందించి, సత్కరించారు. డాక్టర్ బి ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం, పవన్ కళ్యాణ్ లు పేద ప్రజల కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు మరలా ప్రారంభించడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేద ప్రజల కోసం ఏ విధంగా పనిచేస్తుందో ప్రజలు గ్రహించాలి అన్నారు.గత పాలకులు స్వార్థం కోసం అన్నా క్యాంటీన్లను మూసివేసి పేద ప్రజల పొట్ట కొట్టారు అన్నారు.మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి లు ప్రతినిత్యం పేద ప్రజల కోసం ఆలోచించే వ్యక్తులు అన్నారు. మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి లు ప్రారంభించిన అన్నా క్యాంటీన్ కు ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు క్రమం తప్పకుండా మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదగా అందజేయడం జరుగుతుంది అన్నారు.మచిలీపట్నం అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి లకు ప్రజలు కూడా తమ సహాయ సహకారాలు అందజేయాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణా జిల్లా కన్వీనర్, పి. వి. ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రముఖ వైద్యులు బి ధన్వంతరి ఆచార్య.**

మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి లు నగరం లో శుక్రవారం ప్రారంభించిన అన్నా క్యాంటీన్ నిర్వహణకు గాను ప్రముఖ వైద్యులు డాక్టర్ బి . ధన్వంతరి ఆచార్య లక్ష రూపాయలు విరాళం ఇచ్చి, ప్రతి సంవత్సరం మచిలీపట్నంలో అన్నా క్యాంటీన్ నిర్వహణకు లక్ష రూపాయలు విరాళం ఇస్తానన్న ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. ధన్వంతరి ఆచార్య అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర డాక్టర్ ధన్వంతరిఆచార్యను అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ
పేదల ఆకలి తీర్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం, పవన్ కళ్యాణ్ లు పేద ప్రజల కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు మరలా ప్రారంభించడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేద ప్రజల కోసం ఏ విధంగా పనిచేస్తుందో ప్రజలు గ్రహించాలి అన్నారు.గత పాలకులు స్వార్థం కోసం అన్నా క్యాంటీన్లను మూసివేసి పేద ప్రజల పొట్ట కొట్టారన్నారు.నగరం లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి లు ప్రతినిత్యం పేద ప్రజల కోసం ఆలోచించే వ్యక్తులన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి లు ప్రారంభించిన అన్నా క్యాంటీన్ కు ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు క్రమం తప్పకుండా మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదగా అందజేయడం జరుగుతుందన్నారు.మచిలీపట్నం అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి లకు ప్రజలు కూడా తమ సహాయ సహకారాలు అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణా జిల్లా కన్వీనర్, పి. వి. ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రహదారుల భద్రతకు

# అత్యంత ప్రాధాన్యత

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక) :** రహదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్య తనిచ్చి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఉదయం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత కమిటీ సమావేశం జరిగింది. గత సమావేశంలోని చర్చించిన సమస్యలకు తీసుకున్న చర్య నివేదికపై కలెక్టర్ సమీక్షించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారులు 216, 65, 16, 165 లతో పాటు జిల్లాకు సంబంధించిన ఇతర రహదారులపై 61 ప్రమాదకర ప్రదేశాలను (బ్లాక్ స్పాట్స్) కమిటీ ఉమ్మడి పరిశీలన చేసి గుర్తించినట్లు కమిటీ సభ్యులు కలెక్టర్ కి వివరించారు. వాటిలో 47 బ్లాక్ స్పాట్స్ కు అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు.2024వ సంవత్సరంలో జూలై వరకు అనేక చోట్ల రోడ్డు ప్రమాదాలతో 187 మంది మరణించారని, వారిలో అత్యధికంగా 106 మరణాలు వివిధ జాతీయ రహదారులపై సంభవించినట్లు వివరించారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీల వలన ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.నిబంధనలను అతిక్రమించిన వాహనదారులపై రవాణా శాఖ 1,014 , పోలీసు శాఖ 50,964 కేసులను నమోదు చేయగా, 140 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి రూ.8,65,500 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిన బ్లాక్ స్పాట్స్ కు సంబంధించి అంచనాలను రూపొందించాలని, త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై యువతకు విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, సీట్ బెల్ట్, శిరస్త్రాణం (హెల్మెట్) ధరించడంపై కలిగే ప్రయోజనాలు, మద్యపానం సేవించి వాహనాలు నడపటంపై కలిగే దుష్ప్రభావాలను వివరించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి పురేంద్ర, ఏఎస్పి ప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ ప్రజా రవాణా అధికారిణి వాణిశ్రీ, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణాజిల్లా జాయింట్ సెక్రటరీగా సత్రపు సుధీర్..



**నూజివీడు, ఆగష్టు 16, (ఆంధ్రపత్రిక) :** మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాలలో కీలకమైన చిరంజీవి యువత నూతన కమిటీలను రాష్ట్ర చిరంజీవి యువత నాయకులు ప్రకటించారు.. ఈ కమిటీలలో గత మూడు సంవత్సరాలుగా నూజివీడు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులుగా విజయవంతంగా చిరంజీవి యువతను ముందుకు తీసుకు వెళ్లడంలో మెగా ఫ్యామిలీ పుట్టినరోజు వేడుకలు కరోనా సమయంలో అభిమానులకు ప్రజలకు చిరంజీవి యువత తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన సత్రపు సుధీర్ సేవలను గుర్తించిన అఖిల భారతచిరంజీవి యువత గౌరవాధ్యక్షులు మెగా బ్రదర్ కొణిదల నాగబాబు, వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామి నాయుడు, ఉపాధ్యక్షులు శ్యాం ప్రసాద్, కృష్ణ ప్రసాద్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు సుగుణబాబు ఉమ్మడి కృష్ణ జిల్లా జాయింట్ సెక్రెటరీగా నియమించారు.. ఈ సందర్భంగా సత్రపు సుధీర్ మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి నియోజకవర్గ స్థాయి నుండి జిల్లా స్థాయిలో చిరంజీవి యువతలో పదోన్నతి ఇచ్చినందుకు చిరంజీవి యువత నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. తనకు అప్పజెప్పిన బాధ్యతకు పూర్తిస్థాయిలో న్యాయం చేసి జిల్లా స్థాయిలో మెగా ఫ్యామిలీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తానని సుధీర్ తెలిపారు..

# నూజివీడు నియోజకవర్గ చిరంజీవి యువత నూతన కమిటీ ఎంపిక



**నూజివీడు, ఆగష్టు 16, (ఆంధ్రపత్రిక) :** మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాల గౌరవ అధ్యక్షుడు కొణిదెల నాగేంద్రబాబు అఖిలభారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామి నాయుడు ఆదేశాల ప్రకారం రాష్ట్రం మొత్తం చిరంజీవి యువత నూతన కమిటీలను ప్రకటిస్తున్న నేపథ్యంలో నూజివీడు నియోజకవర్గ నూతన కమిటీని అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షులు శ్యాంప్రసాద్, కృష్ణ ప్రసాద్ రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షులు సుగుణ బాబు , ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు హనుమ ప్రసాద్ ప్రకటించినట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణా జిల్లా బ్లడ్ డోనర్స్ క్లబ్ కో కన్వీనర్ ముమ్మలనేని సునీల్ కుమార్ తెలిపారు.. ఈ సందర్భంగా నూజివీడు నియోజకవర్గ, పట్టణం, రూరల్, చాట్రాయి, ఆగిరిపల్లి, ముసునూరు మండలాలకు అధ్యక్షులను చిరంజీవి యువత నాయకులు ప్రకటించారు. నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు గా యర్రంశెట్టి రాము నూజివీడు టౌన్ చిరంజీవి యువత అధ్యక్షులు గా షేక్ బాజి నియమితులయ్యారు. వారికి శుభాకాంక్షలను ముమ్మాలనేని ఈ సందర్భంగా తెలిపారు.

## ఉపాధిహామీని ప్రజలు సద్వినియోగం చేసుకోండి



**నూజివీడు, ఆగష్టు 16, (ఆంధ్రపత్రిక) :** గొల్లపల్లి సచివాలయ ప్రాంగణంలో మహా త్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు సంబంధించి నూజివీడు ఏ పి ఓ ఎన్ సోమేశ్వరీ, శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి బి వెంకటేశ్వర మ్మ, అధ్యక్షులుగా, మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు అతిధిగా మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గతం లో చేపట్టిన పనులు గురించి సోషల్ ఆడిట్ పై అభ్యంతరాలు ఉంటే తెలియ చేయాలని కోరారు, సభ్యులు ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. వక్తలు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామస్థులు అనేక పనులు చేయించుకొనే అవకాశం ప్రభుత్వం కల్పించింది, ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆన్లైన్ మోసాలపై అవగాహన




**ఆగిరిపల్లి ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి గ్రామంలో యాదవ బజారులో నూజివీడు గ్రామీణ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మీ పోలీస్ - మీ రక్షణ అనే కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్ లు, సైబర్ నేరాలు, 112 కాల్, దొంగతనాలు, హెల్మెట్ ధారణపై గ్రామ ప్రజలకు అవగాహన తెలియజేసి చిన్నారులకు రాత పుస్తకాలు పెన్నులు అందజేశారు.




## అమ్మవారికి శ్రావణ మాస

# ప్రత్యేక పూజ కార్యక్రమం

**నైవేద్యాలు సమర్పించిన భక్తులు**



**కృత్తివెన్ను 16 (ఆంధ్రపత్రిక) :** కృతి వెన్ను మండలం కొమ్మళ్ళపూడి లో పాటిమీద వేంచేసిన పోతురాజు, పోలేరమ్మ అమ్మవారి జాతరను వలవల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అత్యంత వైభవంగా వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారం కావడంతో మహిళ భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. మచిలీపట్నం కాసాని గూడెం చెందిన భక్తులు కుటుంబ సమేతంగా వేడి నైవేద్యాలతో పాటు అమ్మవారికి సారే ను సమర్పించారు. వేదమంత్రాల ఉచ్చరణతో గ్రామంలో మంగళవాద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేకం గా పూజా కార్యక్రమంను నిర్వహించారు. పూజారి భక్తుల కోసం అమ్మవారి శకునాన్ని వివరించారు. జాతర అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ మునిపెడ లోని పోలేరమ్మ జాతర ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని, ప్రతి శుక్రవారం మహిమగల అమ్మవారు భక్తుల కోరుకునే కోర్కెలను తీరుస్తారని నమ్మకం. ఈ కార్యక్రమంలో భక్తులు గణేష్ కుమార్, శైలజ, తారక వెంకటకృష్ణ నాగదత్త మరియు బెజవాడ వెంకట నరసింహా ప్రతాప్ కామన్ వెంకటరావు దంపతులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ పొగాకు వ్యాపారం నుంచి దేశానికి విముక్తి కల్పిస్తామని స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రతిజ్ఞ

**విజయవాడ, ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక) :** ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ భారతదేశ అనుబంధ సంస్థ, ఐపీఎం ఇండియా, భారతదేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడేం దుకు, వినియోగదారులను రక్షించేందుకు అక్రమ పొగాకు వ్యాపార నిరోధానికి తన నిబద్ధతను బలపరుస్తుంది. అక్రమ పొగాకు వ్యాపారం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఐపీఎం ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవనీల్ కర్ మాట్లాడుతూ, "అక్రమ వ్యాపారాన్ని నిర్మూలించేందుకు కార్యాచరణ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం అనేది మా ప్రయత్నాలలో అంతర్భాగంగా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా, అక్రమ వ్యాపారాన్ని నిరోధించేందుకు పీఎంఐ వ్యూహం ఐదు కీలకమైన రంగాలపై దృష్టి సారిస్తుంది. భారతదేశంలో, అక్రమ పొగాకు వ్యాపారం గురించి అవగాహన కల్పించేందుకు, అవగాహన కల్పించేందుకు చట్టాలను జారీ చేసే సంస్థలతో కలిసి పని చేసేందుకు మేము సమానంగా పెట్టుబడి పెట్టాము. ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగం, పౌర సమాజం సమగ్ర విధానం ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాలు వాణిజ్యాన్ని ఎదుర్కోవడంలో సహాయపడతాయి" అని పేర్కొన్నారు.

## 19 నుండి ఇంజనీరింగ్ తుది, మూడో దశ ప్రవేశాల ప్రక్రియ

**నోటిఫికేషన్ విడుదల చేసిన కన్వీనర్ గణేష్ కుమార్**

**విజయవాడ, ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక) :** ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్దేశించిన ఎపి ఈఎపిసెట్ 2024 తుది, మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు 19 ప్రారంభం అవుతుందని సాంకేతిక విద్యా శాఖ సంచా లకులు, ప్రవేశాల కన్వీనర్ గణేష్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ప్రాసె సింగ్ ఫీజు చెల్లింపు ప్రక్రియను విద్యార్థులు ఆగస్టు 19 నుండి ఆగస్టు 21 లోపు పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. ఆగస్టు 19 నుండి ఆగస్టు 22 వరకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఉంటుందని, ఆగస్టు 20 నుండి 22 వరకు 3 రోజుల పాటు ఆప్షన్ల ఎంపిక పూర్తి చేసుకోవాలని కన్వీనర్ స్పష్టం చేసారు. ఐచ్చికాల మార్పుకు ఆగస్టు 23వ తేదీ నిర్దేశించామన్నారు. 26 వతేదీన సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామని తెలిపారు. సెల్ఫ్ జాయినింగ్, కళాశాలలో రిపోర్టింగ్ కోసం ఆగస్టు 26 నుండి ఆగస్టు 30 వరకు ఐదు రోజుల పాటు అవకాశం ఉంటుం దన్నారు. ఇప్పటికే జులై 19వ తేదీ నుండి తరగతులు ప్రారంభం అయ్యాయని కన్వీనర్ వివరించారు. విద్యార్థులు ఐచ్ఛికాల ఎంపిక సందర్భంలో ఓటీపీలను ఇతరులకు ఇవ్వవద్దని, అది సమస్యలకు దారి తీస్తుందని సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు గణేష్ కుమార్ హెచ్చరించారు.

## జాతీయ చేతిరాత పోటీల్లో సత్తా చాటిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు

**విజేతలుగా నిలిచిన అర్జున్, లక్ష్మి కావ్య, దన్విక్, ముకుంద ప్రియ**






**విజయవాడ, ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక) :** జాతీయ స్థాయి చేతిరాత పోటీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సత్తా చాటారు. నేషనల్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ కెప్టెన్ గా విశాఖ జిల్లా కలెక్టర్ కుమారుడు ఏ. అర్జున్ సీనియర్ లెవెల్ లో గెలుపొందారు. ఎన్ఆర్ఐ నేషనల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ, అమ్మ ఒడి హ్యాండ్ రైటింగ్ , అఖిల భారత హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జూలై 14వ తేదీ ఆన్ లైన్ విధానంలో జరిగాయి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జాతీయ చేతిరాత పోటీలను నిర్వహిస్తారని చేతిరాత నిపుణులు షేక్ మహబూబ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు మూడు లక్షల మంది పైగా విద్యార్థులు హ్యాండ్ రైటింగ్ పోటీలకు హాజరుకాగా, జాతీయ స్థాయిలో సీనియర్ విభాగంలో రెండు, జూనియర్ విభాగంలో రెండు స్థానాలు ఆంధ్రప్రదేశ్ దక్కించుకుంది. సీనియర్ స్థాయిలో ఏలూరు జిల్లా, కైకలూరు నేషనల్ హైస్కూల్లో చదువుతున్న సిహెచ్ లక్ష్మి కావ్య వండర్ ఆఫ్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ విభాగంలో మొదటి స్థానం సాధించారు. జూనియర్ స్థాయిలో విజయవాడ, ఎన్ ఎస్ ఎం స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న అభిరామ దన్విక్ మొదటి స్థానాన్ని, నిర్మల హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న బొప్పన ముకుంద ప్రియ తృతీయ స్థానాన్ని సాధించారు. ఈ క్రమంలో జాతీయ స్థాయు 13 స్థానాల్లో నాలుగు స్థానాలు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు దక్కించు కోగలిగారు. విజేతల్లో అర్జున్ , అభిరామ ధన్విక్, ముకుంద ప్రియలకు జాతీయ చేతరాత నిపుణులు భువనచంద్ర శిక్షణ ఇచ్చారు. జాతీయ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు అతిత్వరలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డులను అందచేయడం జరుగుతుందని హుస్సేన్ తెలిపారు.

# స్వామివార్లకు పవిత్రములు సమర్పణ

**ఆగిరిపల్లి ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి స్థానిక శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహ స్వామి వార్ల పవిత్ర ఉత్సవముల మూడవరోజు భాగంగా స్వామి వార్లకు విశేష అర్చన, కలశాధారణ, అలంకరణ, మూల మంత్ర హెూమం, శాంతి హెూమం, ఆలయ ప్రదక్షణ పూర్వకంగా స్వామివార్లకు ప త్రములు సమర్పణ మరియు నీరాజన మంత్ర పుష్ప తీర్థప్రసాద వినియోగం జరిగింది.




ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన
ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
గుంటూరు, బాపట్ల, ఒంగోలు జిల్లాలోని
పొన్నూరు, చీరాల, వేటపాలెం, చెరుకుపల్లి
నియోజకవర్గాలకు మరియు మండలాల వారిగా
విలేఖర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

# అన్నా క్యాంటీన్లతో
# పేదల కళ్లల్లో ఆనందం

- ప్రజాప్రభుత్వం హయాంలో క్యాంటీన్ల పునరుద్ధరణ ఎంతో సంతోషాన్నిస్తోంది.
- మెనూ ప్రకారం అన్నా క్యాంటీన్లలో అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజన ఏర్పాట్లు.
- నిర్వహణపరంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన
- పేదలకు పట్టెడన్నం పెట్టే బృహత్తర కార్యక్రమమిది
- శాసనసభ్యులు గద్దె రామమోహన్, బొండా ఉమామహేశ్వరరావు, యలమంచిలి సుజనా చౌదరి
- పండగ వాతావరణంలో వేడుకగా అన్నా క్యాంటీన్ల ప్రారంభం







**విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంతో పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం గౌరవ ముఖ్యమంత్రి గుడివాడలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించగా.. శుక్రవారం జిల్లాలో అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవ కార్యక్రమం పండగ వాతావరణంలో జరిగింది. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పటమట కోనేరు బసవయ్య చౌదరి జెడ్‌పీహెచ్ఎస్, బుడమేరు జంక్షన్, గాంధీనగర్, వన్ టౌన్ గాంధీ పార్కు వద్ద అన్నా క్యాంటీన్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, శాసనసభ్యులు గద్దె రామమోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజానా చౌదరి, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రూ. 5కే అల్పాహారాన్ని అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా తదితరాలను ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా వడ్డించారు. స్వచ్ఛమైన తాగునీరు అందించే ఏర్పాట్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు చేసిన ఏర్పాట్లు, మరుగుదొడ్లు తదితరాలను కూడా పరిశీలించారు. గౌరవ ముఖ్యమంత్రి గురువారం గుడివాడలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారని.. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా మరో 99 క్యాంటీన్లను ప్రారంభించడం జరుగుతోందన్నారు. ఎన్‌డీయే ప్రభుత్వం పేదల క్షేమం, సంక్షేమానికి కృషిచేస్తోందని.. కేవలం 60 రోజుల్లోనే అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. 2014–19లో అన్నా క్యాంటీన్లను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని.. ఆ తర్వాత ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ సొంత డబ్బుతో క్యాంటీన్లను నిర్వహించినట్లు తెలిపారు.

**ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు: కలెక్టర్ డా. జి.సృజన**

కలెక్టర్ డా. జి.సృజన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 14 అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం జరుగుతోందని.. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 11 క్యాంటీన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అన్నా క్యాంటీన్లలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటుచేశామన్నారు. చేతులు శుభ్రం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని.. మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నా క్యాంటీన్ల నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ సృజన వెల్లడించారు.

**ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో..:** శాసనసభ్యులు గద్దె రామమోహన్ విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామమోహన్ మాట్లాడుతూ పేదల కడుపు నింపే కార్యక్రమం అన్నా క్యాంటీన్లు అని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిబద్ధతతో కార్యక్రమాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. పూటకు రూ. 5 అంటే.. నెలకు రూ. 450తోనే పేదల ఆకలిని తీర్చే బృహత్తర కార్యక్రమమని.. మంచి ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలు భోజనం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం శరవేగంగా అన్నా క్యాంటీన్లను ప్రారంభించారని.. ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు శాసనసభ్యులు రామమోహన్ పేర్కొన్నారు. ఈ రోజు ఇద్దరు చిన్నారులు తమ పుట్టిన రోజును పురస్కరించుకొని రూ. 50 వేలు చొప్పున చెక్‌ల ద్వారా అన్నా క్యాంటీన్లకు విరాళాలు అందించారని.. ఇలాగే ఎంతోమంది దాతలు ముందుకొస్తున్నారని తెలిపారు.

**కలకాలంకొనసాగాలి: శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు**

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేవలం రూ. 5కే కడుపునిండా భోజనం పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించిందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కలకాలం ఈ కార్యక్రమం కొనసాగాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఓ స్ఫూర్తిగా ప్రజలు ఈ మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడం ద్వారా ఎంతో సంతృప్తి సొంతమవుతుందని శాసనసభ్యులు ఉమామహేశ్వరావు పేర్కొన్నారు.

**బృహత్తర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి: శాసనసభ్యులు సుజనా చౌదరి**

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చే అన్నా క్యాంటీన్ల నిర్వహణ బృహత్తర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పండగ వాతావరణంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవం జరగడం చాలా ఆనందాన్నిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చాలా మంది విరాళాలు అందించేందుకు ముందుకొస్తున్నారని.. ఇది ఓ గొప్ప స్ఫూర్తికి తార్కాణమని శాసనసభ్యులు సుజనా చౌదరి పేర్కొన్నారు.

**అవసరమైన మౌలిక వసతుల కల్పన: వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర**

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో శుక్రారం 11 అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందని.. ప్రతి క్యాంటీన్‌లోనూ అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యాంటీన్ల నిర్వహణకు ప్రత్యేకంగా ఇన్‌ఛార్జ్‌లను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు డా. ఎ.మహేష్, కేవీ సత్యవతి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

## ఉత్తమ సేవకు పురస్కారం



**ఆగిరిపల్లి ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి మండలం పోతవర ప్పాడు గ్రామమునకు చెందిన కోలేటి పాల్ రమేష్ కు ఏలూరులో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి సారథి చేతుల మీదగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 2007 వ సంవత్సరంలో పోతవరప్పాడు గ్రామంలో ఎలిజిబెత్ చిల్డ్రన్ హోమ్ ఏర్పాటు చేసి ఇప్పటివరకు 200 మందికి పైగా అనాధలను స్వయం శక్తి గలవారీగా తీర్చిదిద్దానని, స్వచ్ఛభారత్ పర్యావరణ పరిరక్షణ, మెడిసినల్ ప్లాంట్స్ విస్తరణ, వృత్తి విద్య శిక్షణలు, మంచి నీటి పంపులు ఏర్పాటు చేయడం, కరోనా సమయములో మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 1200 మందికి నిత్యావసరుకులు పంపిణీ చేసి ఇటీవల కాలంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరాలు, దంత, చర్మ హృదయ సంబంధిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశానని తెలిపారు. పాల్ రమేష్ ను మండలంలో పలువురు ప్రముఖులు అభినందించారు

## వరలక్ష్మీ వ్రతం జరుపుకుంటున్న తెలుగింటి ఆడపడుచులు



**జగ్గయ్యపేట, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట మండలం ధర్మవరపాడు తండా పవిత్ర శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతం జరుపుకుంటున్న తెలుగింటి ఆడపడుచులు, తెలుగు వారి కుటుంబ సభ్యులకు ఆ లక్ష్మీ దేవి కృప కలగాలని ఆశిస్తూ.. అందరికీ "వరలక్ష్మీ వ్రత" శుభాకాంక్షలు తెలిపిన భూక్యా కవిత. భక్తితో వేడుకొంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియ మాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్నిచేయడంవల్ల లక్ష్మీదేవి కృప కలిగి ఐశ్వర్యం లభిస్తుంది. సకల శుభాలుకలుగుతాయి. స్త్రీలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడంతప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

## పేదల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్

అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట పట్టణంలో కమలహాలు సెంటర్ నందు స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు మరియు అధికారులతో కలిసి నెట్టెం రఘురామ్, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య రిబ్బన్ కట్ చేసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం అన్న క్యాంటీన్లో వారి చేతులు మీదుగా అందరికీ టిఫిన్ వడ్డించి, వారితో కలిసి టిఫిన్ చేయడం జరిగింది. ఈ సందర్భం గా పెద్దలు మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రూ. 5 కే భోజనంతో కూలీలు, కార్మికులు, పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని చెప్పారు అందులో భాగంగానే అన్నా క్యాంటీన్లను ప్రారంబించారని తెలిపారు. పేదలకు అన్నం పెట్టి కడుపు నింపే మంచి కార్యక్రమాన్ని వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదలపై కక్ష సాధింపుతో రద్దు చేశారని అన్నారు. పేదలకు కేవలం రూ. 5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం రాత్రి భోజనం ఇస్తామని చెప్పారు పేదలు ఇంట్లో భోజనం వండుకోలేని వారికి ఈ అన్న క్యాంటీన్లో చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు అక్షయపాత్ర సంస్థ వారు కేవలం సర్వీస్ ఛార్జీలు తీసుకుని ఉచితంగా భోజనం పెడుతున్నారని చెప్పారు. ఒక్కొక్క అన్న క్యాంటీన్ ద్వారా రోజుకు ఎంతోమంది ఆకలి తీర్చుతుందన్నారు. కేవలం సంక్షేమ పథకాలను ప్రచారం చేసుకుని రాజకీయ లబ్ధి పొందుదామని చూసిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు సరైన బుద్ధి చెప్పారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు మరియు అధికారులు అన్న క్యాంటీన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

### బలుసుపాడు కాలువలో తూటికాడను తొలగించి
## సకాలంలో రైతులకు సాగునీరు అందించాలి

టిడిపి జాతీయ కోశాధికారి శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట మండలం, బలుసుపాడు గ్రామంలో రైతులు పంట పొలాలకు నీరు అందక వారి సమస్యలను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించిన తాతయ్య గ్రామ రైతులు మరియు నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల స్వచ్ఛందంగా చందాలు వేసుకొని కాలువ పూడిక తీయించారు కానీ మెయిన్ కెనాల్ నుంచి నీరు రావడం లేదు. మెయిన్ కెనాల్ లో తూటికాడ, రిబ్బన్ నాచు, జున్నుగడ్డి బాగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి నీటి ప్రవాహం తగ్గడం వలన రైతుల పంటలకు సరిపడా నీరు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సందర్భంగా కాలువలో జంగిల్ ,తూటి కాడ, రెబ్బీన్ నాచు జున్నుగడ్డి తొలగించి సకాలంలో రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కానూరి కిషోర్ మరియు గ్రామ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

### అచంచలమైన సంకల్పం
## అందరికీ ప్రేరణ

**విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** ఇటీవలి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో, ఆంధ్రప్రదేశ్లో మీరు సాధించిన అద్భుతమైన విజయానికి మేము హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము. నాలుగోసారి ముఖ్యమంత్రి పదవిని దక్కించుకున్న మీ అచంచలమైన సంకల్పం అందరికీ ప్రేరణగా నిలుస్తుంది. పాత్రికేయుల అత్యవసర సమస్యలను పరిష్కరించడానికి మీతో చర్చలు జరపాలని మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. ఈ సమస్యలలో, పాత్రికేయులకు సొంత నివాసం లేకపోవడం ప్రధానమైనది, వీరిలో చాలా మంది తమ జీవితాలను తమ వృత్తికి అంకితం చేస్తున్నారు, తరచుగా వృత్తిపరమైన వివిధ ప్రమాదాలను ఎదురుకుంటున్నారు. దురదృష్టవశాత్తు, కొంతమంది విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోయారు, వారిపై ఆధారపడిన వారికి భద్రత లేకుండా పోతుంది. గృహ పట్టాలు అందిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ఈ వాగ్దానాలు నెరవేరలేదు. మీ సమర్థ నాయకత్వంపై పూర్తి నమ్మకంతో ఉన్నాము, ఈ వాగ్దానం త్వరలో కార్యరూపం దాల్చుతుందని మేము నమ్ముతున్నాము. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని మేము మిమ్మల్ని కోరుతున్నాము. గన్నవరం విమానాశ్రయాన్ని స్థాపించడంలో కీలక పాత్ర పోషించిన దివంగత ముఖ్యమంత్రి ఎన్. టి. ఆర్ దేశానికి తన కలం ద్వారా సేవలు అందించిన దివంగత ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీ రావు గారికి నివాళిగా గన్నవరం విమానాశ్రయానికి 'ఎన్. టి. ఆర్–రామోజీ అంతర్జాతీయ విమానాశ్రయం' గా పేరు మార్చాలని మేము ప్రతిపాదిస్తున్నాము. ఈ అభ్యర్థనలకు అనుకూలమైన ప్రతిస్పందన కోసం మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. ఈ విజ్ఞప్తిని మేము పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడుకి అందించటం జరిగింది. ధన్యవాదాలు.

## అన్న క్యాంటీన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్





**విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పారని, చెప్పిన విధంగా అన్న క్యాంటీన్లు ప్రారంభించామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. శుక్రవారం ఉదయం 17, 18 డివిజన్ల పరిధిలోని రాణిగారితోట నేషనల్ హైవే సాయిబాబు గుడి వద్ద మరియు సిమెంట్ గోడౌన్ వద్ద రెండు అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నేటి ఉదయం ప్రారంభించి, పార్టీ శ్రేణులతో కలిసి వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో వేముల దుర్గారావు, రాయిరంగమ్మ, పోలిపల్లి ముని, మైలమూరి పీరుబాబు, ఎస్.ఫిరోజ్, గోగుల రమేష్, మొకర వెంకటరమణ, పల్లా సాగర్, రాము, కొక్కెర తిరుపతయ్య, కాశీ తదితరులు పాల్గొన్నారు.

### అణగారినవర్గాల
## ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న

– శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్



**పెనమలూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** తాడిగడప మునిసిపాలిటీ యనమల కుదురు గ్రామం స్వాతంత్ర్య సమరయోధుడు బలహీనవర్గాల నాయకుడు సర్దార్ గౌతులచ్చన్న 115వ జయంతి సందర్భంగా శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ట కొరకు భూమి పూజ కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గారు పాల్గొని లచ్చన్న గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ గారు మాట్లాడుతూ లచ్చన్న గారు తన జీవితాంతం పేదలు బడుగు బలహీనర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు, దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి లచ్చన్న గారని అన్నారు. జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా రాజకీయ నాయకుడిగా ఆయన సాగించిన ప్రయాణం ఆయన్ను మహనీయునిగా నిలబెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ మహనీయుని స్ఫూర్తి కొనసాగించాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురు మూర్తి తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు వెలగపూడి శంకర్ బాబు గారు అనంతనేని ఆజాద్ వీరంకి కుటుంబరావు బెజవాడ శివయ్య మరీదు వెంకటేశ్వరరావు పరస వెంకటస్వామి లుక్క అరుణ్ బాబు మాజీ రామకృష్ణ మధు నాగరాజు కొండేటి శివయ్య వీరంకి నంది మరిదు శ్రీనివాసరావు ఆరేపల్లి ఈశ్వరరావు ఆరేపల్లి దాసు మల్లంపాటి విజయలక్ష్మి సింహాద్రి కృష్ణవేణి వణుకూరు విక్రమ్ సూది మల్ల రవీంద్ర బుర్ర వెంకట్ వడ్డే జీవన్ జన్ను నాగరాజు ఈడే శ్రీనివాస్ మరియు డాక్టర్ సర్దార్ గౌతులచ్చన్న సేవాసమితి యనమలకుదురు కమిటీ సభ్యులు మరియు అభిమానులు పాల్గొన్నారు

గుంటూరు శ్రీ చౌడేశ్వరి ఆలయంలో
19న శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిష్ట 17 నుంచి మూడు రోజులపాటు

## కల్యాణ వైభవ పూజలు



**గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** గుంటూరు నల్లపాడు రోడ్డు సాయి నగర్ లోని శ్రీ మహాగణపతి శ్రీ కుమారస్వామి సహిత శ్రీ చౌడేశ్వర చంద్రశేఖర సమన్విత శ్రీ చక్రాలయంలో ఈనెల 19వ తేదీన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ప్రతిష్ఠ కృతువు మరియు కళ్యాణ మహోత్సవం వైభవపీతంగా జరగనున్నది. ఈ సందర్భంగా 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కల్యాణ వైభవ పూజలు జరగనున్నాయని ఆలయ సర్వాధికార ప్రతినిధి శ్రీశ్రీశ్రీ విశ్వంభరానందగిరి స్వామి తెలిపారు. శ్రీ వశిష్ట హరరామ జన యజ్ఞ ఆశ్రమ పీఠాధిపతుడు శ్రీశ్రీశ్రీ ప్రణవానందగిరి స్వామి ఆశీస్సులతో ఆలయ శాశ్వత ధర్మకర్త కొమ్మన నరసింహారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర రావు, స్థానిక శాసనసభ్యులు శ్రీమతి గల్లా మాధవి, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

**ఆలయ విశిష్టత**

శ్రీ విశ్వంభరానంద గిరి స్వామి పూర్వాశ్రమంలో ఒలుకుల శివశంకరరావు తిమ్మసముద్రం శ్రీ గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాలలో అధ్యాపకునిగా... ప్రిన్సిపల్ గా పని చేస్తూ అష్టావధాని.... శతావని.... సహస్రనావధానిగా రాణించారని తాను 1977 81 మధ్య కాలంలో ఆయన వద్ద శిష్యునిగా ఉన్నానని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. ప్రస్తుతం వీరి హయంలో శ్రీ చౌడేశ్వరి ఆలయం ఎంతగానో దినదినాభివృద్ధి చెందుతున్నదని నిమ్మరాజు అన్నారు. భారతదేశంలో తొలిసారిగా 23 కోట్ల శ్రీవిద్య బీజాక్షరములను చిత్తం చేయబడిన 27 అడుగుల ఎత్తులో నిర్మితమైన స్తూపం పై రెండు అడుగుల శ్రీ చక్రం ప్రతిష్టించబడిన చరిత్ర ఈ శ్రీ చక్రాలయం కు ఉందని నిమ్మరాజు తెలిపారు.

# ధీశాలి, త్యాగశీలి సర్దార్ గౌతు లచ్చన్న

## ఘనంగా సర్ధార్ గౌతు లచ్చన్న 115వ జయంతి: మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



**మైలవరం, ఆగస్టు 16: (ఆంధ్రపత్రిక):** స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా స్వతంత్ర భారత రాజకీయాలలో కూడా తనదైన ముద్ర వేసిన ధీశాలి, త్యాగశీలి సర్దార్ గౌతు లచ్చన్న అని, బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రగతి, సంక్షేమాల కోసం ఆయన చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమని, ఆయన ఒక్క కులానికే నాయకుడు కాదని జాతియావత్తుకు నాయకులు అని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ, మాజీమంత్రి, దివంగత నేత సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతిని మైలవరం పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ మహనీయుని సేవలను స్మరించారు. జోహార్ గౌతు లచ్చన్న అంటూ నినదించారు. కేకును కట్ చేశారు. అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రారంభించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ని ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అని అన్నారు. సాహసానికి, కార్యదక్షతకు ఆయన నిదర్శనమన్నారు. అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని జైలు జీవితం అనుభవించారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి అనుబంధంగా దేశంలోనే తొలి సారిగా సర్ధార్ గౌతులచ్చన్న రైతు పరిరక్షణ పేరిట ఆనాడే ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకు పాద యాత్ర నిర్వహించారన్నారు. మద్రాసు నుంచి ఉమ్మడి ఏపీ విభజనకు పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతే వివాహం చేసుకున్నారన్నారు. ఆయన దేశభక్తికి ఎందరో ప్రేరణ చెందారని తెలిపారు. అమరుల త్యాగాలను సర్వదా గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. వారి కుటుంబం నుంచి 13 సార్లు శాసనసభకు ఎన్నికయ్యారన్నారు. గౌతులచ్చన్న 6 పర్యాయాలు, ఆయన కుమారుడు శ్యాంసుందర్ శివాజీ 6 పర్యాయాలు, తాజాగా ఆయన మనుమరాలు గౌత శిరీష 13వ సారి శాసనసభకు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. దీన్నిబట్టి ఆయన కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరణను అంచనా వేయచ్చన్నారు. కులాన్ని అడ్డు పెట్టుకుని మంత్రి పదవి పొందిన జోగి రమేష్ అధికార మదంతో అవినీతికి పాల్పడి కేసుల్లో ఇరుక్కోగా చట్టప్రకారం అతని కుమారుడుని ఏసిబి వాళ్ళు అరెస్టు చేస్తే ఇది బీసీలు, గౌడ కులంపై దాడిగా చిత్రీకరించడం చాలా దుర్మార్గమన్నారు. అవినీతిపరులు, అవకాశవాదుల కల్లబొల్లి మాటలను నమ్మవద్దన్నారు. తనకు ప్రాతినిధ్యం ఇవ్వలేదని, మైలవరంలో గౌతులవుతున్న విగ్రహం ఆవిష్కరణను అడ్డుకున్న వ్యక్తి జోగి రమేష్ అని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయలేకపోయాడన్నారు. జోగి రమేష్ మంత్రిగా వున్నప్పుడు రూ. 7లక్షలు తీసుకుని ఓ బీసీ సోదరునికి ఉద్యోగం అమ్ముకోగా, తాజాగా అతని ఉద్యోగం పోయిందని, కానీ ఆ బీసీ సోదరునికి కూడా పైసా ఖర్చు లేకుండా తిరిగి తను మరో ఉద్యోగం ఇప్పించినట్లు పేర్కొన్నారు. తను శాసనసభ్యునిగా ఉన్న హయాంలో గౌడ కులానికి సముచిత ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. బీసీలకు అండ దండ టీడీపీ అని పేర్కొన్నారు. టీడీపీ నాయకుల తయారీ కర్మాగారం అని వివరించారు. గౌతు లచ్చన్న ఆశయాలను సాధిస్తామని స్పష్టం చేశారు. స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర పోషకాల యాజమాన్యంపై రైతులకు శిక్షణ




**పొన్నూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** పొన్నూరు మండలంలో ములుకుదురు గ్రామంలో సమగ్ర పోషకాల యాజమాన్యం పై రైతులకు శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుండి అగ్రానమి శాస్త్రవేత్త డాక్టర్ ఎం వెంకట్ రాములు పాల్గొన్నారు. వరిలో నత్రజని భాస్వరం పొటాష్ ఎరువుల వాడకం పై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ముడి జింకు దుక్కిలో 20 కేజీలు ఒక ఎకరానికి వేసుకోవాలని తెలిపారు. ముడి జింకు దుక్కిలో వేసుకోవడం కుదరకపోతే చిలేటెడ్ జింక్ పాటుగా రెండుసార్లు వారం రోజుల వ్యవధి తో పిచికారి చేయాలని తెలిపారు. పొటాష్ ను దుక్కిలో చిరుపొట్ట దశలో రెండు దఫాలుగా కలిపి 50 కేజీలు వాడుకోవాలని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వి రామకోటేశ్వరి ములుకుదురు నండూరు చింతలపూడి గ్రామాలలో నీ రైతులకు వరి బిపిటి 52 04 గ్రామీణ విత్తనోత్పత్తి పథకం లో భాగంగా మొదటి దఫా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నారుమడి తయారీ, యాజమాన్యం కలుపు నివారణ చర్యల గురించి తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం నుండి విచ్చేసిన వ్యవసాయ అధికారి ఎం రాజీవంసీ మాట్లాడుతూ ఎరువులు అవసరానికి మించి వాడరాదని అలా ఎక్కువ వాడినట్లయితే నేలలు చౌడువారతాయని తెలిపారు. ఎక్కువ బలం వాడితే ఎక్కువ దిగుబడి వచ్చేది ప్రస్తుత పరిస్థితిలో లేదని తెలియజేశారు. తదుపరి గ్రామం రైతు నాయకులు బొర్రు రామారావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు ఎరువులు సక్రమంగా వాడుకొని మంచి దిగుబడి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చింతలపూడి, నండూరు, ములుకుదురు గ్రామ వ్యవసాయ నాయకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా పెడనలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం



**పెడన ,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** పెడన నియోజకవర్గం లో తొలి అన్నా క్యాంటీన్ ను ప్రారంభించిన మచిలీపట్నం లోక్ సభ ఎంపీ వల్లభనేని బాలసౌరి మరియు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మరియు మాజీ పార్లమెంటు సభ్యులు జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు ఈ సందర్భంగా ఎంపి బాలశౌరి మాట్లాడుతూపెడన నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని బాల సౌరి పేర్కొన్నారు. పెడన పట్టణంలో మంచినీటి సమస్య డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బాలశౌరి పేర్కొన్నారు నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి మరియు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులను కాగిత కృష్ణప్రసాద్ తో కలిసి తీసుకొస్తామని అన్నారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోపిడీ చేసిన వైసిపి నేతలు రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేశారు.

రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సంక్షేమం పాలన ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు అన్న క్యాంటీన్ కి సాధ్యమైనంత ఎక్కువ మంది విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

## తిక్కిశెట్టి మోహన్ రావుకు

# ప్రశంసా పత్రం



**పెడన ,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** 78 వస్వతంత్ర దినోత్సవ శుభ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాదికారిగా పెడన గూడూరు మండలాల్లో పనిచేస్తున్న. తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావుకి ప్రభుత్వం తరఫున సేవా పురస్కారం కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా సేవ పురస్కారం అందు కున్నందుకు తోటి ఉద్యోగులు తన సిబ్బంది శుభాకాంక్షలు

## శ్రామిక నగర్ పాఠశాల ఆవరణలో మెరక పనులు

### ఆరు ట్రాక్టర్ల డస్ట్ తోలించి మంచి మనసు చాటుకున్న జనసేన శ్రీకాంత్

#### వెంటనే స్పందించి మెరక చేయించిన శ్రీకాంత్ కు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృతజ్ఞతలు



**మైలవరం, ఆగస్టు 16: (ఆంధ్రపత్రిక):** కొండపల్లి శ్రామిక నగర్ (కొత్త గేటు) మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఆంధ్రా జోన్ కో - కన్వీనర్ బొళియశెట్టి శ్రీకాంత్ శుక్రవారం మెరక చేయించి తన మంచి మనసును చాటుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవరణలో గోతులు ఉండి విద్యార్థులు కిందపడి గాయాలపాలవుతున్నట్లు హెచ్ఎం ఆయనకు వివరించడంతో చలించారు.

ఆవరణను మెరక చేయిస్తానని హామీ ఇచ్చారు. మరు సటి రోజే ఆయన ఆరు ట్రాక్టర్ల డస్ట్ తోలించి స్వయంగా ఆవరణలో పరిచి మెరక చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రామిక నగర్ పాఠశాలలో 170 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. ఆవరణ సరిగా లేక ఆటలు ఆడేటప్పుడు కిందపడి గాయపడుతున్న విషయం తెలియడంతో బాధ కలిగించిందన్నారు. డస్ట్ తో మెరక చేసేందుకు స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువత సహకరించారని తెలిపారు. ఈ పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అడిగిన వెంటనే స్పందించి ఆవరణను మెరక చేయించిన శ్రీకాంత్ కు హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎ. కొండూరులో ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన

### ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్





**ఎ. కొండూరు ఆగస్టు 16(ఆంధ్రపత్రిక):** దీర్ఘకాలిక గిరిజన ప్రజల సమస్యలు పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఎ. కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి గిరిజనప్రజల నుండి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఉదయం 9 గంటలకే గిరిజన ప్రజలు వినతి పత్రాలతో బారులు తీరారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను అధికారుల సమక్షంలో సత్వర పరిష్కారానికి కృషి చేశారు. గంటల తరబడి నిలబడి ఎంతో ఓపికగా ప్రజా సమస్యలు వింటూ అర్జీలు స్వీకరించారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు గెలిచిన నాటి నుండి ప్రజా సమస్యలను వింటూ వాటి సత్వర పరిష్కారానికి భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలో ఎంతోమంది ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ స్వయంగా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్న దాఖలాలు లేవు. ప్రజా సమస్యలను తన సొంత సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోనే వెనకబడినఎ. కొండూరుమెట్ట మండలాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి పరచటానికి అధికారులను . అప్రమత్తం చేసి పరుగులు పెట్టిస్తున్నారు. ప్రజలు ప్రతి పనికి ప్రభుత్వ కార్యాల యాల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షణలు చేసి అలిసిపోయే పరిస్థితుల నుండి కాపాడేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రజల నుండి వివిధ సమస్యలపై సుమారు 150 పైగా అర్జీలను స్వీకరించారు వాటి పరిష్కారానికి సత్వర కృషి చేయాలని ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. అంతకుముందు పాత కొండూరు గ్రామానికి చెందిన వెంపాటి దావీదు అనే ఆటో డ్రైవర్ కుమార్తె వెంపాటి దివ్య కు ఉన్నత చదువుల నిమిత్తం రూ 20,000 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు

ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ బి ఆశయ్య ఎంపీడీవో కెఎస్ రవికాంత్ ఈ ఓ పి ఆర్ డి శ్రీకృష్ణ పరమాత్మ ఏవో షేక్ టిప్పు సుల్తాన్ పి ఆర్ ఏ ఈ సాంబశివరావు. విద్యుత్ ఏ ఈ నాగరాజు ఇరిగేషన్ శాఖాధికారులు ఆర్డబ్ల్యూఎస్ శాఖాధికారులు. వైద్య ఆరోగ్యశాఖాధి కారులు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి తిరువూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి మాజీ ఎంపీపీ వాసం ముని అయ్యమండల టిడిపి ప్రధాన కార్యదర్శి వనపర్ల దేవిడ్ రాజు పిన్నమనేని శ్రీనివాసరావు రేపూడి మాజీ సర్పంచ్ కతారు కోటేశ్వరావు బాపిరెడ్డి బి గోపిరాజు నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లయ్యపాలెంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



**బల్లికురవ, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** బల్లికురవ మండలంలోని మల్లయ్యపాలెం గ్రామంలో పొలాల్లో ఉన్నటువంటి విద్యుత్ స్తంభం కిందకు వాలింది. నెలలు గడుస్తున్న అధికారులకు చెబితే పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ స్తంభం రైతు పొలంలో ఉండడం వలన రైతుల్ని భయానికి గురిచేస్తుంది . రైతులకు ఇబ్బంది కలగకుండా త్వరగా స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు. ప్రమాదకరంగా ఉండడంతో పాటుగా, పొలం పనులు మొదలుకానున్న నేపథ్యంలో ఎవరికైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు .

## హోప్ ఆర్గనైజేషన్ కంభంపాడు వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**ఎ. కొండూరు, ఆగస్టు 16 ( ఆంధ్రపత్రిక):** తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులుకొలికపూడి. శ్రీనివాస రావు చేతులమీదుగా ఎ.కొండూరు మండలంలోని మంచానికే పరిమితమైన 8 మంది దివ్యాంగులకు హెూప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టాయిలెట్ సౌకర్యం కలిగిన ఫోల్డింగ్ వీల్ చైర్స్ పంపిణీ చేయడం జరిగింది. హెూప్ ఆర్గనైజేషన్ కంభంపాడు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇటువంటి పలు సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే శ్రీ. కొలికిపూడి శ్రీనివాసరావు అభినందించారు. భవిష్యత్తులో దివ్యాంగులకు సంబంధించిన కార్యక్రమాలకుతనవంతు సహాయాన్ని అందిస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా మంచానికే పరిమితమై లేవలేని దివ్యాంగుల తల్లిదండ్రులు పెన్షన్ పెంపుదల గురించి ఎమ్మెల్యేకు విన్నవించుకోగా ప్రభుత్వం నుండి 15వేల పెన్షన్ మంజూరయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి సహాయాన్ని అందించిన దాత శ్రీమతి. శైల(యూఎస్ఏ) వారికి హెూప్ సంస్థ నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డికృష్ణారెడ్డిగిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. గోపి రాజు మల్లాది. చంటి మరియు హెూప్ సంస్థ ఫౌండర్ బి.విశ్వభారతి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.ఫణీంద్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం రాజశేఖర్, ఉపాధ్యక్షులు కె. లక్ష్మణరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కె.పవిత్ర కుమార్, సూరిశెట్టి రాజేష్ లు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

## ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు





**తిరువూరులో అన్న క్యాంటీన్లు పునః ప్రారంభోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికపూడి - అన్న క్యాంటీన్ కు వచ్చిన ప్రజలకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించిన ఎమ్మెల్యే కొలిక పూడి - అన్న క్యాంటీన్లు పున ప్రారంభోత్సవం కావడంతో పేద ప్రజల కళ్ళల్లో ఆనందోత్సవాలు వెల్లి విరిశాయి**

**తిరువూరు ఆగస్టు 16( ఆంధ్రపత్రిక):** తిరువూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో అన్న క్యాంటీన్ నుపునః ప్రారంభోత్స వాన్ని శుక్రవారం ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివా సరావు. అన్న క్యాంటీన్ కు వచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే స్వయంగా అల్పాహారాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదోడికి పట్టేడు అన్నం పెట్టాలన్న మానవత దృక్పథంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో మొదటి ఐదు సంతకాల్లో చేర్చిన గొప్ప పథకం అన్న క్యాంటీన్ అని ఆయన పేర్కొన్నారు. పేదల కడుపు నిండితే వచ్చే సంతోషం చెప్పరానిదని అలాంటి అన్న క్యాంటీన్లు పునః ప్రారంభించి పేద ప్రజలకు మళ్లీ అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొచ్చినందుకు సీఎం చంద్రబాబు నాయుడు కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులు శ్రామికులకు ఈ అన్న క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. జగన్ తన కక్షపూరిత ఆలోచనతో పేద ప్రజలకు అన్న క్యాంటీన్లు లేకుండా చేశాడని మండిపడ్డారు. భవిష్యత్తులో రాజకీయాలకు అతీతంగా తిరువూరు నియోజవర్గ వ్యాప్తిగా కలిసి వచ్చే దాతలు సహకారంతో అన్న క్యాంటీన్ సేవలను విస్తృత పరుస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు మరియు తిరువూరు నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ జి లోవరాజు , తిరువూరు కౌన్సిలర్లు బడుగు బలహీన వర్గాల నిరుపేదప్రజలుపాల్గొన్నారు.

## ఉత్తమ వెలుగు సీసీగా పీతల దేవమణి



**బంటుమిల్లి,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రతి సంవత్సరం, అవార్డులు మరియు ప్రశంసాపత్రాలు బహకరించడం జరుగుతుంది. ఈ సందర్భంగా గురువారం మచిలీపట్నం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు జరిగిన కార్యక్రమంలో పెడన మండలం వెలుగు కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న పీతల దేవమణి కి ఉత్తమ సేవలు అందించినందుకు గాను జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగింది. తాము చేసే పనిలో నిబద్ధత కలిగి ఉంటే ఇలాంటి సత్కారాలు అందుకుంటారని దేవమణి నిరూపించిందని గ్రామస్తులు నాయకులు ఆవిడను ప్రశంసించారు. ప్రభుత్వం ఆన్ లైన్ అందించే అన్ని సౌకర్యాలను డ్వాక్రా మహిళలకు అందించే విషయంలో మొదటి స్థానంలో తాను ఉండడంతో ఈ ప్రశంసా పత్రాన్ని తనకు అందజేయడం జరిగిందని దేవమణి తెలియజేశారు.

తాను చేసే వృత్తిలో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్క డ్వాక్రా అక్కచెల్లెళ్లకు నా తోటి సిబ్బందికి, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు దేవమణి తెలియజేశారు. ఆగస్టు 15 రోజున ఇంతమంది అధికారులు ప్రజల మధ్య అవార్డు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఈ అవార్డు నాపై మరింత బాధ్యతను పెంచిందని, నేను చేసే వృత్తి పట్ల నిబద్ధతతో మెలుగుతానని దేవమణి తెలియజేశారు.

## దివ్యాంగులకు ఆశాకిరణం హీల్ కృత్రిమ అవయవ కేంద్రం



**ఆగిరిపల్లి ,ఆగస్టు 16 ( ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో సక్కు గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ముత్తవరపు మాధవి లత ఈరోజు పిడుగురాళ్ల కు చెందిన భూసి, మేరీ ఇవాంజెలిన్, మామదూరు కు చెందిన గుత్తుల మోహిని లకు కృత్రిమ కాళ్ళను అందజేస్తూ ప్రమాదంలో గాని, తీవ్ర అనారోగ్య సమస్యల వల్ల కానీ కాళ్లు కోల్పో యిన వారికి హిల్ కృత్రిమ అవయవకేంద్రం ఒక ఆశా కిరణం లాగా నిలుస్తుందని , నిరుపేద బాలల కు, అంధ బాలలకు ఉచిత విద్య, వసతి కల్పించడంతోపాటు, వందలాది మందిని ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ కోర్సులలో నిష్ణాతులను చేస్తూ వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఫీల్ సంస్థను అభినందించారు.

హిల్ సంస్త సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ హీల్ కృత్రిమ అవయ వ కేంద్రం ద్వారా ఇప్పటివరకు 580 మందికి కృత్రిమ కాళ్లు అందజేయడం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి తాతనేని లక్ష్మి, హిల్ డైరెక్టర్లు మలినేని రంగ ప్రసాద్, వై వి ఎస్ చలపతి రావు, సీనియర్ టెక్నీషియన్ చిన్న మరియు కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# పశ్చిమలో మూడు చోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభం



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** పశ్చిమ నియోజకవర్గంలో కాళేశ్వరరావు మార్కెట్, భవాని పురంఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు, హెచ్ బి కాలనీల లోని అన్న క్యాంటీన్లను విజయవాడ పార్ల మెంట్ సభ్యులు కేశినేని శివనాద్ తో కలిసి ఎమ్మెల్యే సుజనా చౌదరి శుక్రవారం ప్రారంభి ంచారు. అనంత రం పేదలకు అల్పా హారాన్ని వడ్డించారు. హరే రామ మూమెంట్స్, అక్షయ పాత్ర చారిటబుల్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ల నిర్వహణ కొనసాగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. పేదలకు కడుపు నింపే అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శి ంచారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలో వచ్చిన 100 రోజుల్లోపు సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి పేదవాడి కడుపు నింపి ఇచ్చిన మాట నిలబెట్టు కున్నారన్నారు. ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 100 క్యాంటీన్లకు పైగా ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రారంభించారన్నారు. గత ప్రభుత్వ పాలనలో అన్న క్యాంటీన్లను మూసివేస్తే మొబైల్ అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేసి పేదవారి ఆకలి తీర్చామన్నారు. పేదల కడుపు నింపే ఈ అన్న క్యాంటీన్ల నిర్వహణకు దాతలు విరివిగా విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అడిషనల్ కమిషన్ జనరల్ మహేష్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, తెలుగుదేశం నాయకులు ఎమ్మెస్ బేగ్, మొహమ్మద్ ఫతావుల్లా, షేక్ ఆషా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో
## అమ్మిశెట్టి వాసు జన్మదిన వేడుకలు



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు జన్మదిన వేడుకలు 45వ డివిజన్ లో జనసేన డివిజన్ అధ్యక్షురాలు బొమ్ము గోవిందలక్ష్మి- రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శుక్రవారం కబేళారోడ్డులోని ఎన్ కన్వెన్షన్ ఎదురుగా వున్న జనసేన 45వ డివిజన్ కార్యాలయం వద్ద ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీచేసారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షురాలు బొమ్ము గోవిందలక్ష్మి మాట్లాడుతూ జనసేన కోసం అహర్నిశలు పనిచేసే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది అమ్మి శెట్టి వాసు అని అన్నారు. జనసేన పార్టీ పెట్టిన దగ్గర నుంచి ఇప్పటివరకు ఏ స్వార్థము లేకుండా ఏ పదవి ఆశించకుండా కష్టపడి పనిచేసిన నాయకుడు వాసు అని కొనియాడారు. అలాంటి వ్యక్తికి అతి త్వరలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మంచి పదవి ఇచ్చి పవన్ కళ్యాణ్ గౌరవిస్తారని, అతి త్వరలో అది జరగాలని మేము కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ నుంచి డివిజన్ అధ్యక్షులతో పాటు 45వ డివిజన్ జనసేన ఉపాధ్యక్షులు ముత్తంశెట్టి దుర్గా కిషోర్ ,కార్యదర్శి మద్ది రామలక్ష్మణరావు, ఫణి దేవా, నాగరాజు, సుబ్బారావు , వీరయ్య ఇంకా జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశానికి మాజీప్రధాని వాజ్‌పేయి సేవలు అమూల్యం



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్ పాయ్ వర్ధంతి సందర్భంగా బిజెపి చిట్టినగర్ మం డల ఆధ్వర్యంలో దేవిన హరిప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం వాజ్‌పాయ్ చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బలివాడ శివకుమార్ పట్నాయక్ మాట్లాడుతు దేశాని కి వాజ్‌పాయ్ చేసిన సేవలు అమూల్యమని అన్నారు.

రాజకీయనాయకులకు ఆదర్శంగా స్వర్గీయ వాజ్ పాయ్ నిలిచారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బిజెపి ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి శ్రీధర్ ,బిజెపి ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి అవ్వా రు బుల్లబ్బాయి, ఎన్డీయే నాయకులు పోతిన బేసికంతేశ్వరుడు, కనిశెట్టి లక్ష్మణ రావు, పిల్లా శ్రీనివాసరావు, ఎర్ర రవి చౌదరి ,సత్య నారాయణ, గూడేల రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రతి పేదవాని ఆకలి తీర్చడానికి దాతలు ముందుకు రావాలి
### జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఐఏఎస్





**గుంటూరు, ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** ప్రతి పేదవానికి నాణ్యమైన ఆహారం నామమాత్రపు ధరకే అన్న క్యాంటీన్లలో లభిస్తుందని, మరింత మంది ఆకలి తీర్చడానికి దాతలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఐఏఎస్ కోరారు. శుక్రవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పల్నాడు బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్ ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్, ఎంఎల్‌ఏ గల్లా మాధవిలతో కలిసి కలెక్టర్ పునః ప్రారంభించారు. అనంతరం కమిషనర్ తూర్పు నియోజకవర్గ ఎంఎల్‌ఏ నసీర్ అహ్మద్ తో కలిసి నల్లచెరువు మెయిన్ రోడ్ లోని క్యాంటీన్ ను, ప్రత్తిపాడు ఎంఎల్‌ఏ బి.రామాంజనేయులు, తాడికొండ ఎంఎల్‌ఏ తెనాలి శ్రావణ్ కుమార్ లతో కలిసి ఆర్.టి.ఓ. ఆఫీస్, ఐడి హాస్పిటల్ వద్ద క్యాంటీన్లను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 ల నామ మాత్రపు ధరకే అందిస్తుందన్నారు. కేవలం రూ.15 తో 3 పూటలా కడుపు నింపుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి కల్పించారన్నారు. గుంటూరు జిల్లాలో జిఎంసి పరిధిలో 7, మంగళగిరి %-% తాడేపల్లి కార్పోరేషన్ పరిధిలో 3, తెనాలి మున్సిపాల్టీ పరిధిలో 3 క్యాంటీన్లను శుక్రవారం పునః ప్రారంభం చేస్తున్నామన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతి రోజు నిర్దేశిత మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందిస్తుందన్నారు. పేదల ఆకలి తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్న క్యాంటీన్ల బృహత్తర కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ పేదలకు 3 పూటలా కడుపు నింపే అన్న క్యాంటీన్లను ఇప్పటికే గుంటూరు నగరంలో ప్రధాన పల్నాడు బస్టాండ్, నల్లచెరువు, మిర్చి యార్డ్, చుట్టగుంట, ఆర్.టి.సి బస్టాండ్, ఐడి హాస్పిటల్, ఆట.టి.ఓ ఆఫీస్ వంటి 7 ప్రధాన ప్రాంతాల్లో పునః ప్రారంభం చేసుకోవడం జరుగుతుందన్నారు. త్వరలో మరిన్ని క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం టిఫిన్, భోజనం అధిక ధర ఉన్న సమయంలో పేదలకు రూ.5 కే టిఫిన్, రూ.5 కే భోజనం అందిస్తున్న ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారం అందించిడంలో తమ వంతు భాద్యతగా జీతంలో నుండి రూ.25వేలు అందిస్తామని, నగరంలోని దాతలు అన్న క్యాంటీన్ల ద్వారా మరింత మంది పేదలకు ఆహారం అందించడానికి తోడ్పాటు అందించాలని కోరారు.

ఎంఎల్‌ఏ గల్లా మాధవి మాట్లాడుతూ రోజువారీ కూలి చేసుకునే ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడం ద్వారా వారికి కడుపు నిండా భోజనం అతి తక్కువ ధరకే అందుతుందన్నారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను అర్ధాంతరంగా మూసివేసి, క్యాంటీన్లను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మార్చారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే పేదల ఆకలి తీర్చే క్యాంటీన్లకు మహర్దశ వచ్చిందన్నారు.

తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ పేదవాని ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి అమలు చేస్తున్న అన్న క్యాంటీన్లలో ప్రతి శుక్రవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 2 క్యాం టీన్లలో మధ్యాహ్నం భోజనం ఖర్చు తనే భరిస్తామని తెలిపారు. అలాగే నగరంలోని ఆటో నగర్, జిఎంసి దగ్గర, ప్రభుత్వ వైద్యశాల ప్రాంతాల్లో కూడా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. శ్యాం సుందర్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వర రావు, శ్రీనివాస్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్



**పొన్నూరు ,ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశామని పొన్నూరూ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరు అన్నా క్యాంటీన్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్న క్యాం టీన్ల ప్రారంభంతో పేద ప్రజల ముఖాల్లో ఆనందాన్ని చూస్తున్నాం. 2014-19లో టిడిపి ప్రభుత్వ పాలనలో తక్కువ ధరకే నాణ్యమైన అల్పహారాన్ని భోజనాన్ని పేదలకు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల జీవితాల్లో వెలుగులు నింపే విధంగా అనేక నిర్ణయాలు తీసుకున్నాం అని చెప్పారు.

పెన్షన్ లబ్ధిదారులకు మేలు జరిగే విధంగా పెన్షన్లు పెంచటం జరిగింది. నిరుపేదలు, శ్రామికుల కోసం అన్న ఎన్టీఆర్ స్ఫూర్తిగా అన్న క్యాంటీన్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాం. అన్న క్యాంటీన్ల నిర్వహణకు దాతలు విరాళాలు ఇవ్వవచ్చు .పేదల జీవితాల్లో వెలుగులు నింపటానికి కూటమి ప్ర భుత్వం కృషి చేస్తున్నది . ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమ పాలన అందించడానికి కట్టుబడి ఉన్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం-జనసేన-బిజెపి పార్టీల నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు మున్సిపాలిటీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య పోరాట యోధులు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



**పెడన, ఆగస్టు 16 ( ఆంధ్రపత్రిక):** పెడన టౌన్ నందు స్వాతంత్ర్య పోరాట యోధులు శ్రీ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించిన మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ రావు. పెడన నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పట్టెడు అన్నం అందించేందుకే అన్నా క్యాంటీన్



**బాపట్ల,ఆగస్టు 16 ( ఆంధ్రపత్రిక):** పేదలకు కడుపునిండా పట్టడు అన్నం అందించేందుకే అన్న క్యాంటీన్లో రాష్ట్ర ప్రభుత్వం పున ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ వెంకట మురళి అన్నారు. స్థానిక అన్న క్యాంటీన్ ను ఎంపీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి ఆయన ఆహారాన్ని వడ్డించారు. ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తెదేపా ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వేగేసన నరేంద్ర వర్మ మాట్లాడుతూ గత మూడు సంవత్స రాలుగా బాపట్ల పట్టణంలో దాతల సహకారంతో అన్న కాంటీన్ ను పార్టీ ఆవరణలో కొనసాగించామని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్త ంగా ఈ క్యాంటీన్లలో పునః ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదు



**పొన్నూరు ,ఆగస్టు 16 ( ఆంధ్రపత్రిక):** మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని పొన్నూరు సిఐ భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐలాండ్ సెంటర్లో ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలకు చలానా విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వటం వలన ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అలా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే వాహనం ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## బండ్లమోటు పోలీస్ స్టేషన్‌కి నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణ



**బొల్లాపల్లి ,ఆగస్టు 16 ( ఆంధ్రపత్రిక):** బొల్లాపల్లి మండలం బండ్లమోడు పోలీస్ స్టేషన్ కి వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ లిశ్రీ కొంజేటి నాగశ్రీను రాయల్‌లి ఆదేశాల మేరకు S.I చార్జ్ తీసుకున్న బాలకృష్ణని శాలువాతో సత్కరించిన జనసేన పార్టీ బొల్లాపల్లి మండల అధ్యక్షుడు ఎర్రం శెట్టి వెంకటేశ్వర్లు బొల్లాపల్లి మండల ఉపాధ్యక్షుడు యర్రం శెట్టి హనుమాన్ నాయక్ రఘుపతి అశోక్ కామిశెట్టి రామారావు, సతీష్ ,ఎలిసెట్టి శ్రీను, పసుపులేటి వెంకయ్య, కందుల సురేష్, పవన్ ,చంద్రమోహన్, రాహుల్ మరియు మండల స్థానిక నాయకులు కార్యకర్తలు నాయకులు పూలమాలలు శాలువాలతో సత్కరించారు అనంతరం మండల మండల నాయకులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన
## మహోన్నత వ్యక్తి గౌతు లచ్చన
### తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు : ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** దేశ స్వాతంత్ర సంగ్ గ్రామంలో ప్రముఖ పాత్ర పోషించి స్వాతంత్రం వచ్చిన తర్వాత బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయులు సర్దార్ గౌతు లచ్చన్న అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కొనియాడారు. శుక్రవారం సర్దార్ గౌతు లచ్చన్న 115 వ జయంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్లో గల గౌతు లచ్చన్న విగ్రహానికి గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, పశ్చిమ శాసన సభ్యురాలు గళ్ళ మాధవి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ దేశంలో సర్దార్ అనే బిరుదు కేవలం ఇద్దరికే ఉందని ఒకరు సర్దార్ వల్లభాయ్ పటేల్ అయితే రెండు మన శ్రీకాకుళం జిల్లాకు చెందిన గౌతు లచ్చన్న కావడం గర్వకారణం అన్నారు. గౌతులచ్చన ఏ కులానికి ఏ రాజకీయ పార్టీకి ఏ వర్గానికి నాయకుడు కారని స్వాతంత్ర సంగ్రామంలో తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశం కోసం ప్రజల కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. సామాజిక న్యాయం కోసం వాడు చేసిన పోరాటాలు చరిత్ర ఆత్మీకం అని వారు కోరుకున్న విధంగానే నేడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన ఉందని రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా బడుగు బలహీన వర్గాలకు దేశంలోనే ఎ ముఖ్యమంత్రి చేయని విధంగా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలిచి ఉన్నత స్థానాన్ని కల్పిస్తుందని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. స్వాతంత్రం అనంతరం మంత్రిగా పనిచేస్తూ మద్యపానం నిషేధం చేయాలని తన పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి బలహీన వర్గాల ప్రజలు మందుకు బానిస కాకూడదని నైతిక విలువలు కలిగిన రాజకీయ నాయకుడుగా గౌతు లచ్చన్న నిలబడ్డారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అణగారిన వర్గాల పట్ల నిరంతరం పోరాడిన గౌతు లచ్చన్నను ప్రతి ఒక్క రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతురాజు సమత రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు కేసేన శంకర్రావు, విప్ప క్రాంతి కుమార్, రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు రాంగోపాల్ గౌడ్, నరసింహారావు, రావులమని, శ్రీనివాస్ కుమార్, శేషు, వేములకొండ శ్రీనివాస్, గాలి సతీష్, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### భారతరత్న ,మాజీ ప్రధాని ఆటల్ బిహారీ వాజ్ పేయి
## 6వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**గుంటూరు : ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** భారతరత్న ,మాజీ ప్రధాని ఆటల్ బిహారీ వాజ్ పేయి 6 వ వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యలయంలో ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాలు అర్పించటం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ అనంతపద్మనాభం సభాధ్యక్షత వహించగా జిల్లా సంయోజక్ భీమినేని చంద్ర శేఖర్ మాట్లాడుతూ మన మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసే వారని అలా ఎదుగుతూ భారతీయ జన సంఘ్ పార్టీ లో చేరి తనదైన పాత్రను పోషించారు. తర్వాత రోజుల్లో భారతీయ జనతా పార్టీని వాజ్ పాయ్ స్థాపించి తదనంతరం బిజెపిని అధికారం లో కీ తీసుకొని వచ్చారని. గ్రామీణాభివృద్ధి రోడ్డు సదుపాయాలు కోసం ప్రధాని గ్రామీణ సడక్ యోజన పథకాన్ని పెట్టి గ్రామలలో రోడ్ల సదుపాయం కలిపించారు. అనేకమైన సంక్షేమం పథకాలు అంత్యోదయా సిద్ధాంతం ఆధారంగా పెట్టి దేశ అభివృద్ధి చేసిన వ్యక్తీ అటల్ వాజ్ పేయి అన్నారు. వారు మొదటి నుంచి చివరి వరకు తాను నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని, అలాగే పార్టీ ని అధికారంలోకి తీసుకురావడం కోసం కష్టపడ్డారు కానీ ఓట్ల కోసం వారు ఓటు బ్యాంకు రాజకీయాలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతి రావు, ఆవుల రాము, షేక్ సాంబశివరావు, కారంశెట్టి రమేష్, యారవ శ్రీను, నాగమల్లీశ్వరి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతమాత వైభవమే బిజెపి లక్ష్యం
### ఆగస్టు 11 నుండి 16 వరకు జరిగిన వారోత్సవాలలో మాజీ మంత్రి శనక్కాయల అరుణ



**గుంటూరు : ఆగస్టు 16, (ఆంధ్రపత్రిక):** భా.జ.పా గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస రెడ్డి సారధ్యంలో దివంగత అటల్ బిహారి వాజ్ పాయి వర్ధంతితో ముగిసాయి. తొలిగా టి.జే.పి.ఎస్ కళాశాల పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి పట్టాభిపురం స్వామి వివేకానంద సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించి "స్వాతంత్ర్య ప్రకటనకు ముందు ఒక్కసారిగా తెరమీదకు వచ్చిన దేశ విభజన కారణంగా జరిగిన మరణకాండ అంశాలను మారిన రాజకీయ పరిస్థితులలో బంగ్లాదేశ్ హిందూవులపై జరుగుతున్న అకృత్యాలను వివరిస్తూ ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మఃశాంతి కలగాలని నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా మాజీమంత్రి శనక్కాయల అరుణ, స్థానిక కార్పోరేటర్ ఈరంటి వరప్రసాద్, మాజీ కార్పోరేటర్ మాగంటి సుధాకర్ మాట్లాడుతూ దేశ విభజన రాజ్యాధికారకాంక్ష కారణంగానే జరిగిందని, నేడు బంగ్లాదేశ్ లో హిందువులపై ప్రారభమైన మారణ కాండను ప్రజలు ఖండించాలని కోరారు. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఉరికంబాలెక్కిన అమరవీరుల త్యాగాలను వృద్ధాకానివ్వ మన్నా రు. ఈదర శ్రీనివాసరెడ్డి సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాజపా, జనసేన నేతలు పాకనాటి రమాదేవి, మకుటం శివ, పాలపాటి రవికుమార్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ గుదిబండి సాంబిరెడ్డి, బండారుపల్లి రోశయ్య, మర్రి శంకరరావు, వెలగలేటి గంగాధర్, బొలగాని సాంబయ్య, బొల్లాప్రగడ శ్రీదేవి, జెట్టిబాబు, కపిలవాయి బధరీనారాయణ, సరస్వతినంధి, పోకూరి జితేంద్ర, ముత్యం నరేంద్ర, అంకాల శ్రీనివాసరావు, చాపల రంగారావు, తాడువాయి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 17న వైద్యుల సమ్మె

**పొన్నూరు ,ఆగస్టు 16 ( ఆంధ్రపత్రిక):** ఇటీవల కోల్‌కతాలో వైద్యు రాలిపై అత్యాచారం హత్య జరిగిన నేపథ్యంలో నిరసనగా ఈనెల 17న సమ్మె చేస్తున్నట్లు పొన్నూరు ఐఎంఏ వైద్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘటనకు కారణం వారిన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలికి సంఘీ భావాన్ని తెలియజేయడానికి , ఆసుపత్రులలో భద్రత కోసం మా డిమాండ్లను నెరవేర్చడానికి అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆగస్టు 17న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఆగస్టు 17వ తేదీ శనివారం ఒపిడీ ఎలెక్టివ్ పనిని నివారించండి అన్నారు. ప్రెసిడెంట్ డాక్టర్ సజ్జా రవీంద్రబాబు , సెక్రటరీ డాక్టర్ ఎన్వీ రమణారావు తెలిపారు.

# బంధాలు,బిజినెస్ ఒకటి కాదు..

(మొదటిపేజీ తరువాయి)

పొంగిపొర్లుతుందని సెటైర్లు వేశారు.కాగా ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బారామతి స్థానం నుంచి సోదరి సుప్రియా సోలే మీద పోటీకి తన భార్య సునేత్ర పవార్‌ను నిలబెట్టినందుకు బాధపడుతున్నట్లు అజిత్ పవార్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నేడు సుప్రియా తన సోదరుడికి కౌంటర్ ఇచ్చింది.ఆమె మాట్లాడుతూ.. బంధాలు, వ్యాపారం మధ్య తేడాను మన సోదరులు గుర్తించలేక పోతున్నారు. ఎవరూ కూడా బంధాల మధ్యలోకి డబ్బును తీసుకురాకూడదు. అదే విధంగా వ్యాపారం లోకి సంబంధాలను లాగకూడదు. అయితే మా సోదరుడు దీనిని అర్థం చేసుకోవడంలో విఫలమ య్యాడు. ఇది మాకు చాలా బాధ కలిగిస్తోంది.' అని అన్నారు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల పట్ల నిజమైన ప్రేమ లేదని, ఎన్నికల లబ్ధి కోసం సంక్షేమ పథకాలను సాధనాలుగా వాడుకుంటుందని విమర్శించారు.'ఈ ప్రభుత్వం ఏం చేసిన ఓట్ల కోసమే. మంచిఉద్దేశ్యంతో ఏం చేయదు. ఇదీ లోక్‌సభ ఎన్నికల ప్రభావం. రెండేళ్ల క్రితం అక్కాచెల్లెళ్లపై ఎవ్వరూ అభిమానం చూపలేదు. ఇది కేవలం లోక్‌సభ ఎన్నికల ప్రభావం మాత్రమే' నని అన్నారు.అయితే ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలోని 'లడ్కీ బహిన్' స్కీమ్‌ను ఉద్దేశించి చేసినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి వల్లనే మహిళలకు నెలకు రూ.1,500 ఇచ్చే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు.

# నేడు వైద్య సేవలు బంద్

(మొదటిపేజీ తరువాయి)

నిరసనలు కొనసాగుతున్నాయి. జూనియర్ డాక్టర్ హత్యకేసులో నిందితులను శిక్షించాలని ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. గత ఏడు రోజులుగా ఆరోగ్య సేవలు స్తంభించగా, తోటి విద్యార్థికి న్యాయం చేయా లంటూ జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్, అత్యవసర సేవలు నిలిచి పోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.కాగా, ఆసుపత్రిని సందర్శించిన గవర్నర్ బోస్ సంబంధిత జూనియర్ వైద్యులతో మాట్లాడారు. దేశంలోని అన్ని నగరాల్లో వైద్యులు నిరసనలు తెలుపుతున్నారు. విధుల నుంచి బహిష్కరించిన బాధిత కుటుం బానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ట్రైనీ డాక్టర్ హత్యకు నిరసనగా రేపు దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. 17వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటిం చారు. అయితే, అత్యవసర వైద్య సేవలకు మినహాయింపు ఉంటుంది. ఈ మేరకు అర్ధరాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. మరోవైపు జూనియర్ డాక్టర్ హత్యపై పశ్చిమ బెంగాల్ అర్ధరాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి మహిళా స్వాతంత్ర్యం కోసం నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల అర్ధరాత్రి మహిళలు నిరసన తెలిపారు.

# త్వరలోనే పోలవరం పనులు..!

(మొదటిపేజీ తరువాయి)

దాటగానే పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు వీలుగా డిజైన్, నిర్మాణ అంశాలు చర్చిం చేందుకు వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందులో పోలవరం ప్రాజెక్ట్ డిజైనర్, ప్రాజెక్టను పర్యవేక్షించే ఇంజినీర్ల బృందం, విదేశీ నిపుణుల బృందం ఉండాలని సూచించింది. డిజైన్ల రూపకల్పన, నిర్మాణ షెడ్యూలు నిర్ణయించడం, అందుకుతగ్గ వనరులు ఏవేంకావాలో ఈ వర్క్‌షాప్‌లో ఒక స్పష్టతకు రావాలని అభిప్రాయపడింది.. ప్రధాన డ్యాం ప్రాంతం పొడవునా సీపేజీ నీటిమట్టానికి 8 మీటర్ల ఎత్తులో ఒక ప్లాట్‌ఫాం నిర్మించాలని.. దాన్నుంచి ఎప్పుడూ నీటి మట్టం 8 మీటర్ల కన్నా దిగువన ఉండేలా పంపింగ్ ఏర్పాట్లు చేయాలని బృందం స్పష్టం చేసింది.. ఈ ఏర్పాట్లు వచ్చే వానాకాలంలో కూడా డయాఫ్రం వాల్ నిర్మాణానికి అవాంతరాలు కలిగించని స్థితిలో ఉండేలా చూడాలని విదేశీ నిపుణుల బృందం సూచించింది.కాగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు.. అప్పటి వరకు జరిగిన పనులపై ఆరా తీశారు.. ఆ తర్వాత.. పోలవరం ప్రాజెక్టు సవాళ్లపై అధ్యయనం చేసేందుకు విదేశీ నిపుణుల బృందాన్ని నియమించిన విషయం విదితమే.. ఇక, ఆ విదేశీ నిపుణుల బృందం.. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును పరిశీలించింది.. ఇప్పుడు డిజైన్ మార్పులతో కొత్త డయాఫ్రం వాల్, ప్రధాన డ్యాం నిర్మించాలని కీలక సూచనలు చేసింది.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజిని పూర్తిగా నియంత్రించాలంటే ఎక్కువ ఖర్చవతుంది కాబట్టి.. వాటి జోలికి పోకుండా.. ఆ కాఫర్ డ్యాంలతోనే ముందుకు సాగాలని విదేశీ నిపుణుల కమిటీ సూచించింది.. ఇక, ఈ ఏడాది వర్షాకాలం దాటగానే పనులు ప్రారంభించేందుకు వీలుగా డిజైన్, నిర్మాణ అంశాలు చర్చించేందుకు ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని పేర్కొన్న నిపుణుల కమిటీ.. ఆ వర్క్‌షాప్‌లో ప్రాజెక్టుపై ఒక స్పష్టతకు రావాలని సూచించింది.

# జమ్ము-కశ్మీర్,హర్యానా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్18న తొలిదశ, 25న రెండో దశ, అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు జరుగుతాయి. ఫలితాలు అక్టోబర్ 4న వెలువడతాయి. మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అటు హర్యానలోని 90 నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 1న సింగిల్‌ఫేజ్‌లో పోలింగ్ జరగ నుంది. ఫలితాలు 4న వెలువడతాయి. అక్టోబర్6 వరకూ రాష్ట్రంలో కోడ్ కొనసాగుతుంది. కాగా జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఇదే తొలి అసెంబ్లీ ఎన్నికలు. ఆగస్టు 9న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తన బృందంతో జమ్మూ కాశ్మీర్ లో పర్యటించారు. వీలైనంత త్వరగా ఇక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు కమిషన్ కట్టుబడి ఉందని చెప్పారు. 2024 సెప్టెంబర్ 30లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీలైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, అక్కడ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్నికల సంఘం ప్రకారం.. ఉత్తర కాశ్మీర్ లోని జిల్లాల్లో చాలా సవాళ్లు ఉన్నాయి. ఇక్కడ చాలా ప్రాంతాలు సున్నితమైనవిగా పరిగణించ బడుతున్నాయి. ఉత్తర కాశ్మీర్‌లో అనంత్‌నాగ్, బారాముల్లా, బుద్గాం, బందిపూర్, గందర్‌బల్, కుప్వారా, కుల్గాం, పుల్వామా, షోపియాన్, శ్రీనగర్ జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబడగా, దక్షిణ కాశ్మీర్ లో కథువా, సాంబా, రియాసి, జమ్ము, ఉధంపూర్ వంటి జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబడ్డాయి.జమ్మూ కాశ్మీర్‌లో ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించవచ్చని వర్గాల సమాచారం. జమ్మూ కశ్మీర్‌లో చివరిసారిగా 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది కూడా ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ, పీడీపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

# వెయిటింగ్‌లో ఉన్న ఐపిఎస్‌లు..

(మొదటిపేజీ తరువాయి)

ఐపీఎస్ అధికారులు వరుసగా సెలవులకు దరఖాస్తు చేసుకున్నారు. వెయిటింగ్‌లో ఉన్న 16 మంది ఐపీఎస్ అధికారులు రోజూ ఉదయం 10 గంటలకు డీజీపీ కార్యాలయానికి వెళ్లి హాజరు పట్టీలో సంతకాలు చేయాలి. పనిగంటలు ముగిసేవరకూ కార్యాలయంలోనే ఉండి సంతకం చేశాకే మళ్లీ బయటకు రావాలని ఇటీవల డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమటరావు మెమో జారీ చేశారు. ఈ నేపథ్యంలో వారంతా మూడుమ్మడిగా సెలవు పెట్టారు.

**వెయిటింగ్ లిస్ట్ లో ఉన్న రధికారులు వీరే...**

1. పీఎస్ఆర్ అంజనేయులు 2. పీవీ సునీల్ కుమార్ 3. ఎన్. సంజయ్, 5. జి.పాలరాజు 6, కొల్లి రఘురామ్ రెడ్డి 7. ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, డీఐజీ, 8 సీహెచ్.విజయరావు, డీఐజీ, శ్రీ విశాల్ గున్నీ, డీఎజ 10, రేకేఎన్ అన్బురాబన్, ఎస్పీ, 11. వై. రవిశంకర్‌రెడ్డి 12. వై.రిషాంత్ రెడ్డి, ఎస్పీ, 13.కె. రఘువీరా రెడ్డి, 10. పి.పరమేశ్వర్రెడ్డి 15, పి.బాషువ, 18, కృష్ణకాంత్ పటేల్.

# ఎపికి వాతావరణశాఖ హెచ్చరిక

(మొదటిపేజీ తరువాయి)

విస్తరించి, ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశగా వంగి ఉన్నది. తదుపరి 2 రోజులలో ఇది ఉత్తర వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. గంగ పరివాహక-పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌పై తీవ్ర అల్పపీడన ప్రాంతంగా మారుతుంది. ఆ తర్వాత తదుపరి 3 రోజులలో పశ్చిమ వాయువ్య దిశగా, గంగ పరివాహక-పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, పరిసర ప్రాంతాల మీదుగా పయనించే అవకాశం ఉంది. రుతుపవన ద్రోణి ఇప్పుడు ఫలోడి, బనస్థలి, శివపురి, సిధి, రాంచీ, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మీద ఉన్న అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉన్నది.ఆగ్నేయ అరేబియా సముద్రం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కేరళ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక, పొరుగు ప్రాంతాలపై ఉంది. సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ వరకు విస్తరించి ఎత్తుకు వెళ్ళేకొలది నైరుతి దిశగా వంగి ఉన్నది. కొంకణ్ నుండి ఆగ్నేయ అరేబియా సముద్రం వరకు ఉన్న ద్రోణి, ఇప్పుడు ఉత్తర అంతర్గత కర్ణాటక నుండి కొమోరిన్ ప్రాంతం వరకు దక్షిణ అంతర్భాగ కర్నాటక, పొరుగు ప్రాంతాల మీద ఉన్న ఉపరితల ఆవర్తనం మీదుగా వ్యాపించి, సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది.

# ఎపిలో ఐపీఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

మేరకు ప్రధాన కార్యదర్శిగా నీరభ్ కుమార్ ప్రసాద్ పేరిట శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి.అనంతపురం ఎస్పీగా జగదీష్, విశాఖ ఏపీఎస్పీ కమాండెంట్‌గా మురళికృష్ణ, విజయవాడ డీసీపీగా మహేశ్వరరాజు, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా సునీల్, గుంతకల్ రైల్వే ఎస్పీగా రాహుల్ మీనా, ఇంటెలిజెన్స్ ఎస్పీగా నచికేత్ విశ్వనాథ్, చింతూరు ఏఎస్పీగా పంకజ్‌కుమార్ మీనా, పార్వతీపురం ఎస్‌డీపీవోగా సురానా అంకిత్‌లను బదిలీ చేశారు. అలాగే.. ఐపీఎస్ అధికారి సత్య ఏసుబాబును డీజీపీ ఆఫీస్‌కు బదిలీ చేసింది ప్రభుత్వం.

# వాజ్‌పేయికి ఘన నివాళులు

(మొదటిపేజీ తరువాయి)

స్పీకర్ ఓం బిర్లా వచ్చారు. ఈ సందర్భంగా భారతరత్న వాజ్‌పేయి చిత్రపటానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కేంద్ర మంత్రులు, అధికార నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) భాగస్వామ్యానికి చెందిన నేతలు కూడా వాజ్‌పేయికి నివాళులర్పించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని స్మరించుకుంటూ ప్రధాని మోదీ సోషల్ మీడియా హ్యాండిల్‌లో రాశారు.. తన జీవితమంతా దేశసేవకే అంకితం చేశారు. భారతదేశం గురించి అతని కలను నెరవేర్చడానికి మేము నిరంతరం పని చేస్తూనే ఉంటాము. దీనితో పాటు నివాళి కార్యక్రమానికి సంబంధించిన కొన్ని చిత్రాలను కూడా ప్రధాని పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ప్రార్థనా సమావేశం కూడా ఏర్పాటు చేశారు. 2018లో ఈ రోజున ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో దీర్ఘకాల అనారోగ్యంతో మరణించారు. దేశ నిర్మాణంలో ఆయన చేసిన కృషికి లెక్కలేనంత మంది ప్రజలు ఆయనను గుర్తుంచుకుంటారు.ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. దేశంలో రాజకీయ స్వచ్ఛత, దేశ ప్రయోజనాల పట్ల విధేయత, సిద్ధాం తాల పట్ల దృఢత్వం ప్రశ్న వచ్చినపుడల్లా వాజ్‌పేయిని తప్పకుండా గుర్తుంచుకుంటారని అన్నారు. ఒకవైపు బీజేపీ స్థాపన ద్వారా వాజ్‌పేయి జాతీయ ప్రయోజనాలను ప్రచారం చేశారని, మరోవైపు ప్రధానిగా దేశాన్ని వ్యూహాత్మకంగా, ఆర్థికంగా బలోపేతం చేశారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని అటల్ జీ వర్ధంతి సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కోట్లాది మంది భాజపా కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అభివర్ణిస్తూ, 'నైపుణ్యం కలిగిన ఆర్గనైజర్‌గా ఆయన పనిచేశారు. భావజాలం, సూత్రాల ఆధారంగా, అటల్ జీ జీవితం ఎల్లప్పుడూ జాతికి అంకితం చేయబడింది. ఈ రోజు ఆయన స్మారక దినం, అతనికి అనేక నివాళులు.' అంటూ రాసుకొచ్చారు. వాజ్‌పేయికి నివాళులర్పించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, 'రాజకీయవేత్తగా, డైనమిక్ కవిగా, రచయితగా అటల్ జీ వివిధ రంగాల్లో తన వంతు సహకారం అందించారు.' అని బిర్లా అన్నారు భారతదేశం ఒక భూభాగం కాదని, సజీవ దేశం అని, దేశం, సమాజం కోసం ఆయన చేసిన అంకితభావం మనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పేవారు. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా వాజ్‌పేయిని భారత రాజకీయాలకు 'అజాతశత్రు' అని అభివర్ణించారు. సేవ, సుప రిపాలనకు బలమైన పునాది వేయడంతో పాటు, పోఖ్రాన్ అణు పరీక్ష ద్వారా భారతదేశం అపారమైన సామర్థ్యాన్ని యావత్ ప్రపం చానికి పరిచయం చేశారని తెలిపారు. వాజ్‌పేయికి 2015లో దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న లభించింది. భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో వాజ్‌పేయి ఒకరు. అతను మూడుసార్లు దేశానికి ప్రధానమంత్రి అయ్యాడు, అతని మొదటి పదవీకాలం 1996లో కేవలం 13 రోజులు మాత్ర మే. దీని తర్వాత, అతను 1998లో మళ్లీ ప్రధానమంత్రి అయ్యాడు. 13 నెలల పాటు ఈ పదవిలో ఉన్నారు. 1999 సంవత్స రంలో అతను మూడవసారి దేశానికి ప్రధానమంత్రి అయ్యాడు. ప్రధాన మంత్రిగా తన పదవీకాలాన్ని పూర్తి చేసిన మొదటి కాంగ్రెసేతర నాయకుడు వాజ్‌పేయ్.

# తుంగభద్ర డ్యామ్ గేటు..

**అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లో ఇటీవల కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలిక గేటు అమర్చేం దుకు ఇంజినీరింగ్ నిపుణులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అత్యంత సాహసంతో కూడిన ఈ తాత్కాలిక గేటు ఏర్పాటుపై దేశ వ్యాప్తంగా ఇంజనీరింగ్ నిపు ణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇది సక్సెస్ అయితే.. దేశ ఇంజినీరింగ్ చరిత్రలో అద్భుతఘట్టం ఆవిష్కృతం కాబోతోందని అంటున్నారు. కర్ణాట కలోని తుంగభద్ర డ్యామ్‌లో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలిక గేటు అమర్చేందుకు



ఇంజినీరింగ్ నిపుణుల బృందం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ముందుగా.. 75 టన్నుల బరువు ఉన్న ఈ తాత్కాలిక గేటు ఐదు దశల్లో అమర్చేందుకు ప్లాన్ చేశారు. మొదటి దశలో నాలుగు అడుగుల ఎత్తులో మూడు యూనిట్లను ఒకదానికొకటి అతికించి అమర్చ నున్నారు. జిందాల్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన రెండు క్రేన్ల సాయంతో 60 అడుగుల వెడల్పు.. 20 అడుగుల ఎత్తులో తాత్కాలిక గేటు అమర్చేందుకు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించిన విడివిడి భాగాలను డ్యామ్ దగ్గరకు తీసుకురాగా.. ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు.తాత్కాలిక గేటును అమర్చే క్రమంలో సుమారు 20 అడుగుల నీటిలోకి క్రేన్ ద్వారా నిపు ణులను పంపారు. కానీ.. నీటి ప్రవాహం కారణంగా పరిస్థితులు ప్రతికూ లంగా మారడంతో పనులు నిలిపివేశారు. అయితే.. ఇంజినీరింగ్ బృందం చేస్తున్న ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. తుంగభద్ర డ్యామ్ నుంచి 40 వేల క్యూసెక్కుల వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇబ్బందిగా మారింది. ఇక.. తుంగభద్ర డ్యామ్ నుంచి ఇప్పటికే 70 టీఎంసీల నీరు వృథాగా కిందికి వెళ్తోంది.తుంగభద్ర డ్యామ్ దిగువన ఉన్న సుంకేసుల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులన్నీ ఇప్పటికే నిండిపోవడంతో వందల టీఎంసీల వరద నీరు సముద్రం పాలవుతోంది. దానికి అడ్డుకట్ట వేసే క్రమంలో ఇంజినీరింగ్ నిపుణులు పెద్ద సాహసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి.. తుంగభద్ర డ్యామ్‌లో కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటును అమర్చడం చాలెంజింగ్ విషయం. ఎందుకంటే.. భారీ ప్రవాహంలో గేటును అమర్చడం అంత ఈజీ పని కాదు. ఎంతో బరువు ఉన్న ఇనుప గేటును ఫోర్సుగా వెళుతున్న నీటిలో దింపి.. వాటర్ కెమెరాలు.. ఆక్సిజన్ మాస్కులతో కొంతమంది నిపుణులు నీళ్లలోకి దిగి ఆ గేటును దిమ్మమీద అమర్చాల్సి ఉంటుంది.అందుకే.. తుం గభద్ర డ్యామ్ తాత్కాలిక గేటు అమర్చే పనులపై దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ నిపుణులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తుంగభద్ర డ్యామ్ తాత్కాలిక గేట్లు అమర్చే ప్రక్రియ సక్సెస్ అయితే.. రాబోయే రోజుల్లో భారీ ప్రాజెక్ట్‌ల విషయంలో ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ఎలా ముందుకెళ్లవచ్చు అనేది క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే.. తుంగభద్ర డ్యామ్ గేట్ తాత్కాలిక గేటు అమర్చే పనులు సక్సెస్ కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

# ఎపికి పెట్టుబడులు రావాలి

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ ఏర్పాటు కానుంది.. సీఎం చంద్రబాబు చైర్మన్‌గా, టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కో-చైర్మన్‌గా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయనున్నారు.. పారిశ్రామికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈ టాస్క్ ఫోర్స్ పనిచేయనుంది.. ఇక, అమరావతిలో సీఐఐ భాగస్వామ్యంతో స్టేట్ ఆఫ్ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ సంస్థ ఏర్పాటుకు నిర్ణయం.ఈ సంస్థ ఏర్పాటులో భాగస్వామికానుంది టాటా గ్రూప్. రాష్ట్రంలో పెట్టుబడుల అంశంపై టాటా గ్రూప్ ఛైర్మన్‌తో చర్చలు జరిపారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్- విజన్ 2047 రూపకల్పన అంశాలపై సమావేశంలో చర్చకు వచ్చాయి.. 2047 నాటికి ఏపీని నంబర్ వన్ ప్లేస్‌లో నిలపడమే లక్ష్యంగా చర్చించినట్టుగా తెలుస్తోంది.. ఇక, ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. మేధావులు, పరిశ్రమల ప్రముఖులు సభ్యులుగా స్వర్ణ ఆంధ్రప్రదేశ్ ఏ 2047 ఆర్థికాభివృద్ధి కోసం టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం అన్నారు.. చంద్రశేఖరన్ ఈ టాస్క్‌ఫోర్స్‌కు కో-ఛైర్‌గా ఉంటారని ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను అన్నారు.. ఎయిర్ ఇండియా, విస్తారాతో ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచే అంశంపై చంద్రశేఖరన్ తో చర్చించాం. వివిధ రంగాలలో అనేక ఇతర కంపెనీల భాగస్వామ్యం కల్పించే అంశం పైనా చర్చించామని వెల్లడించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.



# ఇసుక దందాలపై చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆయన స్వయంగా పలువురికి అల్పాహారం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడా రు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదని ప్రచారంలో చెప్పానన్నారు. రెడ్ బుక్ విషయంలో ఊరూరూ వెళ్లి మాట్లాడనని వివరించారు. దీనిపై ప్రజలకు తాను హామీ ఇచ్చానన్నా రు. దానికి కట్టుబడి ఉన్నానని తెలియజేశారు. అందుకే ఎన్నికల్లో ప్రజలు మాకు మంచి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. పనిలోపనిగా గత ప్రభుత్వం చేసిన కొన్ని అంశాలపై యాక్షన్ తప్పదన్నారు. ముఖ్యంగా లిక్కర్, ఇసుక దందాలు కొనసాగాయని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి జోగి రమేష్ కొడుకు వ్యవహారం గురించి కీలక విషయాలు వెల్లడించారు మంత్రి. అగ్రిగోల్డ్ భూమి పత్రాలు తీసుకుని, ఫేక్ పత్రాలు క్రియేట్ చేసి.. ఆయా భూములను సొంతం చేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత వాటిని అమ్మేశాడన్నారు. ఇలాంటి వాటిపై యాక్షన్ తీసుకోకూడదా? అంటూ ప్రశ్నించారు. ఇంకా లిక్కర్, ఇసుక దందాలపై చర్యలు తప్పవంటూ సంకేతాలు ఇచ్చేశారు.ఒక అబద్దాన్ని పదేపదే చెబితే నిజం అవుతుందని జగన్ భావిస్తున్నారని అన్నారు మంత్రి నారా లోకేష్. అందుకే ఫేక్ జగన్ అని పేరు పెట్టామన్నారు. చివరకు అన్న క్యాంటీన్ల నిర్వహణకు వచ్చే విరాళాలపైనా ఆ పార్టీ ఏడుస్తోందని దుయ్యబట్టారు. సైకోల బారి నుంచి పేదలని రక్షించడానికే విరాళాలు సేకరిస్తున్నట్లు తెలియజేశారు. మొత్తానికి జగన్ చేసిన కామెంట్స్‌కు ఫుల్ స్టాప్ పెట్టారు మంత్రి నారా లోకేష్. కాగా మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్.. అందులో ఏముంది? జగన్ ఎందుకు భయపడు తున్నారు? పదేపదే జగన్ ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నారు? ఏదో విధంగా అధికార ప్రభుత్వంపై బురద జల్లడానికేనా? టీడీపీ ఎందుకు సైలెంట్‌గా ఉంటోంది? ఆయా ప్రశ్నలకు సమాధానం బయటకు వచ్చేసింది. వైసీపీ అధినేత జగన్ మీడియా ముందుకొచ్చిన ప్రతీసారీ రెడ్ బుక్ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నా రు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని పదేపదే దుయ్యబడుతున్నారు. ఈ వ్యవహారంపై టీడీపీ నుంచి పెద్దగా కౌంటర్లు లేకపోవడంతో నేరుగా మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగేశారు. ఈ విషయంలో వైసీపీ లేవనెత్తిన ప్రశ్నలకు తనదైనశైలిలో రిప్లై ఇచ్చేశారాయన. శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నులకపేట ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆయన స్వయంగా పలువురికి అల్పాహారం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదని ప్రచారంలో చెప్పానన్నారు. ఏపీలో అన్న క్యాంటీన్లు తిరిగి పున:ప్రారంభమవుతున్నాయి.

# మంకీఫాక్స్ అంటువ్యాధి..

(మొదటిపేజీ తరువాయి)

చేయడంతో హైదరాబాద్ నగరంలో అలర్ట్ ప్రకటించారు. ఆఫ్రికా దేశ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఉన్న నేపథ్యంలో అప్రమత్తత ప్రకటించారు.ఆఫ్రికా దేశంలో ఇప్పటికే 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదయ్యాయి. ఈ మహమ్మారి వల్ల 460 మంది మరణించారు. ఇది అంటువ్యాధి కావడంతో ఆఫ్రికన్ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఎక్కువగా ఉన్నందున డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఆఫ్రికాలో మంకీపాక్స్ వైరస్ కేసులు పెరుగుతుండటంతో ఆఫ్రికన్ యూనియన్ హెల్త్ వాచ్‌డాగ్ ప్రజారోగ్యశాఖ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.ఈ వైరస్ వ్యాప్తి పలు ఆఫ్రికన్ దేశాల్లో, డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వ్యాపిస్తుంది.మంకీపాక్స్‌ను కాంటినెంటల్ సెక్యూరిటీ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటిస్తున్నామని ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అధిపతి జీన్ కసేయా చెప్పారు.-ఆఫ్రికన్ విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి వచ్చి ఉన్నందున, ఈ అంటు వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఉన్నత విద్య అభ్యసించే ఆఫ్రికన్ విద్యార్థులకు హైదరాబాద్ ప్రముఖ గమ్యస్థానంగా ఉంది. డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమ య్యారు. దీంతో ఆఫ్రికన్ విద్యార్థులపై వైద్యులు దృష్టి సారించారు. ఆఫ్రికాలో 2022వ సంవత్సరంలో మంకీఫాక్స్ వ్యాధిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించింది.ఈ వైరస్ మశూచి వంటి లక్షణాలతో కూడిన వైరల్ జూనోటిక్ వ్యాధి అని తేలింది. ఈ వైరస్ మంకీపాక్స్ వైరస్ వల్ల సంభవిస్తుంది.ఈ వ్యాధిని మొదటిసారిగా 1958వ సంవత్సరంలో కోతుల్లో కనుగొన్నారు. మొదటి మానవ కేసు 1970వ సంవత్సరంలో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వెలుగుచూసింది. 2003వ సంవత్సరంలో ఆఫ్రికా వెలుపల మొట్టమొదటి మంకీపాక్స్ వ్యాప్తి అమెరికాలో వెలుగుచూసింది. మంకీఫాక్స్ వైరస్ గాలి ద్వారా సంక్రమించే కోవిడ్‌లా కాదు.ఈ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం, లైంగిక సంపర్కం లేదా గాయాలతో సన్నిహిత సంబంధం ద్వారా మాత్రమే వ్యాధి సోకుతుంది. మంకీఫాక్స్ లక్షణాలు:మంకీఫాక్స్ వైరస్ లక్షణాలు శోషరస గ్రంథుల వాపు, జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, తీవ్ర బలహీనతలుంటాయి. జ్వరం వచ్చిన 1-3 రోజులకు చర్మంపై దద్దుర్లు మొదలవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గురువారం మంకీపాక్స్‌ను అంతర్జాతీయ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో, ప్రజలు ఈ వైరస్ ప్రమాద కారకాలు, ఎక్స్‌పోజర్‌ను తగ్గించే చర్యల గురించి తెలుసుకోవాల్సి ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

## మరిన్ని విజయాలు
# సాధించాలి

(మొదటిపేజీ తరువాయి)

సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం సంతోషదాయకమంటూ శుక్రవారం నాడు డిప్యూటీ సీఎం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈ వాహక నౌక నింగిలోకి దూసుకుపోయి ఈవోఎస్-8 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టిందన్నారు. మన అంతరిక్షరంగ నిపుణులు దేశంకోసం ఎంతగానో తపించి ఉపగ్రహాలను రూపొందించి కక్ష్యలోకి ప్రవేశపెడుతున్నారన్నారు. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వాతలపై ఈ ఉపగ్రహం పర్యవేక్షించడం సమాజానికి ఎంతో ప్రయోగజనకరమన్నారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. అంతరిక్షం రంగంలో దేశానికి గర్వకారణమయ్యే విషయాలతో మన కీర్తిని ఎప్పటికప్పుడు ఇనుమడింపచేస్తున్నారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## నేడు తంటికొండ వెంకన్నకు
# శాంతి కళ్యాణం

**హాజరు కానున్న**

**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు**

**లక్ష్మీదేవి నవీన్ దంపతుల**

**చేతుల మీదుగా శాంతి కళ్యాణం**



**గోకవరం, ఆగస్టు 15 (ఆంధ్రపత్రిక) :** గోకవరం మండలం తంటికొండ గ్రామంలో వెలిసిన స్వయంభు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధినిలో శ్రావణమాసం శని వారం శ్రీ స్వామివారి శాంతి కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10. 30 నిమిషాలకు శాంతి కళ్యాణం జరుగుతుంది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆయన సతీమణి మణిమ్మ, తనయుడు కాకినాడ జిల్లా అధ్యక్షులు మాజీ జడ్పీ చైర్మన్ నవీన్ కుమార్ లక్ష్మీదేవి దంపతులచే శాంతి కళ్యాణం నిర్వహించను న్నారు. లక్ష్మీదేవి నవీన్ దంపతులు పీటలపై కూర్చొని కళ్యాణం జరిపించనున్నారు. శ్రావణ మాసం శనివారం కావడంతో ఎంతో విశిష్టతను సంతరించుకుంది. ఈకార్యక్రమం అంగరంగ వైభవంగా జరగనున్నదని భక్తులు కనులారా తిలకించి స్వామివారి కటాక్షం పొందాలని తంటికొండ దేవస్థాన మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర తెలిపారు.

## ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం
# విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కాగా.. 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. పర్యావరణం, ప్రకృతి విపత్తులను పర్యవేక్షణ టార్గెట్ గా సైంటిస్టులు ఈ మిషన్ ను ప్రవేశపెట్టారు.ఈ ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ బరువు 119 టన్నులు, ఎత్తు 34 మీటర్లు, వెడల్పు 2 మీటర్లుగా ఉన్నాయి. భూ ఉపరితలం నుంచి 475 కిలోమీటర్ల ఎత్తున శాటిలైట్‌ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా డిజైన్ చేశారు. ఈవోఎస్-08 శాటిలైట్ బరువు 175.5 కిలోలు. ఇక ఈ శాటిలైట్‌లో మూడు పే లోడ్స్‌ని ఇస్రో శాస్త్రవేత్తలు అమర్చారు. అవి ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ , పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లు.. ఇవి భూమికి సంబంధించిన చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. అలాగే ఇవి తీసిన పిక్స్ ని పరిశీలించి వాతావరణం పరిస్థితులు, విపత్తులపై అధ్యయనం నిర్వహిస్తారు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు సేవలను అందజేయనుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో తెలిపింది. అంతేకాదు, ప్రాజెక్ట్‌కు అవకాశాలను తీసుకొస్తుందని, సరికొత్త మిషన్లకు శ్రీకారం చుడుతుందని ఇస్రో చెబుతోది. పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఎక్కు సమయం, ఖర్చు కూడా అధికమే. కానీ, ఎస్ఎస్ఎల్వీ చాలా ప్రత్యేకమైనది.

## ఆ ఉద్యోగులకు ఏడాదిపాటు
# ఉచిత వసతి..

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో పనిచేస్తున్న వారికి 2024 జూన్ 27 నుంచి వచ్చే ఏడాది జూన్ 26 వరకు ఉచిత వసతి వర్తిస్తుందని సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

## దాతలు ముందుకొస్తే మండలాల వారీగా

# అన్న క్యాంటీన్లు

### చిలకలూరిపేటలో మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభించిన ప్రత్తిపాటి







**చిలకలూరిపేట ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** పేదల ఆకలి తీర్చాలన్న ప్రభుత్వ మహత్ సంకల్పానికి తమవంతు సహాయానికి దాతలు కూడా ముందుకు వస్తే మండలాలవారీగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలిపారు మాజీమంత్రి, చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. ఆర్థికంగా స్థిరపడిన వారు అన్న క్యాంటీన్లకు ఒకరోజు వారి పేరుమీద పుట్టినరోజులు కావచ్చు, జ్ఞాపకార్థం కావచ్చు, కుటుంబాల్లో జరిగే వివిధ కార్యక్రమాలు కావచ్చు.. అలాంటి వారంతా ఒకరోజు అన్న క్యాంటీన్‌కు ఎంత ఖర్చు అవుతుందో అంత మొత్తం ఇస్తే వారి పేరుపై ఆహారం పంపిణీ చేస్తామన్నారు. చిలకలూరిపేటలో శుక్రవారం 3 క్యాంటీన్లను ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌టీ సెంటర్, అడ్డరోడ్ సెంటర్, గడియార స్తంభం సెంటర్‌లో అన్న క్యాంటీన్లను ప్రారంభించిన తర్వాత ప్రజలకు ఆహార పదార్థాలు వడ్డించారు. అక్కడే క్యాంటీన్‌లో అధికారులు, నాయకులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన పేదల కడుపునింపేందుకు అన్న క్యాంటీన్లు ఎంతో దోహదపడతాయన్నారు. మరీ ముఖ్యంగా ఉదయాన్నే లేచి పనులకు వెళ్లేవారికి అన్నక్యాంటీన్లు అక్షయపాత్రగా ఉంటాయని తెలిపారు. ఇదే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్లలో రూ.5కే అల్పాహారం అందించడం జరుగుతుందని, ఇడ్లీ, పూరి, పొంగలి, దోశ తిని పనులకు వెళ్లొచ్చని, మళ్లీ మధ్యాహ్నానికి భోజనం అందిస్తారన్నారు. ఎక్కువ సమయం పనిచేసే వారు మళ్లీ రాత్రి భోజనానికి కూడా రావచ్చన్నారు. రూ.300, రూ.400, రూ.500 సంపాదించుకుంటే అందులో 15 రూపాయలతో మూడు పూటలా కడుపునింపుకునే పథకమే ఈ అన్న క్యాంటీన్ల అని అన్నారు. ఒక్కో మనిషికి ఆహారం సరఫరా చేయడానికి రూ.90 నుంచి రూ.100 ఖర్చవుతుందని, రూ.75 నుంచి రూ.85 వరకు దాతల సహకారం గానీ ప్రభుత్వం గానీ భరిస్తుందన్నారు. ఈ సదుపాయం పేదలకు ఆర్థికంగా ఎదిగేందుకు కూడా దోహద పడుతుందని అభిప్రాయపడ్డారాయన. దీంట్లో మిగిలే సేవింగ్స్‌తో పిల్లల చదువులకో, ఇల్లు కట్టుకోవడానికో, ఆ కుటుంబం అభివృద్ధి చెందేందుకు ఉపయపడే ఉందన్నారు. గత పాలకులు అన్న క్యాంటీన్లను కేవలం రాజకీయ కక్షతో ఎన్టీఆర్ పేరు ఉందనో, చంద్రబాబుకు పేరు వస్తుందనో ఐదేళ్లు మూసేసి పేదవాడి కడుపు కొట్టారని మండిపడ్డారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రావడంతో తిరిగి పునఃప్రారంభించడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు అన్న క్యాంటీన్లకు దాతలు సాయం చేస్తే అది పేదవాడికి సాయం చేసినట్లు అవుతుందని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారని, మచ్చలేని ఐఏఎస్, ఐపీఎస్‌లపై మచ్చ వేసి తలదించుకునే పని చేశారని, వారంతా సిగ్గుపడుతున్నారని అన్నారు. భవిష్యత్తులో అలా జరగకుండా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఒక నిర్ణయం తీసుకొని అమలు చేసేవిధంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్‌లు పనిచేయాలని, ఇలాంటి వారు దేశం మొత్తం మీద వేలల్లోనే ఉంటారని, వారు ఎక్కడైతే అవినీతికి పాల్పడిన, వ్యవస్థలను సరిదిద్దకపోయినా, చట్టాన్ని గౌరవించకపోయినా దేశంలో చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ఏ ఉన్నతాధికారి కూడా తప్పు చేయకుండా చట్టబద్ధంగా ఉంటే ప్రజాస్వామ్యాన్ని గౌరవించినట్లు ఉంటుందని, ప్రజలకూ వారిపై గౌరవం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కొంతకాలంగా జరుగుతున్న అరెస్టు లపైనా స్పందించిన ప్రత్తిపాటి తప్పు చేశారు కాబట్టే అరెస్టు చేశారని, తప్పు చేయనటువంటి వారిని గత వైసీపీ ప్రభుత్వం లాగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అరెస్టు చేయదని అన్నారు.

## స్వచ్ఛ సంకల్పంలో చిలకలూరిపేటను

# ముందు నిలపాలి

### చెత్త సేకరణ కోసం చెత్తబుట్టలు, వాహనాలు పంపిణీ చేసిన ప్రత్తిపాటి







**చిలకలూరిపేట, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న స్వచ్ఛ సంకల్పంలో తమ నియోజకవర్గం, చిలకలూరిపేట పట్టణాన్ని ముందు వరసలో నిలపాలని అధికా రులకు స్పష్టం చేశారు మాజీమంత్రి, తెలుగు దేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. మరీ ముఖ్యంగా చిలకలూరిపేట పట్టణంలో తాగునీటికి లోటు రావొద్దని, చెత్తకుప్పలు కనిపించడానికి వీల్లేదని, వీధి దీపాలు వెలగకుండా ఉండకూడదని యంత్రాంగానికి లక్ష్యం నిర్దేశించారు. దోమల బెడద లేకుండా చూడటం తమ నాలుగో ప్రాధాన్యత అని, అందుకు అనుగుణంగా నాణ్యమైన రసాయనాలు వినియోగించి ఫాగింగ్ చేయాలన్నారు. శుక్రవారం స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చిలకలూరిపేట మున్సిపాలిటీ లో ఇంటింటికీ చెత్త సేకరణ కోసం చెత్తబుట్టలు, వాహనాలను ప్రత్తిపాటి పుల్లారావు పంపిణీ చేశారు. స్థానిక పండరీపురం 9వ లైన్ మంచినీటి ట్యాంకుల వద్ద పారిశుద్ధ్య సిబ్బందికి చెత్తబుట్టలు, వాహనాలను అందజేశారు. నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఉన్న చెత్తబుట్టలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని, ప్రతీ ఇంటి వద్ద తడి, పొడి చెత్త బుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగానే ఇళ్ల నుంచి, బజార్లలో ఊడ్చి ఒకచోటకు చేర్చే చెత్తను రోజూ సక్రమంగా తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. 25 తోపుడుబళ్లు, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు 450 చెత్తబుట్టలను పంపిణీ చేశామ న్నారు. పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడానికి, ప్రజలకు అసౌకర్యంగా ఉండకుండా వారంతా బయటకు వచ్చే లోపల మొత్తం పరిశుభ్రంగా ఉండాలని చెప్పామన్నారు. ఎక్కడా కూడా వ్యర్థాల డంప్ ఉండటానికి వీల్లేదని, ప్రజలకు అసౌకర్యంగా ఉండటానికి కూడా వీల్లేదన్నారు. ఎక్కబడితే అక్కడ చెత్తను పడవేస్తేఅక్కడే ఈగలు, దోమలు, ఇతర కీటకాలు ముసిరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి వల్ల అంటు వ్యాధులు, అనారోగ్యం, జ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంద న్నారు. గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, అందుకని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో పట్టణాల్లో నివసించే ప్రజలకు అన్ని రకాలుగా సౌకర్యవంతంగా వీలైనంత వరకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారని, ఆ కార్యక్రమలో భాగంగానే ఈ చెత్తబుట్టలు, వాహనాలను పంపిణీ చేశామన్నారు. ఇంకా ఎక్కడైనా కొరత ఉంటే అక్కడ కూడా సరఫరా చేస్తామన్నారు. అన్నింటికి మించి పట్టణంలో కుక్కలతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారని, వెటర్నరీ శాఖతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించామని, కుక్కలకు పిల్లలు పుట్టకుడా ఆపరేషన్లు సహా వాటినెలా నియంత్రించాలనే దానిపై ఒక ప్రత్యేక డ్రైవ్ చేస్తామన్నారు. త్వరలోనే చిలకలూరిపేటలో కుక్కల బెడద కూడా లేకుండా చేస్తామన్నారు.

## సికింద్రాబాద్ ప్యాసింజర్‌కు

# హాల్టు కల్పించాలి



**పెదకూరపాడు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** రేపల్లె నుండి సికింద్రాబాద్ వెళ్లే ప్యాసింజర్ రైలుకు పెదకూరపాడులో హల్ట్ కల్పించాలని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. శుక్రవారం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కన్నెగండ్ల, బుచ్చియ్యపాలెం, పెదకూరపాడులో ఉద్యమంలా సంతకాల కార్యక్రమం నిర్వహించారు. దీనికి సామాన్య ప్రజల నుండి వ్యాపారులు దాకా, కార్మికుల నుండి కర్షకులు దాకా, ప్రైవేటు ఉద్యోగుల నుండి ప్రభుత్వ ఉద్యోగుల దాకా పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె -సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు పెదకూరపాడు లో గతంలో హాల్టు ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ రైలు పెదకూరపాడులో హల్ట్ ఎత్తివేశారు. రైల్వే రికార్డులు ప్రకారం పెదకూరపాడు రైల్వే స్టేషన్ నుండి సికింద్రాబాద్ కు రోజుకు సగటున 125 మంది ప్రయాణించినట్లు తెలుస్తుంది. మరలా ఆ ట్రైన్ కి హాల్టు కల్పించాలని,పల్నాడు ఎక్స్ప్రెస్ ను కూడా నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ అక్బర్, కోరంపల్లి గురు ప్రసాదు, కాసరబాద కోటేశ్వరావు, కోరంపల్లి నరసింహారావు, క్రాపా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు పొందిన మున్సిపల్ ఏఈ మరియదాసు



**అద్దంకి, ఆగస్టు 16(ఆంధ్రపత్రిక):** బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన 78వ పంద్రాగస్టు వేడుకలలో అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగములో ఏఈగా పనిచేస్తున్న మరియదాసు కు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలెక్టర్ వెంకట మురళి ఎంపీ కృష్ణ ప్రసాద్ చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని పొందినారు ఈ సందర్భంగా మరియదాసు మాట్లాడుతూ మనకి స్వాతంత్రం వచ్చిన రోజున ఉత్తమ సేవా పురస్కారాన్ని పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు ఇంకా ప్రజలకు నిబద్ధతతోటి నిస్వార్థంగా సేవలను కొనసాగిస్తానని తెలియజేశారు ఉత్తమ అవార్డు పొందిన ఏఈ మరియదాసుకు మున్సిపల్ అధికారులు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు .

## ఉత్తమ సేవా పురస్కారం పొందిన సిఐ పి కృష్ణయ్య



**అద్దంకి ఆగస్టు16( ఆంధ్రపత్రిక):** 78వ పంద్రాగస్టు వేడుకలలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలెక్టర్ వెంకట మురళి ఎంపీ కృష్ణ ప్రసాద్ ఎస్పీ తుషార్ డుడి చేతల మీదగా ఉత్తమ ప్రశంసాపత్రాన్ని పొందిన అద్దంకి పట్టణ సిఐ పి కృష్ణయ్య ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ అవార్డు రావడం నాకు చాలా ఆనందంగా ఉందన్నారు.
నిజాయితీగా నిస్వార్థంగా పేద ప్రజల కేసుల విషయాలలో పని చేస్తానని పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా సిఐ పి కృష్ణయ్యకి పోలీస్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## షిఫా స్పెషాలిటీ నూతన హాస్పిటల్‌ను ప్రారంభించిన

# విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అద్దంకి, ఆగస్టు 16(ఆంధ్రపత్రిక):** శుక్రవారం పట్టణంలోని గీతా మందిర్ రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన షిఫా స్పెషాలిటీ హాస్పటల్ ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయకుమార్ ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించేందుకు హాస్పటల్ ను ఏర్పాటు చేయటం చాలా అభినందనీయం అన్నారు ప్రసూతి వైద్యం ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు సాధారణ కాన్పులు అయ్యేందుకు కృషి చేయాలని పురిటి బిడ్డలకు వచ్చే పసికర్లను తదితర వ్యాధుల కోసం వచ్చే ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలన్నారు డాక్టర్ కె.పి జైనబా ఎంబిబిఎస్ మాట్లాడుతూ పట్టణంలో ని అభ్యుదయ నగర్ లో కోవిడ్ కి ముందు షిఫా నర్సింగ్ హోమ్ ను గత 10 సంవత్సరాలు నడిపేమని అన్నారు ఆ తర్వాత స్పెషలైజేషన్ కోర్స్ కొరకు కలకత్తా వెళ్లడం జరిగిందని కావున అద్దంకి వాసులకు సుపరిచితమే అన్నారు ప్రసూతి విభాగంలో స్త్రీలకు గర్భకోశ క్యాన్సర్లకు సాధారణ కాన్పులు చేయుటకు పసిబిడ్డలకు వచ్చే పసికర్లకు తక్కువ ఖర్చుతోటే వైద్య పరికరాలతో మెరుగైన వైద్యాన్ని అందిస్తానన్నారు సెప్టెంబరు ఒకటో తేదీ నుండి హాస్పటల్ నందు అన్నీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ డాక్టర్లు పట్టణ ప్రముఖులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

## విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అద్దంకి, ఆగస్టు 16(ఆంధ్రపత్రిక):** శుక్రవారం పట్టణంలో ఎన్ఎస్ పి కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీలను ఏర్పాటు చేశామన్నారు పేదలకు ఐదు రూపాయలకే నాణ్యమైన ఆహారం అందిస్తామన్నారు రాష్ట్రంలో పేదల ఆకలి తీరే మంచి రోజులు మళ్లీ వచ్చాయని ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం కక్ష పూరితంగా మూసివేసిందన్నారు 2024 సాధారణ ఎన్నికల్లో హామీ మేరకు కూటమి ప్రభుత్వం పూన: ప్రారంభించింది అన్నారు గ్రామీణ ప్రాంతాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి రోగుల సంరక్షణ కోసం ఇక్కడే ఉండే వారికి రోజువారి కార్మికులకు ఒక వరంగా ఉంటుందని పేద బడుగు బలహీన వర్గాల వారి ఆకలి కష్టాలు తీర్చేందుకే అత్యంత ప్రతిష్టాత్మకంగా అన్నా క్యాంటీలను పునరుద్దించామన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం సత్యనారాయణ మున్సిపల్ అధికారులు వార్డు కౌన్సిలర్లు మెప్మా అధికారులు టిడిపి బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు నాగినేని రామకృష్ణ కాకాని అశోక్ కోనేటి అనిల్ శ్రీనివాస రెడ్డి కోంద్రు వీరాంజనేయులు లహరి గోగులమూడి రాజశేఖర్ అంకం నాగరాజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర ఈసీ కమిటీ సభ్యులు

# ఆవుల రోజ చంద్రకుమార్



**చిలకలూరిపేట ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** ది వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక కొరకు14-08-2024 బుధవారం తిరుపతి పట్టణం లో రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024-2026 సంవత్సరాలకు సంబంధించిన కొత్త కార్యవర్గాన్ని సభ్యులు ఆమోదంతో ఏకగ్రివంగా ఎన్నుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఈసీ కమిటీ సభ్యులు గా చిలకలూరిపేట అసోసియేషన్ లో కోశాధికారిగా విధులు నిర్వహిస్తున్నటువంటి ఆవుల రోజ చంద్ర కుమార్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సంధర్భంగా చిలకలూరిపేట లైసెన్సడ్ ఇంజనీర్స్ అండ్ సర్వేయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డేవిడ్ కృపాదానం, వైస్ ప్రెసిడెంట్ శ్యాం ప్రసాద్, సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ ఫిరోజ్, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ రామారావు, క్రమశిక్షణ కమిటీ ప్రెసిడెంట్ జబ్బర్, సాయినాగ్ తదితర సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## జె. పంగులూరు ఎస్ఐగా వినోద్ కుమార్



**జె.పంగులూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** జె పంగులూరు మండల ఎస్ఐ గా బక్కిన వినోద్ కుమార్ శుక్రవారం విధు ల్లోకి చేరినారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభు త్వం నిబంధన ప్రకారం పని చేస్తా యని, గ్రామాలలో ఎలాం టి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, పేకాట, అక్రమ మద్యం దొంగతనాలు సమా చారము పోలీసులకు అందజేయాలని మండల ప్రజలను కోరారు. పోలీసు వారి అనుమతి లేకుండా గ్రామాలలో ఊరేగింపులు ర్యాలీలో జరుపకూడదని తెలియజేశారు. నిబంధన ప్రకారము ఊరేగింపులు ర్యాలీలు జరు పు కోవాలంటే తప్పనిసరిగా పోలీసు వారు అనుమతి పొందా లని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో చిత్తశుద్ధితో పనిచే స్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వినోద్ కుమార్ కు పోలీసులు స్వాగతం పలికి పుష్పగుచ్చం అందజేశారు

## ఉత్తమ కమిషనర్‌గా ఎం సత్యనారాయణ



**అద్దంకి ,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలెక్టర్ వెంకట మురళి ఎంపీ కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని పొందిన అద్దంకి మున్సిపల్ కమిషనర్ ఎం సత్యనా రాయణ ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉత్తమ అవార్డు పొందినందుకు ఆనందంగా ఉందన్నారు. మరింత ఉత్సాహంతో పేద ప్రజలకు సేవలను అందిస్తానని ముఖ్యంగా పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు ఉత్తమ అవార్డు పొందిన కమిషనర్‌కి మున్సిపల్ అధికారులు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి సవిత

## -స్వయంగా ఆర్టీసీ బస్సును నడిపిన నందమూరి బాలకృష్ణ



**హిందూపురం, ఆగష్టు 16 ( ఆంధ్రపత్రిక ):** హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ లో మూడు నూతన ఆర్టీసీ ఎక్స్ప్రెస్ తిరుపతి, కర్నూలు బస్సులను ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఎమ్మెల్యే నందమూరి బాల కృష్ణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంక్షేమ శాఖ టెక్స్టైల్స్ మంత్రి సవితమ్మ హాజరయ్యారు. రూ.1 కోటి 20 లక్షల రూపాయలతో కర్నూల్ కి రెండు, తిరుపతికి ప్రతిరోజు వెళ్ళను న్నాయి. అనంతరం ఆర్టీసీ బస్సులోకి వెళ్లిన బాలకృష్ణ తానే సొంతంగా తిరుపతి బస్సు డ్రైవింగ్ చేసి అక్కడున్న వారిని ఉత్సాహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే బాలయ్య మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభం లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే హిందూపురం అభివృద్ధికి సీఎం రూ.90 కోట్లు మంజూరు చేశారన్నారు. దీంతో పాటు జిల్లాకు సత్యసాయి పేరు అలాగే ఉంచి జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని ఏర్పాటు చేయా ల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ టిఎన్ చేతన్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేంద్రనాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు డిఈ రమేష్, రాఘవేంద్ర, సతీష్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు నాగరాజ్, మంగేష్, శంకర్ రెడ్డి,మురళితో పాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# స్వాతంత్ర ఉద్యమంలో అక్షర ఆస్త్రాలను అందించిన ఏకైక దినపత్రిక ఆంధ్రపత్రిక

## బ్యాంకు మేనేజర్ వెంకటరమణ,స్టేట్ కో-ఆపరేటివ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ - ఖాజా హుస్సేన్



**నందికొట్కూరు,ఆగష్టు 16 ( ఆంధ్రపత్రిక ):** దేశ స్వాతంత్ర ఉద్యమంలో అక్షర ఆస్త్రాలను అందించి, దేశభక్తి కలిగిన ఏకైక దినపత్రిక,ఆంధ్రపత్రిక,అని, స్టేట్ కోఆపరేటివ్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఖ జా హుస్సేన్, నందికొట్కూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్, వెంకటరమణ అన్నారు, శు క్రవారం, ఆంధ్ర పత్రిక వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ను నందికొట్కూరులో, వారు విడుదల చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, 110 సంవత్సరాలు పూర్తి చేసుకుని 111వ సంవత్సరంలోకి వెళుతున్న ఆంధ్ర పత్రికకు, ప్రజల నుండి విశేష ఆదరణ ఉందన్నారు, ప్రజలకు ప్రభు త్వానికి వారధిగా ఉంటూ, నిత్యం సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తు, ఇలాంటివి ఎన్నో వసంతాలు జరుపు కోవాలని, ఆంధ్ర పత్రిక యాజమా న్యానికి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, సూపర్వైజర్ చక్రపాణి రెడ్డి, స్టేట్ కోఆపరేటివ్ అసోసియేషన్ మెంబర్ అశోక్ కుమార్, నందికొట్కూరు సహకార సంఘం సీఈవో, బ్రాంచ్ డెలిగేట్ రబ్బాని,పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో భూ అక్రమాలు కోకొల్లలు

## -తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం నాయకులు ఆరోపణలు



**శ్రీకాళహస్తి ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** గడచిన అయిదేళ్ళ వైసిపి పాలనలో జరిగినంత భూ దోపిడీ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంతకు ముందెన్నడూ జరగలేదని, ప్రత్యేకించి శ్రీకాళ హస్తిలో భూ అక్రమాలు కోకొల్లలుగా జరిగాయని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర నాయకులు శుక్రవారం ఆరోపించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గల వేలాది ఎకరాల అసైన్డ్ భూములను అనుభవిస్తున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద,మధ్యతరగతి రైతు కుటుంబాలను తన అధికార బలంతో బెదిరించి సొంతం చేసుకున్న వైసిపి కీలక నేతల అక్రమాలను బయట పెట్టడానికి లోతైన విచారణ చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గల తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు పంచాయతీ, తంగేళ్ళపాలెం, రామచంద్రాపురం, బోనుపల్లి, చిట్టత్తూరు, కంచనపల్లి, నెల్లిమాను కండ్రిగ, కాసరం, కనపర్తి తదితర గ్రామాలలో ఫ్రీహోల్డ్ అయిన అసైన్డ్ భూములను బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైసిపికి చెందిన బడా నేతల అక్రమాల బండారం బయట పెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు.అలాగే, శ్రీకాళహస్తి గ్రామీణ మండలానికి చెందిన వేల ఎకరాల అసైన్డ్ భూములను దోచుకున్న దొంగల ముఠాను పట్టుకోవడమే కాకుండా, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనుభవ పత్రాలను మంజూరు చేయడంలో, నకిలీ పట్టాలు సృష్టించడంలో, ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఏమీ తెలియదన్నట్లు వ్యవహరించిన విఆర్వో, ఆర్ఐ, సర్వేయర్, తహశీల్దార్లను వెంటనే సస్పెండ్ చేసి, క్రిమినల్ చర్యలు తీసుకునే విధంగా చూడాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు చింతగింజల సునీల్, శివ, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా, సులేమాన్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ కులస్తులకు భవన స్థలం కేటాయించి నిర్మాణానికి సహకారం అందిస్తాం

## రాజకీయ పదవులలో అవకాశం కల్పిస్తాం

### శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక ):** ముదిరాజ్ కులస్తులకు భవన స్థలం కేటాయించి నిర్మాణానికి సహకారం అందిస్తా మని,రాజకీయ పదవులలో అవకాశం కల్పిస్తామని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని మహేష్ కళ్యాణ్ సదన్ లో 'ముదిరాజ్ అభినందన సభ శు క్రవారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని 2023- 24 విద్యా సంవత్సరంలో 500 కు పైగా మార్కులు సాధించిన సుమా రు 100 మంది ముదిరాజ్ విద్యార్థినీ, విద్యార్థులను ఘనంగా సన్మానించి మోమెంటోల తో పాటు 1,116 ఆర్థిక ప్రోత్సాహకాలు ముదిరాజ్ సంఘం తరఫున శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను విజయం సాధించడంలో ముదిరాజులు అందించిన సహకారం ఎన్నటికీ మర్చిపోలేను అన్నారు.

ముదిరాజులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ముదిరాజుల భవన నిర్మాణం కోసం రానున్న రోజుల్లో స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి సహకారాన్ని అందిస్తామని రాజకీయపరంగా మంచి అవకాశాలు ఇస్తామని విద్యావంతులైన యువకులకు చుట్టుపక్కన పరిశ్రమల్లో ఉత్తీర్ణతకు తగినట్టు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఈ సందర్భంగా ఆయన ముదిరాజ్ కులస్తులకు హామీ ఇచ్చారు .

రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి కోలా ఆనంద్ మాట్లాడుతూ ముదిరాజులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ముదిరాజుల అభి వృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు

ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ అధ్యక్షు లు వైవి రమణయ్య, యువత అధ్యక్షులు ఆకుల గురుమూర్తి, పట్టణ అధ్యక్షులు కోనేటి అయ్యప్ప ,సంఘ గౌరవ అధ్యక్షులు పిల్లారి బత్తినయ్య, చిట్టేటి చిన్నా, పి సుధాకర్ ,జి




రాజేంద్ర ,ఎస్ అంకయ్య, పి తిరుపాల్, కే నాగరాజు, గౌరవ సలహాదారులు తోటకూర కోటేశ్వరరావు, పి అశ్వద్ధామ, బోనపల్లి రాజేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి ఏ వెంకటేశ్వర్లు, కోశాధికారి బొజ్జ గోవిందస్వామి, మహిళా అధ్యక్షురాలు పిల్లారి అమరావతి ,కోనేటి నాగలక్ష్మి, యూత్ అధ్యక్షురాలు ఆకుల సునీత అమ్ము లు, ప్రచార కార్యదర్శి ఆర్ సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి జి రాజా, ఎస్ సతీష్ ,సురేంద్ర జి, కోటి దేసయ్య ,ఎస్వీ యూనివర్సిటీ ఎక్స్ చాన్సర్ టిఎన్పియుసి పార్లమెంటు అధ్యక్షులు జయరాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### పల్నాడు జిల్లా,వినుకొండ నియోజకవర్గం వివాహ కార్యక్రమంలో జనసేన నాయకుడు నిశంకర్ శ్రీనివాసరావు



**వినుకొండ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** నూజెండ్ల మండలం తెల్ల బాడు గ్రామం లో రావుల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి , సెంట్రల్ ఆంధ్ర కో - కన్వీనర్ నిశ్శంకరావు శ్రీనివాస రావు, పట్టణ, మండల మరి యు స్థానిక మండలం మరి గ్రామ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాల రావమ్మ అమ్మవారి గ్రామోత్సవం





**ఆగిరిపల్లి ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి గ్రామంలో వెలసి యున్న శ్రీశ్రీశ్రీ దుగ్గిరాల బాల రావమ్మ తల్లికి శ్రావణమాస రెండవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పంచామృత ఫల అభిషేకము, విశేష అలంకరణ, కుంకుమ పూజ, అర్చన అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ముక్కు లు తీర్చుకొని, పాలు పొంగళ్ళు నిర్వహించుకున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవమునకు ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.

# తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి

## పోస్టల్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర




**నందికొట్కూరు,ఆగష్టు 16 ( ఆంధ్రపత్రిక ):** కేంద్ర ప్రభుత్వం తపాల శాఖ (పోస్టల్) ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర కోరారు. ప్రవేట్ సంస్థ ల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని,, తపాలా శాఖలో పొదుపు మీ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చు అనిఅన్నారు, పట్టణంలో శుక్రవారం కళాజాత బృందం అట పాటలతో తపాలా శాఖలో అందిస్తున్న సేవలపై, ప్రజలకు అవగాహన కల్పించారు. పోస్టల్ సేవింగ్ ఖాతాలు, డిపాజిట్స్, సుకన్య సమృద్ధి యోజన, జన సురక్ష స్కీం, బీమా స్కీములు, యాక్సిడెంట్ బీమా (టాటా ఏఐజీ), గ్రామీణ తపాల బీమా, పీఎం జేజేవై, ఎంఎస్బీఐ సేవలపై అవగా హన కల్పించారు.ఈకార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు, నందికొట్కూరు హెడ్ పోస్ట్ మాస్టరు ఖ జా మొహిద్దిన్, బజారు శాఖ పోస్ట్మాస్టర్, సాయి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ గౌతుల లచ్చన్న గౌడ్ జయంతి వేడుకలు



**శ్రీకాళహస్తి ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** శ్రీ బాలాజీ తిరుపతి జిల్లా గౌడ్ సంక్షేమసంఘం ఆధ్వర్యంలోరాయలసీమలో నే మొట్టమొదటి సారిగా శ్రీకాళహస్తి పట్టణంలో బీ సీ, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి, సర్దార్ గౌతుల లచ్చన్న గౌడ్ విగ్రహం స్వర్ణముఖి తీరానా ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ విగ్రహం వద్ద జయంతి వేడుకలు లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకి శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విచ్చేసి గౌడ్ లచ్చన్న విగ్రహం కి పూలమాలలతోసత్కరించారు. అనంతరం మధ్యాహ్నం పేదలకు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీకాళహస్తి పట్టణమునందు జరగిన ఈ కార్యక్రమానికి గౌడ సోదర ,సోదరీమణులు బీ,సీ సోదరలు, బడుగు ,బలహీన వర్గాలు, ఈ కార్యక్రమములో ఘనంగా పాల్గొన్నారు.

# జగ్గయ్యపేట ఫైర్ స్టేషన్‌ను సందర్శించిన అదనపు డైరెక్టర్



**జగ్గయ్యపేట,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** జగ్గయ్యపేట అగ్నిమాపక కేంద్రాన్ని జి . శ్రీనివా సులు , అదనపు డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ వారు సందర్శించారు. అగ్నిమాపక కేంద్రం పరి సరాలు, సిబ్బంది,వాటర్ టెండర్ , పరికరాలు అన్నింటిని తనిఖీ చేయడమైనది. మరియు కేంద్ర పరిధిలో గల వరద ముంపు ప్రాంతాల గురించి ఆరా తీశారు. వరదల సమయంలో తీసుకోవల సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్య క్రమములో జగ్గయ్యపేట అగ్నిమాపక కేంద్రం అధికారి కె. శ్రీనివా సరావు మరియు సిబందీ అదనపు డైరెక్టర్ వారికి గౌరవ వందనం ఇచ్చారు.

# దేవస్థానమునకు మైక్ సెట్ బహూకరణ, అమ్మవారిని పల్లకి సేవ





**ఆగిరిపల్లి ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ దుగ్గిరాల బాలరవమ్మ అమ్మవారి దేవస్థానమునకు పెదపాడు పుడి మండలం విజరం పాడు గ్రామ స్తులు మేడి బోయిన దుర్గారావు మరియు వారి కుటుంబ సభ్యులు కలసి సుమారు 25 వేల రూపా యల విలువ చేసే మైక్ సెట్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యదర్శి డి సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దుర్గారావును స్ఫూర్తిగా తీసుకొని దేవస్థాన అభివృద్ధికి కృషి చేయవల సిందిగా కోరారు. ఈరోజు శ్రావణ శుక్రవారం అవటంతో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమ ములు నిర్వహించి, పల్లకి సేవ , అనంతరం తీర్థప్రసాద వినియోగం, అన్న ప్రసాదం వితరణ జరిగిం దని , మంత్రి సారథి హామీ మేరకు అమ్మవారి గుడి వద్ద భక్తుల సౌకర్యార్థం, 40 లక్షల రూపాయలతో కళ్యాణ మండపమును నిర్మించుటకు స్థల అన్వేషణ జరిగిందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ శివరాం ప్రసాద్, దాసరి మోహన్ రావు, కొసరాజు కిషోర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమములు అన్నియు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సురేష్ బాబు పర్యవేక్షణలో జరిగినవి.

## కలకత్తా వైద్యురాలిపై జరిగిన దారుణ సంఘటనను ఖండించిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ



**నందికొట్కూరు,ఆగష్టు 16 ( ఆంధ్రపత్రిక ):** వైద్యులపై దాడులను వెంటనే అరికట్టాలని, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ, వైద్యుల సంక్షేమ సంఘ ం నందికొట్కూరు తాలూకా అధ్యక్షుడు, బి వెం కట రమణ డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో, డాక్టర్, బి వెంకటరమణ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో అర్ధరాత్రి అనకుండా వైద్య సేవలు అందిస్తున్న వైద్యులపై దాడులు జరగడం చాలా బాధాకరమైన విషయమనిఅన్నారు, కలక త్తాలో జూనియర్ వైద్యురాలిని అతి దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడం దుర్మార్గమైన చర్యని దీనిని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో,వైద్యులు,కుమార్,ఎం ఎం భాష,రమణారెడ్డి, సలీం,పాల్గొన్నారు,

# గిరిజనుల సమస్యలు పరిష్కరించి వారి అభ్యున్నతికి పాటుపడాలి

## తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప



**శ్రీకాళహస్తి ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** గిరిజనుల సమస్యలు పరిష్క రించి వారి అభ్యున్నతికి పాటుపడాలని తిరుపతి జిల్లా బిజెపి అధ్య క్షులు డాక్టర్ చంద్రప్ప అన్నారు. తిరుపతి విధ్యుత్ కాలనీ లోని శు క్రవారం హంథీరాం జీ ఆలయం వద్ద గిరిజన సమస్యలను పరిష్క రించే విధంగా చొరవ చూపాలని విన్నవించారు. తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప తోకలసి,బిజెపి ఎస్సీటి సెల్ జిల్లా అధ్యక్షులు గుండాల నాయక్ ,బిజెపి నేషనల్ ఎస్టి కమిషన్ మెంబర్ జాటోతు హుసేన్ నాయక్ లుకి గిరిజనుల సమస్యలపై వినతి పత్రంను ఇవ్వడంజరిగింది.

# టిడిపి ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు పాటుపడుతుంది

## ఆలూరి ఇంచార్జ్ టిడిపి వీరభద్ర గౌడ్



**దేవనకొండ ,ఆగష్టు 16 (ఆంధ్రపత్రిక):** వర్షాలు సకాలంలో కురువనందున రైతులు పెట్టిన పెట్టుబడి చేతికందక తీవ్ర నష్టం వాటిల్లుతుందని దృష్టిలో ఉంచు కొని ఆలూరు టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్ పందికోన రిజర్వాయర్ నుండి ఎడ మ కాలువ ద్వారా గంగమ్మ తల్లికి హారతి ఇచ్చి నీటిని విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గతం ప్రభు త్వంలో హంద్రీ నీవా కాలువ పనులను పూర్తిగా నిర్వీర్యం చేసి రై తులను తీవ్ర నష్టం చేశారని మండి పడ్డారు. మా ప్రభుత్వంలో పెండింగ్లోఉన్న వేదవతి, నగరిడోణ,ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పను లు చేపట్టి పూర్తి చేస్తామని అంతేకాకుండా హంద్రీనీవా పెండింగ్ లో ఉన్న పిల్ల కాలువలను కూడా పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించేలా చర్యలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల కన్వీనర్ గై హాజ్జర్ అవ్వడానికి గల కారణ%శీ% వెనుక అంతర్యం ఏమిటని ప్రజల గుసగుసలు వినిపిస్తున్నాయి..ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు బండి గింజల రంగన్న మలకన్న, మాజీ ఎంపిటిసి రామారావు నాయుడు,వె లంకూర్ సర్పంచ్ భాస్కర్, కప్పట్రాళ్ల మల్లికా ర్జున, మాజీ ఎంపీటీసీ ఆకుల వీరేషు రాజా సాహెబ్ దేవనకొండ సర్పంచ్ భర్త బండ్లయ్య, జనసేన మండల కన్వీనర్ వీరేష్, నందు, ఆంటోనీ, ఉచ్చిరప్ప, కుంకనూరు వెలమకూరు అల్లరి దిన్నె దేవనకొండ పల్లె దొడ్డి కప్పట్రాళ్ల, గ్రామాల రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ పదవికి రాజీనామా?



**హిందూపురం, ఆగష్టు 16 ( ఆంధ్రపత్రిక ) :** హిందూ పురం మున్సిపల్ చైర్ పర్సన్ డిఎన్ ఇంద్రజ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి తన రాజీనామా పత్రం అందజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. గత మున్సిపల్ ఎన్నికల్లో 19వ వార్డు వైసిపి కౌన్సిలర్ గా గెలుపొంది మున్సిపల్ చైర్ పర్సన్ గా దాదాపు మూడున్నర సంవత్సరం పాటు పదవిలో కొనసాగింది. అయితే ఆగష్టు 15న హిందూ పురం పట్టణంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సమక్ష ంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత కారణాల వల్ల మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కమిషనర్ కు వినతిని సమర్పించినట్లు సమాచారం. మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ రాజీనామా విషయం మున్సిపల్ కమిషనర్ అనుసరించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా ఈనెల 20 న మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారు. ఆ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాజీనామా విషయం చర్చకు రావడానికి అవకాశం ఉంది.

## ఆంధ్రపత్రిక వార్షికోత్సవ సంచికను ఆవిష్కరించిన రెవిన్యూ అధికారులు



**బంగారుపాళ్యం-ఆగష్టు 16(ఆంధ్రపత్రిక):** మన దేశానికి స్వాతంత్య్రం రాక ముందు 1914వ నుండి స్వాతంత్ర్య పోరాటానికి వెన్నుగా నిలిచిన తెలుగు దినపత్రిక మన ఆంధ్రపత్రిక. అటువంటి పత్రిక వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక సంచికను ప్రచురించడం జరిగింది. వార్షికోత్సవ పత్రికను శుక్రవారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, డిటి అనిల్ కుమార్, మండల సర్వేయర్ లావణ్యలు మండల రెవిన్యూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రపత్రిక స్టాఫ్ రిపోర్టర్ కె.పి. రంగనాథ్ పాల్గొన్నారు.

## పత్తి రైతులకు టెలికాన్ఫరెన్స్



**ఎమ్మిగనూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోనెగండ్ల మండల పరిధిలోని ఎర్రబాడు. ఒంటెదుదిన్నె. గంజిహళ్ళ గ్రామ పత్తి రైతులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా సలహాలు సూచనల కార్యక్రమం నిర్వహించి నట్లు కెవికె కో ఆర్డినేటర్. ప్రదాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భం గా కెవికె కో ఆర్డినేటర్ ప్రదాన శాస్త్ర వేత మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితుల్లో పత్తిలో గులాబీ రంగు పురుగు ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు నన్నారు. ముందుగా ఎకరాకు ఎనిమిది లింగాకర్ష బుట్టలను పెట్టుకోవాలన్నారు. కలుపు మొక్కలను ఏరి వేయాలన్నారు. గులాబి రంగు పురుగు ఉధృతి తగ్గటానికి గడ్డి పూలను ఎరేవేయాలన్నారు. పురుగుల నష్ట పరిమాణం దృష్టిలో వుంచుకొని లీటరు నీటికి క్వినాల్ ఫాస్ 2.5 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పచ్చ పురుగు గ్రుడ్లు ఎక్కువగా వుంటే ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ లీటరు నీటి మోతాదులో కలిపి పిచికారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే మందు ఎక్కువసార్లు పిచికారీ చేయకుండా మందులు మార్చి మార్చి వాడుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రిలయన్స్ ఫౌండేషన్ జోనల్ మేనేజర్ ప్రకాష్ మరియు జిల్లా ప్రతినిధి నారాయణ పాల్గొన్నారు.

## వైష్ణవి మాత ఆలయంలో విశేష పూజలు

**చౌడేపల్లి, ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** వైష్ణవి దేవి మమ్ములను కరుణించి కాపాడు తల్లి అంటూ భక్తులు మొకరిల్లారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పుధిపట్లలో, గల స్వయంభు శ్రీ వైష్ణవి దేవి, ఆలయంలో విశేష పూజలు జరిగాయి. శుక్రవారం ఆలయ అర్చకురాలు శ్రావణి, ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకము, విశేష అలంకరణ నిర్వహించారు. దిన దినాభివృద్ధి జరుగుతున్న ఆలయంలో నాగ భైరవ, వీరాంజనేయ స్వామి, విగ్రహాలకు పూజలు జరిగాయి. ఈ ప్రాంతం నుంచే కాకుండా చుట్టుపక్కల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్మాణ కర్త వినోద్ కుమార్ రెడ్డి, పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

## బిజెపి విద్వేష రాజకీయాలను పోరాటాలతో ఎదుర్కొంటాం..

సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర




**కడప, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** బిజెపి విద్వేష, కుల మత, రాజకీయాలను, కార్పొరేట్ అజెండాను నిలువరించేందుకు సైద్ధాంతిక నిరంతర పోరాటాలను ఉధృతం చేయాలని జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో బిజెపి విఫలమైందని, అయినా దేశంలో బీజేపీ ప్రభుత్వం దుందుడుకుగా ప్రజాస్వామ్య రాహితంగా పనిచేయడం కొనసాగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు వామపక్ష ప్రజాస్వామ్య పార్టీలను మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని బిజెపి ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్నదన్నారు. మన దేశ సెక్యులర్ ప్రజాస్వామ్య వ్యవస్థను రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు నిరంతర పోరాటాలు కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, ఎల్.నాగ సుబ్బారెడ్డి, వీరశేఖర్, సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సిపిఐ నగర సహాయ కార్యదర్శిలు కే.సీ.బాదుల్లా, మద్దిలేటి నగర కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, నాగరాజు, బ్రహ్మం, మల్లికార్జున, లింగన్న, శంకర్ నాయక్, భాగ్యలక్ష్మి ఆర్.బాబు, యేసురత్నం, సుబ్బరాయుడు మునయ్య, ఈశ్వరయ్య, ఆచారమ్మ, నరసమ్మ, శివనాగేంద్ర, రాహుల్, వలరాజు, పకీరప్ప, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి




**బద్వేలు ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈనెల 17 18న నెల్లూరు నగరంలో జరుగు తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమైనటువంటి నాయకత్వం రెండు రోజులు పాటు నెల్లూరు నగరంలో ఈ కౌన్సిల్ సమావేశంలో కార్మికుల ఉద్యోగుల సమస్యల పైన చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల అవలంబించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆరోపిం చారు. ఈ తరుణంలో కౌన్సిల్ సమావేశాలు జరగడం ఒక ప్రాధాన్యతో కూడుకున్నదని తెలిపారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చినటువంటి ప్రభుత్వం కార్మికుల, ఉద్యోగుల స్కీం వర్కర్లు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అక్కడక్కడ వర్కర్లను బెదిరించడం తీసేయడం తొలగించడం చేయడం దుర్మార్గమని తెలిపారు. జిల్లా నుంచి కౌన్సిల్ వున్న నాయకత్వం నెల్లూరులో జరుగు సమావేశాలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

# స్వాతంత్య్ర సమరయోధులు గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలు

**బంగారుపాళ్యం-ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని బీసీ కార్యాలయంలో గౌతు లచ్చన్న గౌడ్ 115వ జయంతి వేడుకలను గౌడ సంఘ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా లచ్చన చిత్రపటానికి పూజలు చేసి బారీ కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మహేంద్ర మాట్లాడు తూ వచ్చే ఏడాది లచ్చన్న జయంతి నాటికి మండల కేంద్రంలో విగ్రహం పెట్టేందుకు ప్రభుత్వంతో మాట్లాడి స్థలం కేటాయించేందుకు అధికారులను కొరతామని తెలిపారు. రాష్ట్ర గౌడ సంఘం నాయకులు బుస్సా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ మండలంలో ఇదివరకే పోలీస్ స్టేషన్ సమీపంలో గౌతు లచ్చన్న గౌడ్ విగ్రహానికి స్థలం కేటాయించారని గతంలో శంకుస్థాపన కూడా ప్రారంభం జరిగిందని కానీ గత ప్రభుత్వం ఈ విషయాన్ని గాలికి వదిలేసారని ప్రస్తుత ప్రభుత్వం అయినా దీనిపై చర్యలు తీసుకుని ఆ స్థలంలో విగ్రహ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్ గౌడ్, మండల ఈడిగ సంఘ అధ్యక్షులు ఎల్లప్ప గౌడ్, జిల్లా గౌడ యువసేన ప్రధాన కార్యదర్శి లేబాకుల మురళి గౌడ్, జిల్లా సాధికారిక ఈడిగ సభ్యులు రెడ్డప్పగౌడ్, తెలుగు నాడు మండల గీత కార్మిక సంఘ అధ్యక్షులు రాజమాణిక్యం, మండల గౌడ సంఘ సభ్యులు గోపి, బాలాజీ, చంద్రశేఖర్, సుధాకర్, నాగరాజు, హరి, గజేంద్ర, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు..

- భక్తులతో కిట కిటలాడిన ఆలయాలు..
- మహిళలు ప్రత్యేక పూజలు.



**గూడూరు, ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** గూడూరు పట్టణంలోని హైస్కూల్ రోడ్డు ప్రాంతంలో ఉన్న శ్రీ రాజా రాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి మహిళలు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీ నారాయణ మ్మ పేరంటా లు తల్లి ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి మహిళలు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గూడూరు పట్టణ శివారు ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీ తాళమ్మ అమ్మ వారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా తాళమ్మ ను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయానికి విరివిగా చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



**గూడూరు, ఆగస్టు16 (ఆంధ్రపత్రిక):** గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్ నందు ఆదివారం చెన్నైకి చెందిన కె.వి.టి హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేస్తారు అన్నారు. గూడూరు నియోజక వర్గంలోని ప్రజలు పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కస్తూర్బా బాల బాలికల ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థినిల కడుపు మాడుస్తున్న ప్రిన్సిపాల్

ప్రజావాణిలో ఫిర్యాదు ఎంపీపీ రమాదేవి




**అట్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రి):** అట్లూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి ప్రిన్సిపల్ అవినీతి అక్రమాలపై అట్లూరు మండలాధ్యక్షురాలు పోత్త పి.రమాదేవి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల చైర్మన్ బి.సుబ్బమ్మ సోమవారం కడప కలెక్టరేట్లో జరుగుతున్న ప్రజావాణిలో ప్రిన్సిపల్ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమాదేవి, చైర్మన్ సుబ్బమ్మలు మాట్లాడుతూ ప్రిన్సిపల్ ఫణి శ్రీ పాఠశాల విద్యార్థులకు సరైన భోజన వసతి కల్పించకుండా పిల్లలకు పెట్టాల్సిన పౌష్టిక ఆహారంలో నాణ్యత లోపిస్తుందని ఆ స్కూల్ పిల్లల తల్లిదండ్రులు తెలిపినట్లు ఆంధ్ర పత్రిక విశాలాంధ్ర విలేఖరుల ఎదుట వాపోయారు. ఈమె అవినీతిపై జిల్లా కలెక్టర్ చేత సమగ్ర విచారణ జరిపించాలని ఎంపీపీ రమాదేవి కోరారు. పిల్లలకు నేను చెప్పిందే మెనూ, నేను పెట్టిందదే తిను అనే రీతిగా ఈ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఫణి శ్రీ భావిస్తున్నారు. పిల్లలు ప్రిన్సిపాల్ పై తల్లిదండ్రులకు పాఠశాలలో భోజనం చాలా అధ్వానంగా నాసిరకంగా తినలేని రీతిగాగా ఉందని ఏదైనా ఫిర్యాదు చేస్తే సమాచారం తెలుసుకున్న అనంతరం పిల్లలను దూషించడం, తిట్టడం, వ్యక్తిగతంగా హింసిస్తున్నారని ఈమెపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని గత వైసిపి ప్రభుత్వం లో వైసీపీ తొత్తుగా వ్యవహరిస్తు నా జోలికి వస్తే మీ మీద పోలీసులకు పై అధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ నేను స్కూల్లో ఉన్నప్పుడే ఎంపీపీ కానీ స్కూల్ చైర్మన్ కానీ వచ్చి తనిఖీ చేసుకోవచ్చున్నారు. నేను స్కూలు లేని సమయంలో గేటు దాటి లోపలికి వస్తే మీ మీద కేసు నమోదు చేయిస్తానని స్కూల్ చైర్మన్ ను ఎంపీపీ ని విలేకరులను స్థానిక పెద్ద మనుషులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. పిల్లల పౌష్టికాహారం బిల్లులలో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్న ఈ ప్రిన్సిపల్ ను ఇక్కడి నుంచి తొలగించి ఈ ప్రిన్సిపల్ స్థానంలో మంచివారిని నియమించాలని బద్వేలు నియోజకవర్గ ప్రజలు ఈ ప్రిన్సిపల్ ఇక్కడే కొనసాగించినట్లయితే చాలామంది పిల్లలు టీసీలు తీసుకొని వేరే స్కూల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రిన్సిపల్ సమయపాలన కూడా పాటించకుండా ఆమె ఇష్టం వచ్చినప్పుడు విధులకు వస్తుందని ఇది మంచి పద్ధతి కాదని అట్లూరు మండల ప్రజలు అనుకుంటున్నారు.

## ప్రతిభకు పేదరికం కాకూడదు



**గూడూరు, ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేటలో నివాసం ఉంటున్న రాపూరు మాధురి అనే బిటెక్ విద్యార్థినికి శుక్రవారం బలిజ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐదువేల రూపాయల ప్రోత్సాహ బహుమతిని అందచేశారు. ఈ కార్యక్రమానికి దాతగా కీర్తిశేషులు పైడా నాగేంద్ర రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు పైడా సిద్దీష్ కుమార్, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ గౌరవ అధ్యక్షురాలు సారంగం లక్ష్మి మాట్లాడుతూబలిజ కులస్తుల్లో 75 శాతం మంది పేద, దిగువ మధ్యతరగతికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబా లలో మట్టిలో మాణిక్యాలైనటువంటి ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రతిభ కు పేదరికం అడ్డుకాదని వారికి బలిజ మహిళా సంక్షేమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఇస్కా సువర్ణలక్ష్మి, పసుపులేటి ఉమాదేవి, నీలి ఉష, బళ్లారి రాధా తదితరులు పాల్గొన్నారు.

## వీధుల్లో మురుగు నీరు అపరిశుభ్రం మండిపడ్డ డిఎంహెచ్ఓ ప్రభావతి



**యాదమరి, ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** మండల పరిధిలోని 12 కమ్మపల్లి పంచాయతీ రసూల్ నగర్ గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి తనిఖీ చేసి గ్రామ వీధుల్లో బహిరంగంగా నీరు ప్రవహిస్తుండడం చూసి విస్మయం, అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఇటీవలే రసూల్ నగర్ గ్రామంలో డెంగీ కేసు నమోదవడంతో గ్రామ సందర్శన కు వెళ్లిన డిఎంహెచ్ఓ ప్రభావతి బహిరంగంగా వీధుల్లో మురుగు నీరు పారుతూ అపరిశుభ్రంగా వీధులు దర్శనమివ్వడం తో అవాక్కయ్యారు. వృధాగా వీధుల వెంట పారుతున్న నీటిని వెంటనే అరికట్టి చర్యలు చేపట్టాలని, పరిశుభ్రత పాటించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి గోపిని ఆదేశించారు. గ్రామంలో అపరిశుభ్రతపై జిల్లా పంచాయతీ అధికారికి లేఖ ద్వారా ఫిర్యాదు చేయాలని వైద్యాధికారి శివకుమార్ రెడ్డికి సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటి ఇంటికి మలేరియా, డెంగీ నమూనా పరీక్షల తనిఖీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి అనిల్ కుమార్, సబ్ యునిట్ అధికారి పీరూ సాహెబ్, సూపర్ వైజర్ విజయ లక్ష్మి, ఎం పీ హెచ్ ఓ, మునీంద్రా రాజు సిబ్బంది స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## ఫల సరుకులు పంపిణీ



**గూడూరు, ఆగస్టు 16 ఆంధ్రపత్రిక:** గూడూరు పట్టణంలోని కమ్యూనిటీ హాల్లో పేదలకు వై. జె.పి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఫల సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ క్లబ్ రీజినల్ చైర్మన్ ఆర్.వి రావు మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం డి. ఎన్.అర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల న్నారు. అనంతరం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో ముఖ్యమైన విషయములు సేవా కార్యక్రమముల గురించి సలహాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై జె పి అధ్యక్షుడు మనోజ్ కుమార్ పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యం యాదవ్ సెక్రటరీ. శీనయ్య, ట్రెజరర్. పసుపులేటి ప్రసాద్, ట్రెజర్ గోపీనాథ్ రెడ్డి, పర్మనెంట్ ప్రాజెక్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మురళి నాయుడు, మురళి రాజు, ఎస్.ఎల్ఎన్ స్వామి, రవీంద్ర రెడ్డి, సుధాకర్, ఉప్పల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ మహిళా పోలీసుగా అవార్డు అందుకున్న అనిత



**బంగారుపాళ్యం-ఆగస్టు 16(ఆంధ్రపత్రిక):** 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు15న చిత్తూరు పోలీస్ గ్రౌండ్లో ఎస్పీ మణికంఠ చందోలు చేతులు మీదుగా బంగారుపాళ్యం అప్ గ్రేడ్ పోలిస్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేయుచున్న అనిత కుమారి డ్యూటీ లో ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు ఉత్తమ అవార్డు అందుకున్నారు. తమ స్టేషన్ నుంచి ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ మహిళా పోలీసుగా అవార్డు అందుకున్న టి అనిత కుమారిని సీఐ యు.లక్ష్మయ్య, పోలీస్ సిబ్బంది అభినందించారు.



# అష్టలక్ష్మీ మండపంలో శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం

## స్వర్ణరథంపై విహరించిన అమ్మవారు



**తిరుమల, ఆంధ్రపత్రిక :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వేకువజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, మూల వర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. ఈ పర్వదినాన అమ్మవారు బంగారుచీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ పద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోతర శత నామావళి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి సాంప్రదాయ పుష్పలతో అమ్మవారిని ఆరాధించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 9 గ్రంథులతో(నూలుపోగు) అలంకరించారు. ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధించారు. భవిష్యోత్తర పురాణంలో వ్యాస భగవానుడు వరలక్ష్మీ వ్రతం పూజావిధానాన్ని, మహత్యాన్ని తెలియజేశారని పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీ మణికంఠ స్వామి తెలిపారు. పూర్వం శంకరుడు పార్వతిదేవికి ఈ వరలక్ష్మీ వ్రతం విశిష్ఠత, అచరించవలసిన విధానాన్ని తెలియచేసినట్లు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. త్రేతా యుగంలో కుండలినీ నగరంలో నివసించిన చారుమతి అనే భక్తురాలు వరలక్ష్మీ నోము ఆచరించి పొందిన ఫలప్రదాన్ని ఈ సందర్భంగా వివరించారు. సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి ప్రీతితో అవతరించిన తిరుచానూరులో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలకు సత్సంతానం, దీర్ఘమాంగల్యసౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబసౌఖ్యం వంటి ఎన్నో మహాఫలాలు కలుగుతాయని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. తరువాత 12 రకాల వివిధ నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. అనంతరం మహా మంగళ హారతితో వరలక్ష్మీ వ్రతం ముగిసింది. ఈ సందర్భంగా టిటిడి ఇఓ జె.శ్యామల రావు మీడియాతో మాట్లాడుతూ, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినట్లు చెప్పారు. మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నట్లు తెలిపారు. వరాలు ప్రసాదించే అమ్మవారు కావడంవల్ల వరలక్ష్మీ వ్రతం అని పిలుస్తారని అన్నారు. ఈ వ్రతం ఆచరిస్తే అష్టలక్ష్ములను ఆరాధించిన ఫలితం లభిస్తుందని భక్తుల విశ్వాసమన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు, అన్నప్రసాదాలు ఇతర ఏర్పాట్లు చేశామన్నారు. సాయంత్రం 6 గంటలకు స్వర్ణ రథంపై అమ్మవారు భక్తులను కటాక్షిస్తారని తెలిపారు.

**భక్తులను విశేషంగా అకట్టుకున్న వ్రత మండపం:** టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్యర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా అకట్టుకుంది. 15 మంది సిబ్బంది, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, పది రకాల 20 వేల కట్ ఫ్లవర్స్ తో మూడు రోజుల పాటు శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, వ్రత మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇందులో ద్రాక్ష, బత్తాయి, పైనాపిల్, మొక్కజొన్న వంటి ఫలాలు, వివిధ సంప్రదాయ పుష్పాలతో వ్రత మండపాన్ని అద్భుతంగా రూపొందించారు. మండపంపై భాగంలో గజలక్ష్మీ అమ్మవారు, కింది భాగంలో రెండు వైపుల ఐరావతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆస్థాన మండపాన్ని అష్టలక్ష్మిమూర్తులతో,రోజాలు, తామర పూలు లాంటి రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. చెన్నైకి చెందిన దాతల విరాళంతో పుష్పాలంకరణ చేపట్టామని ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. భక్తులందరూ వ్రతాన్ని వీక్షించేందుకు వీలుగా ఆస్థాన మండ పంలో 1, పుష్కరిణి వద్ద 1, వాహన మండపం వద్ద 1, ఫ్రైడే గార్డె న్స్ 1, తొలప్ప గార్డెన్ 1 కలిపి 5 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

**స్వర్ణరథోత్సవం:** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జెఇఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఇఓ గోవింద రాజన్, ఎస్ ఇ -2 జగదీశ్వర్ రెడ్డి, విజిఓ నంద కిషోర్, ఏఈఓ రమేష్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు గణేష్, సుభాష్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



**తిరుమల,ఆగస్టు 16 ఆంధ్రపత్రిక :** తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇఓ జె.శ్యామలరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఆ తరువాత సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం వేద ఘోష, మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి మూలవర్లకు, ఉత్సవ మూర్తులకు, జయవిజయులకు, గరుడాళ్వారుకు, వరదరాజస్వామివారికి, వకుళమాత అమ్మవారికి, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనులవారికి, యోగనరసింహస్వామి వారికి, భాష్యకార్లకు, పోటు తాయారుకు, ధ్వజస్తంభం, బలిపీఠం, శ్రీభూవరాహస్వామివారికి, శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి పవిత్రమాలలు సమర్పించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కారణంగా శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డెప్యూటీ ఇఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సాధనలో ఆంధ్రపత్రిక పాత్ర అమోఘం

- సీఐ సోమశేఖర్ రెడ్డి

### సీఐచే వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ..



**వి.కోట, ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** భారత స్వాతంత్ర్య సిద్ధించుటకు జాతిని పురిగొల్పేందుకు ఆంధ్ర పత్రిక అహర్నిషలు శ్రమించిందని వి.కోట అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన సమరయోధులు,గొప్ప మేధావి ,గాంధీజీచే విశ్వదాత అని పిలువబడిన కాశీనాథుని నాగేశ్వర రావుచే స్థాపించబడిన ఆంధ్రపత్రిక స్వాతంత్ర్య సాధనలో కీలకపాత్ర పోషించిందని కొనియాడారు. తరతరాలుగా ఆంధ్రుల అభిమాన ఔషదం "అమృతాంజన్" సృష్టికర్త అయిన నాగేశ్వ రరావు , ఆంధ్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన శ్రీభాగ్ ఒడంబడికలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. 111వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఆంధ్రపత్రిక నిజాల్ని నిర్భయంగా రాస్తూ,ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల సాధనకు పాటుపడుతూ ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై జయకృష్ణ, ఆంధ్రపత్రిక వి.కోట రిపోర్టర్ ఆర్ .రమేష్ బాబు, మధు ప్రకాష్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## ఏపియుడబ్లుజే ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**ఎమ్మిగనూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** నేడు జరుగనున్న ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 67 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఏపియుడబ్లుజే జెండా ఆవిష్కరణ. సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏపియుడబ్లుజే తాలుకా అధ్యక్షులు బి. శ్రీనివాసనాయుడు. చిన్న ఆకుల నాగరాజు. పట్టణ అధ్యక్షులు జిబి. పరమేశ్ లు తాలుకా కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత తహసీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి ముందుగా మహాత్మ గాంధీ,బీఆర్ అంబేత్కర్ ,మాచాని సోమప్ప విగ్రహాలకు పూల మాల వేసి సోమప్ప సర్కిల్ లో ఏపియుడబ్లుజే జెండాను ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం సేవా కార్యక్రమాలు భాగంగా హెచ్ బిఎస్ కాలనిలో పులే అంబేత్కర్ అనాథ ఆశ్రమం లో నిత్యావసర వస్తువు లు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఆగస్టు 17 వ తేదీన ఉదయం 8 గంటలలోపు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి టిఫిన్ కార్యక్రమం అనంతరం చేయబోయే కార్యక్రమాలని శ్రీకారం చుట్టడం జరుగుతుంది. ఎమ్మిగనూరు పట్టణ, ఎమ్మిగనూరు మండలం, గోనెగండ్ల,నందవరం మండలం ఏపియుడబ్లుజే నాయకులు సభ్యులు తమ పనులు వాయిదా వేసుకుని వార్షికోత్సవానికి తప్పక హాజరు కావాలన్నారు.

## ఆంధ్ర నీటి వాటా రాబట్టడం అధికారులు విఫలం



**ఎమ్మిగనూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రకు రావాల్సిన ఎల్ఎల్ సి నీటి వాటా రాబట్టడంలో ఎల్ ఎల్ఎల్ సి అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సంబందిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎల్ ఎల్సీ డైరెక్టర్ గడ్డం నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎల్ఎల్సీ డైరెక్టర్ మాట్లాడుతూ సంబందిత అధికారులు. ప్రజాప్రతినిధులు ఇంతవరకు ఏఏ కాలువలకు ఎక్కడ వరకు నీరు విడుదల చేస్తామన్నా రైతులు ఏ పంటలు సాగు చేసుకోవాలి ఎక్కడ వరకు నీరు విడుదల చేస్తామని వివరాలు తెలుపుక పోవడం ఆయకట్టు రైతులపై అధికారులు చిన్ని చూపు చూస్తున్నారని తెలుస్తోందన్నారు. నందవరం మండలం హలహార్వి గ్రామ శివారులోని దేశాయి చెరువుకు వెంటనే నీరు విడుదల చేసి రైతులు ఆదుకోవాల్సిందిగాకోరడమైనది. గత పది రోజులుగా మన బార్డర్లో రావాల్సిన 720 క్యూసెక్కులకు గాను కేవలం 350 క్యూసెక్కులు వస్తున్న పట్టించుకోని అధికారులుగా ఎమ్మిగనూరు బార్డర్లో రావలసిన 320 క్యూసెక్కుల గాను కేవలం 120 క్యూసెక్కులు వస్తుంటే చోద్యం చేస్తున్న అధికా రులుగా మారారన్నారు. అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ ఇంతవరకు ఏఏ కాలువలకు ఎక్కడి వరకు నీరు విడుదల చేస్తాము, రైతులు ఏ పంటలు సాగు చేసుకోవాలి ఎక్కడి వరకు నీరు విడుదల చేస్తామని పూర్తిగా తెలుపలేదన్నారు. ఇప్పటికైనా పంటలు వేసుకున్న రైతులు వర్షాభావ పరిస్థితులు వలన ఎండిపోతుంటే ఆ పంటలను కాపాడ వలసింది గా రైతులు వేడుకుంటున్నారు, కర్నూలు జిల్లాకు ఆయూపట్టైన ఎల్ఎల్సిను నిర్లక్ష్యం చేయడం తగదు, వెంటనే అధికారులు స్పందించి నీటి వాటాను రాబట్టి వచ్చిన నీటిని ఆయికట్టు రైతులకు వెళ్లే మాదిరిగా చూసుకోవాలనన్నారు, నీటి వాటాపై వెంటనే ఎమ్మెల్యేలు ఎంపీలు స్పందించి మన వాటా నీటిని రాబట్టాల్సిందిగా కోరడమైనది. లేనిచో రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

## స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతం



**ఆత్మకూరు, ఆగస్టు 16 ఆంధ్రపత్రిక:** ఇంద్రాక్షీ అమ్మవారి తిరునాళ్ళ సందర్భంగా చుంచులూరు గ్రామంలో రిమ్స్ హాస్పిటల్,కడప వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతమైంది. గ్రామానికి చెందిన యువత ఎంతో ఉత్సాహంగా,సామాజిక బాధ్యతతో రక్త దానం చేశారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రిమ్స్ మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నయం ప్రపంచంలో ఇంతవరకు ఎక్కడా కనుగొనబడ లేదని, రక్తదానం ద్వారా మాత్రమే రక్తాన్ని సేకరించి, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడగలమని అన్నారు. గ్రామానికి చెందిన 46 మంది ఈరోజు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## మున్సిపల్ కమిషనర్ సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు



**ఎమ్మిగనూరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** పట్టణంలోని ప్రజలు సమస్యల పరిష్కారానికి గత రాష్ట్ర ప్రభు త్వం ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టా రు. శుక్రవారం ఆకస్మిక తనిఖీలు భాగంగా గాంధీ నగర్ 01. క్వీబుల కాలనీ 02 సచివాలయాల అటెండెన్స్. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించే దశలో నిర్ణీత సమయంలో అందించాలన్నారు.

## పాడి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి



**రాయచోటి ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):** అన్నమయ్య జిల్లా లోని పాడి రైతులను ప్రభుత్వం తక్షణమే పాల రేట్లు పెంచి ఆదుకోవాలనిసి పి ఐ ఎం ఎల్ లిబరేషన్. అన్నమయ్య జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు గతంలో గేదె పాలు లీటరు రూ 70 నుంచి రూ 80 వరకు , ఆవుపాలు లీటరు రూ 35 నుంచి రూ 40 వరకు ధరలు వుండేవన్నారు. ప్రస్తుతం పాల ధరలు బాగా తగ్గాయన్నారు. ప్రస్తుతం గేదె పాలు లీటరుకు రూ 65 నుంచి 75, ఆవుపాలు లీటరుకు రూ 25 నుండి రూ 35 చెల్లిస్తుండ డంతో పాడి రైతులు నష్టాలును ఎదుర్కొం టున్నారన్నారు. పశువుల ధరలతో పాటు దానా, గడ్డి,పశువుల వైద్యం ఖర్చులు పెరగడంతో పాడి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఆవులను లక్షలరూపాయలు పెట్టుబడి. పెట్టి కొనుగోలు చేసినా గిట్టుబాటు దర లేక నానా ఇబ్బందులు. పడుతున్నారన్నారు. వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపై ఈ ప్రాంత రైతులు ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు బ్యాంకులు,డైరీలు, ప్రయివేట్ ఫైనాన్స్ ల ద్వారా అప్పులు చేసి పాడి ఆవులు, గేదెలును కొనుగోలు చేసుకుంటున్నారన్నారు. పశుగ్రాసం అధిక భారమవుతోందన్నారు. రైతులు, మహిళలు తమ పిల్లల చదువుల కోసం, కుటుంభ పోషణ కోసం జీవనాధారంగా కొనసాగి స్తున్న పాడిపరిశ్రమను బలోపేతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో సి పి ఐ. ఎం ఎల్ లిబరేషన్. రాయచోటి ఏరియా నాయకులు పి.రమణ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ఇంద్రాక్షి అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం



**ఆత్మకూరు, ఆగస్టు 16 ఆంధ్రపత్రిక:** శ్రీ ఇంద్రాక్షీ అమ్మవారి తిరునాళ్ల కార్యక్రమాన్ని చుంచులూరు గ్రామంలో ఎంతో వైభవంగా నిర్వహించారు.లక్ష్మీ గణపతి హోమం,స్కంద హోమం,శ్రీ ఇంద్రాక్షి హోమం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రతం ఎంతో వైభవంగా నిర్వహించారు.గ్రామంలోని మహిళలందరూ సామూహిక పొంగళ్ళ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు వైద్య సేవలు నిలిపివేత: ఐఎంఏ

**పీలేరు, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక) :** అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని పీలేరు లో 17 వ తేదీ వైద్య సేవల నిలిపివేస్తామని ఐఎంఏలు తెలిపారు. కోల్కతాలో ఆర్.జీ.కర్ ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో ఆగస్టు 9వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం డిమాండ్ చేస్తూ, దానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న ఆర్ జి కర్ వైద్య కళాశాల ఆసుపత్రి విద్యార్థులు, వైద్యులపై ఆగస్టు 14వ తేదీ రాత్రి రౌడీమూకల దాడులను నిరసిస్తూ జాతీయ ఐఎంఏ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ శాఖలు 17వ తేదీ 24 గంటలపాటు వైద్య సేవలు నిలిపివేయాలని పిలుపునివ్వడం జరిగింది, అందులో భాగంగా పీలేరు నందు శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నగరంలోని/ పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో, అత్యవసర సేవలు మినహాయించి, ఓపిడి సేవలు, అత్యవసరం కాని శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో నిలిపివేయడం జరుగుతుందని ఐఎంఏ పీలేరు శాఖ తెలిపింది. వైద్య సిబ్బంది పై జరుగుతున్న దాడులపై ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి,సిబిఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి,నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలని, ఆసుపత్రులలో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి ఈశ్వర్ సురేంద్ర. తెలిపారు. ఈ నిరసన తర్వాత ప్రభుత్వాలు తీసుకునే చర్యలను బట్టి తదుపరి కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని, తమ డిమాండ్లు సాధించేవరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామని, వృత్తి నిర్వహణలో రక్షణ కల్పించమని అడుగుతున్న తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాల మద్దతు ఇవ్వాలని కోరారు.

## నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద వేడుకగా ఛత్రస్థాపనోత్సవం



**తిరుమల, ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** తిరుమల నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద శుక్రవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీవారి పాదాల వద్ద టీటీడీ అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్టించారు. తిరుమల శ్రీవారి ఆలయం నుండి పూజా సామగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడ వీధుల గుండా అర్చక బృందం మేదరమిట్టకు చేరుకున్నారు. అక్కడి నుండి నారాయణగిరికి విచ్చేశారు. ముందుగా శ్రీవారి పాదాలకు తిరుమంజనం చేపట్టారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. ఆ తరువాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ద్వాదశి నాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి మరో నమ్మకం కూడా ఉంది. సాధారణంగా ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో మరింత ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్టిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పార్పత్తేదార్ హిమత్ గిరి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణరథంపై సాక్షాత్కారించిన శ్రీ పద్మావతి అమ్మవారు



**తిరుమల,ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం స్వర్ణరథంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తన్మయత్వంతో నాలుగుమాడ వీధుల్లో రథాన్ని లాగారు. కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. స్వర్ణ రథోత్సవంలో జెఇఓ జె. శ్యామల రావు దంపతులు, ఎస్ఇ జగదీశ్వర్రెడ్డి, ఆలయ డెప్యూటీ ఇఓ గోవింద రాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శ్రీవాణి, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి యువకుడు కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మృతి



**చౌడేపల్లి,ఆగస్టు16(ఆంధ్రపత్రిక):** చౌడేపల్లి పట్టణానికి చెందిన ఓ యువకుడు కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... చౌడేపల్లి పట్టణం కేటి స్ట్రీట్ కి చెందిన రెడ్డప్ప చారి కుమారుడు లోకేష్ (19) కర్ణాటక రాజధాని బెంగళూరులో స్కూటర్ మెకానిక్గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి చౌడేపల్లికే చెందిన తన మిత్రుడు పవన్ (18) తో కలిసి ద్విచక్ర వాహనంలో బెంగళూరు నుంచి చౌడేపల్లికి బయలుదేరారు మార్గమధ్యంలోని చిక్బలా పూర్, వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్ కు కాలు విరిగి గాయాలయ్యాయి. రెడ్డప్ప ఆచారిది కూలి పనులు చేసుకుని జీవించే కుటుంబం, చేతికి అందిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం బోరున విలపించింది.





బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామ శర్మ గారి శత జయంతి సందర్భంగా నెల్లూరులోని రేబాల లక్ష్మీనరసారెడ్డి గారి మందిరంలో తెలంగాణ సారస్వత పరిషత్, హైదరాబాద్ - పద్య కళాపరిషత్, నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శత జయంతి వేడుకల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి...

# విలువలతో కూడిన పత్రిక ఆంధ్రపత్రిక



ఆంధ్ర పత్రిక వార్షికోత్సవ సంచికను ఆవిష్కరించి పత్రికా యాజమాన్యాన్ని అభినందించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):**విలువలతో కూడిన పత్రిక ఆంధ్ర పత్రిక అని దేశ స్వాతంత్ర్య సమర కాలంలో పుట్టి గొప్ప పత్రికగా విఖ్యాతి గడించిన ఘన చరిత్ర కలిగిన ఆంధ్ర పత్రికలో ఎందరో పాత్రికేయులు, తమ కలం ద్వారా స్ఫూర్తిదాయకమైన సమాచారం అందించారన్నారు. శుక్రవారం కలెక్టర్ వారి ఛాంబర్‌లో ఆంధ్రపత్రిక వార్షికోత్సవ సంచికను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆవిష్కరించారు. వీరితో బాటు ఆంధ్ర పత్రిక జిల్లా బ్యూరో వక్కలంక వెంకట రామకృష్ణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు చందమామ బాబు, పాత్రికేయులు కొడాలి వేణు, డి.రాంప్రసాద్, సద్గుణ రావు, సురేష్‌లు పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1914లో ప్రారంభమైన దినపత్రిక వార్తా ప్రపంచంలో మిగతా పత్రికలతో బాటు ప్రత్యేక స్థానంలో వెలుగొందుతోందన్నారు. 110 సంవత్సరాలకు పైగా పత్రికా రంగంలో ఎనలేని సేవ చేస్తోందన్నారు. ప్రింట్ రూపంగానే గాక ఆధునిక సాంకేతికతను ఈ- పేపర్ రూపంలో, ప్రింట్ డిజిటల్ రూపాలలో యాజమాన్యం విస్తృతపరిచే ప్రయత్నాలు చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఆంధ్ర పత్రికలో నాటి విలువలు నేటికి కూడా ధ్వనించేలా కృషి చేయాలన్నారు. వార్షికోత్సవ సంచిక ఆకర్షణీయంగా ఉండడం పట్ల, విలువైన సమాచారాన్ని అందించడం పట్ల ప్రశంసించారు. జాతి పునర్నిర్మాణంలో పత్రికల పాత్ర ఎనలేనిదన్నారు. దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు వేసిన బాటలో పత్రిక నడుపుతున్న యాజమాన్యాన్ని అభినందించారు.




ఆంధ్ర పత్రిక వార్షికోత్సవ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ. చిత్రంలో రాజమండ్రి స్టాఫ్ రిపోర్టర్ సిహెచ్.రాజు

# పేదల ఆకలి తీర్చే అపర సంజీవని అన్నా క్యాంటీన్



## మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం,ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):**పేదల ఆకలి తీర్చడానికి అన్నా క్యాంటీన్లు అపర సంజీవని లాగా ఉపయోగపడతాయని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఆబ్కారి శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నగరంలోని మూడు స్తంభాల సెంటర్ వద్ద పునరుద్ధరించిన అన్న క్యాంటీన్‌ను రాష్ట్ర మంత్రివర్యులు మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, మాజీ పార్లమెంటు సభ్యులు కొనకల్ల నారాయణరావులతో కలిసి పునః ప్రారంభించారు. రవీంద్ర రిబ్బన్ కట్ చేసి అన్న క్యాంటీన్లోకి ప్రవేశించి ఎంపీతో కలసి లబ్ధిదారులకు అల్పాహారం వడ్డించారు. మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు వారి సతీమణి నారా భువనేశ్వరితో కలిసి గుడివాడలో అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని సంకల్పించామన్నారు. ఈ శుక్రవారం అన్ని ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను పునః ప్రారంభిస్తున్నామన్నారు.అలాగే మాదివాడ రాము తన కుమారుడు ఆశ్రిత్ మొదటి నెల జీతం లక్ష రూపాయలు చెక్కును అందజేశారని వారిని ఈ సందర్భంగా అభినందిస్తున్నానన్నారు. దాతలు ఎవరైనా సరే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించాలన్నారు. ఆనాడు అన్న నందమూరి తారక రామారావు తిరుమల లో అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి వేలాదిమందికి భోజనం కల్పించడం జరిగిందన్నారు. దాతలు ఇచ్చిన విరాళాలపై వచ్చే వడ్డీతోనే నేడు అన్నదాన కార్యక్రమం నడుస్తోందన్నారు. పేదలకు స్వచ్ఛమైన రుచికరమైన భోజనం అందిస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఏర్పాటుచేసిన కార్యక్రమం అన్న క్యాంటీన్ అని పేదవారు హోటల్‌కి వెళ్లి భోజనం చేయాలంటే 75 రూపాయల నుంచి వంద రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేద ప్రజల కడుపు నింపడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్నవారు పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా విరివిగా విరాళాలు అందించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ప్రతి పేదవాడు కోరుకునేది కడుపునిండా తిండి తినాలని, అది తీరితే అంతకన్నా కోరుకునేది ఏమీ లేదన్నారు. తన పార్లమెంటు నియోజకవర్గంలోని గుడివాడలో అన్న క్యాంటీన్ తొలుత ప్రారంభించడం శుభసూచకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, స్థానిక నాయకులు బండి రామకృష్ణ, కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, డాక్టర్ బృందావనం ధన్వంతరిఆచారి, మాదివాడ రాము, హరే కృష్ణ ఫౌండేషన్ ట్రస్ట్ అక్షయపాత్ర సమన్వయకర్త ఆషి బాబు, తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీ చేరుకున్న సిఎం చంద్రబాబు



## కేంద్ర జలవనరుల శాఖ మంత్రి పాటిల్‌తో భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 16 :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండ్రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకు న్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు. పూసపాటి విజయరామ గజపతిరాజు, రెండ్రోజుల పర్యటనలో భాగంగా మోడీ, నిర్మలా సీతారామన్ సహా పలువురు కేంద్ర మంత్రులు చంద్రబాబు కలవనున్నారు. రాత్రి కేంద్ర జలవన రుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో బాబు సమావేశం అయ్యారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులపై కేంద్ర మంత్రితో చర్చించారు. సీఎంతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పలువురు ఎంపీలు సమావేశంలో పాల్గొన్నారు.




విజయవాడలోని అయోధ్యనగర్‌లో అన్న క్యాంటీన్ ప్రారంభంతో ఆకలి తీర్చుకుంటున్న ప్రజలు




విజయవాడలోని బుడమేరు వాగుపై డ్రోన్ ద్వారా దోమల నివారణ రసాయనాలను పిచికారీ చేస్తున్న వీఎంసీ సిబ్బంది

ఆంధ్రపత్రిక ఫోటోలు: సిహెచ్.విజయభాస్కర్

# ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవ ఎన్నిక

## ధృవీకరణ పత్రం అందజేసిన ఆర్వో కె.మయూర్ అశోక్



**విశాఖపట్టణం, ఆగస్టు 16 (ఆంధ్రపత్రిక):**స్థానిక సంస్థల కోటాలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా అందులో స్వతంత్ర అభ్యర్థి షేక్ సఫీ ఉల్లా ఈ నెల 14వ తేదీన నామినేషన్ ఉపసంహకరించుకున్నట్లు అంగీకారం పత్రం అందజేశారు. దీంతో వైకాపా నుంచి నామినేషన్ వేసిన బొత్స సత్యనారాయణ ఒకరే బరిలో నిలిచారు. 16వ తేదీ సాయంత్రం 3.00 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియటంతో పోటీలో ఎవరూ లేనందున ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొంటూ సంబంధిత పత్రాన్ని రిటర్నింగ్ అధికారి కె. మయూర్ అశోక్ తన కార్యాలయంలో అందజేశారు. శుక్రవారం సాయంత్రం వైకాపా నేతలు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి బొత్స సంబంధిత పత్రాలపై సంతకాలు చేసి ఆర్వో నుంచి ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, వరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, జడ్పీ ఛైర్పర్సన్ జె. సుభద్ర, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబు రాజు, ధర్మ శ్రీ, అదీప్ రాజు, నాగిరెడ్డి, కంబాల జోగులు ఇతర నేతలు ఉన్నారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com